

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




ఆదివారం | 3-8-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 126 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ.9.42 తదుపరి దశమి; నక్షత్రం: విశాఖ ఉ. 6.35 తదుపరి అనూరాధ; వర్జ్యం: ఉ.11.01-12.47; దుర్ముహూర్తం: సా.5.01-5.52; అమృతఘడియలు: రా.9.40-11.27; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.58; సూర్యాస్తమయం: 6.43 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అన్నీ తానే.. అంతా తందానే!



జస్టిస్ పీసీ ఘోష్

కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యానికి పాపాల భైరవుడు కేసీఆరే

- బ్యారేజీలు ఎప్పుడు, ఎక్కడ, ఎలా కట్టాలో ఆయనే చెప్పారు
- నీటి నిల్వ నిర్ణయమూ ఆయనదే.. ఓఅండ్ఎం చేయించలేదు
- అంచనాలు పెంచిందీ.. కాంట్రాక్టులను సవరించిందీ ఆయనే
- బ్యారేజీలు కూలడానికి, అవకతవకలకు కారణం కేసీఆరే
- బ్యారేజీలు ఎక్కడ కట్టాలన్నది కేసీఆర్, హరీశ్ సొంత నిర్ణయమే
- వీళ్లు నిర్ణయం తీసుకుని, ఆ తర్వాత వ్యాప్కోస్‌కు బాధ్యతలు
- హైపవర్ కమిటీ నిర్ణయాన్నీ తుంగలో తొక్కేశారు
- భారీఎత్తున ప్రజాధనం దుర్వినియోగానికి కారణమయ్యారు
- మేడిగడ్డ ఏడో బ్లాకు పునరుద్ధరణ బాధ్యత ఎల్ అండ్ టీదే
- అన్నారం, సుందిళ్ల లోపాలు సరిచేయాల్సింది నిర్మాణ సంస్థలే
- కమిషన్‌కు కేసీఆర్, హరీశ్ తప్పుడు సాక్ష్యాలిచ్చారు
- నిగ్గుతేల్చిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఎక్కడ కట్టాలో నిర్దేశించింది కేసీఆర్! బ్యారేజీలను ఎలా కట్టాలో చెప్పింది కేసీఆర్! వాటిని ఎప్పుడు పూర్తి చేయాలో.. ఎలా నిర్వహించాలో స్పష్టం చేసిందీ ఆయనే! అంతేనా.. ప్రాజెక్టు అంచనాలను మార్చిందీ.. కాంట్రాక్టులను సవరించిందీ ఆయనే! ఒక్క మాటలో చెప్పాలంటే.. ప్రతి చిన్న విషయంలోనూ ఆయన జోక్యం చేసుకోవడమే కాదు.. పనులు ఎలా చేయాలో నిర్దేశమూ ఇచ్చారు! మూడు బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలకు.. చివరికి అవి బీటలు వారి, కుంగిపోయి, విఫలం కావడానికి కారణం ఇదే!

.. కాళేశ్వరం బ్యారేజీల కుంగుబాటుపై నియమించిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నివేదిక సారాంశమిదే!


నిజానికి, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రానికి జీవనాడి. కానీ, పాలనలో, ప్లానింగ్‌లో, సాంకేతిక, ఆర్థిక క్రమశిక్షణలో సుస్పష్ట నిర్లక్ష్యంతో భారీ ఎత్తున ప్రజా ధనం వృథా కావడానికి కారణమయ్యారు.

బ్యారేజీలను నీటిని మళ్లించడానికే కట్టాలి. నిల్వ చేయడానికి కాదు. కానీ, బ్యారేజీల్లో నిత్యం నీటిని పూర్తి సామర్థ్యంతో నిల్వ చేయాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. బ్యారేజీలు విఫలం కావడానికి ఇది ప్రధాన కారణం.

కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై రేపే క్యాబినెట్ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్లానింగ్, ఎగ్జిక్యూషన్, కంప్లీషన్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ మాత్రమే కాదు.. ధరలు, కాంట్రాక్టుల సవరణల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పూర్తి బాధ్యత కేసీఆర్‌దేనని జస్టిస్ ఘోష్ కమిషన్ తేల్చింది. అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. రాజకీయ నాయకులు బాధ్యతా రహితంగా పని చేశారని తప్పుబట్టింది. అంతేనా.. నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీపైనా ఘాటుగానే స్పందించింది. మేడిగడ్డలోని ఏడో బ్లాకును ఆ సంస్థ సొంత ఖర్చులతో పునర్నిర్మించాలని తేల్చి చెప్పింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇటీవలే తన నివేదికను ప్రభుత్వానికి అందజేసిన సంగతి తెలిసిందే. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం కమిషన్ పలు అంశాలను ఎత్తిచూపింది. ప్రాజెక్టు నిర్మాణంలో పాలన పరమైన, ఆర్థిక అవకతవకలు జరిగాయని, నిర్మాణానికి సరైన ప్లానింగ్ లేదని, డిజైన్లోనూ లోపాలున్నాయని స్పష్టం చేసింది. నిర్మాణంలో లోపాలు ఉండడమే కాకుండా నిర్వహణ పూర్తిగా లోపించిందని తేల్చింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి కిందిస్థాయి ఇంజనీర్ వరకూ ఎవరెవరు ఏ స్థాయిలో బాధ్యులో కూడా తేల్చి చెప్పింది. ప్రాజెక్టు నిర్మాణంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యక్షంగా జోక్యం

మిగతా 13వ పేజీలో...



అధికారుల తప్పిదాలివే..

ఎస్‌కే జోషి, అప్పటి నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి



మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టవద్దన్న నిపుణుల కమిటీ నివేదికను తొక్కిపెట్టడంలో ఈయన పాత్ర ఉంది. అనుమతుల్లోనూ నిబంధనలు పాటించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యంలో ఈయనకు బాధ్యత ఉంది.

స్మితా సబర్వాల్ నాటి సీఎం అదనపు కార్యదర్శి



కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి కీలకమైన ఫైళ్లను మంత్రివర్గం ముందు ఉంచకుండా నిబంధనల్ని ఉల్లంఘించారు. తన విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అశ్రద్ధ, బాధ్యతారాహిత్యంతో వ్యవహరించారు.

సి.మురళీధర్, నాటి ఈఎన్‌సీ



నిపుణుల నివేదికను తొక్కిపెట్టడంలో, కేంద్ర జలవనరుల సంఘానికి తప్పుడు సమాచారం అందించడంలో ఈయన పాత్ర ఉంది. దురుద్దేశంతో సవరించిన అంచనాలను ప్రతిపాదించడంలో, నిర్వహణలో వైఫల్యానికి బాధ్యులు.

బి.హరిరామ్, నాటి సీఈ



నిపుణుల నివేదికను తొక్కిపెట్టడంలో బాధ్యుడు. సీడబ్ల్యూసీకి తప్పుడు సమాచారం అందించడంలోనూ ఈయన పాత్ర ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎండీగా ఉన్నప్పటికీ.. బ్యారేజీల గురించి తనకు తెలియదని చెప్పారు.

ఎన్.వెంకటేశ్వర్లు, కె.సుధాకర్‌రెడ్డి, ఓంకార్‌సింగ్

నిర్లక్ష్యంగా వ్యవహరించడం, నిజాయితీగా పనిచేయకపోవడంతోపాటు విచారణ కమిషన్ ఎదుట తప్పుడు సాక్ష్యాలు చెప్పారు. హరిరామ్, నరేందర్‌రెడ్డి, కేఎస్ఎస్ చంద్రశేఖర్, బసవరాజు, టి.శ్రీనివాస్, ఓంకార్ సింగ్‌లను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలి.

లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్



- 70-100 స్థానాల్లో ఫలితాలు తారుమారు
- మా వద్ద వంద శాతం ఆధారాలున్నాయి
- వాటిని త్వరలోనే బయటపెడతాం
- ఇది అణుబాంబు వంటిది.. ఇక ప్రకంపనలే
- పూర్తిగా నిర్వీర్యమైన ఎన్నికల కమిషన్
- కాంగ్రెస్ లీగల్ సదస్సులో రాహుల్ గాంధీ
- సాగు చట్టాలను వ్యతిరేకించవద్దని అప్పట్లో జైట్లీ తనను హెచ్చరించారని వెల్లడి
- ఖండించిన అరుణ్ జైట్లీ తనయుడు

12

బీజేపీలో వ్యక్తిగత నిర్ణయాలుండవు

- ఎవరికి ఏ బాధ్యత అప్పగించాలనేది పార్టీ నాయకత్వమే నిర్ణయిస్తుంది
- పదవుల కోసం పాకులాడబోం

10

- మంత్రి పదవి నుంచి తప్పించాలని తాను కోరినట్లు వచ్చిన వార్తలపై బండి సంజయ్
- బీసీ రిజర్వేషన్లపై బీజేపీని బద్‌నాం చేయడానికి రేవంత్ కుట్ర: రాంచందర్‌రావు
- రాహుల్ మెప్పు కోసమే స్థాయికి మించి రేవంత్ మాటలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



తెలంగాణ క్రీడా విధానం - 2025ని విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీహరి, జితేందర్‌రెడ్డి, అభినవ్ బింద్రా

75 ఏళ్ల నిబంధన మోదీకి వర్తించదా?

- కుర్చీ వదలాలన్న భాగవత్ మాట పట్టదా?
- ఆర్ఎస్ఎస్ చెప్పినా మోదీ వినడం లేదు
- రాహుల్ గాంధీయే ఆయనను దించేస్తారు
- ఈసారి బీజేపీకి 150 సీట్లు దాటనివ్వం
- తెలంగాణ కులగణన దేశానికే మోడల్
- కాంగ్రెస్ న్యాయసదస్సులో సీఎం రేవంత్

న్యూఢిల్లీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్లు నిండినవారు కుర్చీ వదలాలన్న ఆర్ఎస్ఎస్ నిబంధన మోదీకి వర్తించదా? అని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ మాటను మోదీ వినడంలేదని, వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీయే ఆయనను కుర్చీ నుంచి దించేస్తారని అన్నారు. ఈసారి బీజేపీకి 150 సీట్లు

మిగతా 3వ పేజీలో...

క్రీడల అభివృద్ధికి.. తొమ్మిది ఒప్పందాలు

3

- 'స్పోర్ట్స్ కాన్‌క్లేవ్'లో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు
- స్పోర్ట్స్ హబ్ బోర్డు ఏర్పాటు: సీఎం
- రాష్ట్ర క్రీడా విధానం ఆవిష్కరణ



యూపీలోని వారణాసిలో 'విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ పథకం'లో భాగంగా ఓ బాలికకు కళ్లజోడు అందించి ఆశీర్వదిస్తున్న ప్రధాని మోదీ

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తున్నాం

12

- ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలకు ప్రధాని మోదీ కౌంటర్
- అస్థిరంగా ప్రపంచ పరిస్థితులు.. అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది
- ప్రతి దేశమూ స్వలాభం కోసమే.. స్వదేశీ ఉత్పత్తులపై దృష్టి పెడదాం: మోదీ
- మాపై దాడికి తెగిస్తే పాతాళంలో ఉన్నా వదలం.. పాక్‌కు హెచ్చరిక

ప్రజ్వల్ రేవణ్ణకు యావజ్జీవం

- పనిమనిషిపై అత్యాచారం కేసులో శిక్ష
- రూ. 10 లక్షల జరిమానా కూడా..
- అందులో 7 లక్షలు బాధితురాలికి
- తీర్పు వెల్లడించిన ప్రజాప్రతినిధుల కోర్టు
- కోర్టులో వెక్కివెక్కి ఏడ్చిన ప్రజ్వల్ రేవణ్ణ

12

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల పునర్వ్యవస్థీకరణ

3

- కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాల నిర్మాణం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఫిరాయింపు చిక్కులు!



కొత్త పలుకు

పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది తెలంగాణ ఎమ్మెల్యేల విషయంలో మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీం తీర్పును శాసనసభ స్పీకర్ ఔదాల్చుతారా? చట్ట సభల స్పీకర్లు ఇకపై సుప్రీంకోర్టు పరిధిలోకి వెళతారా? జ్యుడీషియరీ, లెజిస్లేచర్ వ్యవస్థలలో ఎవరిది పై చేయి? ఈ ప్రశ్నలకు సుప్రీంకోర్టు తాజా తీర్పు సమాధానం చెప్పిందా? అంటే అవుననిగానీ, కాదనిగానీ చెప్పలేని పరిస్థితి!

ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేస్తుందని బీఆర్ఎస్ ఆశించింది. అప్పటికే ఫిరాయించిన వారిపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకుంటుందని బలంగా చెప్పడం ద్వారా మరికొందరు ఫిరాయించకుండా బీఆర్ఎస్ అడ్డుకోగలిగింది. అయితే సుప్రీంకోర్టు తీర్పు ఆ పార్టీకి ఆశాభంగం కలిగించిందని చెప్పవచ్చు. 'ఆపరేషన్ సక్సెస్-పేషెంట్ డెడ్' అన్నట్టుగా తమ తీర్పు ఉండకూడదని భావించిన సుప్రీం కోర్టు.. ఫిరాయింపుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు మూడు నెలల గడువు విధించింది.

అధికార పార్టీ ప్రయోజనాలు కాపాడటానికే ఆయా చట్టసభల స్పీకర్లు అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున సకాలంలో నిర్ణయాలు వెలువడటం లేదు. అధికారంలో ఉన్నప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించని పార్టీ లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతిపక్షంలోకి వెళ్లాక అవే పార్టీలు అన్యాయం అంటూ ఆక్రోశిస్తుంటాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన కొంత మంది ఎమ్మెల్యేలను నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఇలా చేయడం అనైతికం, అక్రమం అని టీఆర్ఎస్ అధినేతగా ఉన్న కేసీఆర్ ఆక్రోశించారు. తాను తప్పు పట్టిన పనినే ఆయన అధికారంలోకి వచ్చాక దర్జాగా చేశారు. రెండోసారి సీఎం అయినప్పుడు సభలో సొంతంగా కావల్సినంత మెజారిటీ ఉండింది. అయినా విపక్ష సభ్యులను చేర్చుకున్నారు.

4

సభ్యుల రాజీనామాల విషయంలో కూడా స్పీకర్లు నిర్ణయాలు తీసుకోకుండా పెండింగ్‌లో పెడుతున్నారు. గతంలో చట్టసభల స్పీకర్లు, ఛైర్మన్లుగా ఎన్నికైన వారు రాజకీయ పార్టీకి రాజీనామా చేసేవారు. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికైనప్పుడు బీజేపీకి రాజీనామా చేశారు. చట్టంలో లేకపోయినా ఇలాంటి ఉన్నత సంప్రదాయాలను పాటించిన వారు ఎందరో ఉన్నారు.

ఎన్నికైన సభ్యులు చేజారిపోకుండా కాపాడుకోవడంతో పాటు, పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉందని పార్టీ శ్రేణులలో భరోసా కల్పించేందుకు బీఆర్ఎస్ ఉప ఎన్నికలు కోరుకుంటోంది. ఈ కారణంగానే మూడు నెలల తర్వాత ఉప ఎన్నికలు రావడం ఖాయమని ఆ పార్టీ ప్రచారం చేసుకుంటోంది. రెండు మూడు నెలల క్రితం బీఆర్ఎస్ విజయావకాశాలు మెరుగుపడిన విషయం వాస్తవం. అయితే, రేవంత్ ప్రభుత్వం ఇటీవలి కాలంలో తీసుకున్న నిర్ణయాల వల్ల క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పరిస్థితి మెరుగుపడింది. రైతుబంధు నిధులు విడుదల చేయడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు రేషన్ కార్డుపై సన్న బియ్యం సరఫరా చేయడం వంటి నిర్ణయాలు కాంగ్రెస్ పట్ల ప్రజల ధోరణి మారడానికి దోహదపడ్డాయి.

ఉప ఎన్నికల్లో విజయం సాధిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలిపోయే అవకాశం ఉందని బీఆర్ఎస్ నాయకులు అంచనా వేస్తున్నారు. ఏ కారణం వల్లనైనా రేవంత్ రెడ్డి నాయకత్వం మారితే ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్టుగా ఉంటుంది.

15 మంది పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

- ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో తప్పుడు అటెండెన్స్ కారణం
- విధుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించొద్దు
- పంచాయతీ రాజ్ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

హైదరాబాద్/ వనపర్తి/గద్వాల క్రైం/నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సరైన సమయానికి హాజరు కాకుండా, పాత ఫొటోలే ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో పంచాయతీ కార్యదర్శులు పోస్టు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి సీతక్క తీవ్రంగా స్పందించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడాన్ని ఉపేక్షించవద్దని హెచ్చరించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా విచారించిన ఆ శాఖ ఉన్నతాధికారులు పాత ఫొటోలు పోస్టు చేసిన 15 మంది పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 'ఫేస్ రికగ్నిషన్ యాప్'తో ఉద్యోగుల హాజరు ప్రక్రియ కొనసాగుతుంది. అయితతే, 2 రోజుల క్రితం ఓ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శి.. సీఎం రేవంత్ రెడ్డి ఫొటో అప్‌లోడ్ చేసిన విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు శనివారం చేపట్టిన రాష్ట్ర వ్యాప్తంగా విచారణలో 553 మంది పంచాయతీ కార్యదర్శులు అనుమానాస్పదంగా ఫేక్ అటెండెన్స్ వేస్తున్నట్లు గుర్తించారు. ఔట్ సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న ఓ పంచాయతీ కార్యదర్శిని సర్వీసు నుంచి తొలగించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పది మందితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 15 మందిని సస్పెండ్ చేశారు. మిగతా వారితోపాటు విధుల నిర్వహణలో అశ్రద్ధగా ఉన్న 47 మంది ఎంపీఓలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వారిపై శాఖ పరంగా చర్యలకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టేవారిపై కఠిన చర్యలు

- సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి హెచ్చరిక
- యువతి, స్నేహితుడి వీడియో తీసి, విద్వేష వ్యాఖ్యలతో వైరల్ చేసిన వ్యక్తి అరెస్టు



మీడియాతో మాట్లాడుతున్న డీసీపీ శిల్పవల్లి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మ పరిరక్షణ పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకొనేవారిపై, విద్వేషాలను రెచ్చగొట్టేవారిపై కఠిన చర్యలు తప్పవని సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి హెచ్చరించారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద స్నేహితుడితో ఉన్న ఓ యువతిని దూషించడం, ఆమెపై దాడికి యత్నించడమే కాకుండా వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన యువకుడిని అరెస్ట్ చేశామని తెలిపారు. చార్మినార్ శంకర్ గంజ్‌కు చెందిన మహ్మద్ రాహిల్(24) ర్యాపిడో డ్రైవర్. గత నెల 29 రాత్రి హిజాబ్ ధరించిన ఓ యువతి ఆమె స్నేహితుడు ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్నారు. రాహిల్ యువతిపై ఆగ్రహం వ్యక్తం చేసి, దాడికి యత్నించాడు. భయపడ్డ ఇద్దరు బైక్‌పై వెళ్లిపోగా.. రాహిల్ వారిని బైక్‌పై ఫాలో అయి వీడియో తీశాడు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో పెట్టి, విద్వేషాలు రెచ్చగొట్టే వాఖ్యలను పోస్టు చేశాడు. బాధిత యువకుడి ఫిర్యాదుతో సైఫాబాద్ పోలీసులు నిందితుడి అరెస్ట్ చేశారు. మరోవైపు, సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 30న కొంత మంది ఆవులను దొంగలించి వాహనంలో తీసుకెళ్లారు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే, ఈ ఘటనపై మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కొందరు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. ఇలాంటి వ్యాఖ్యలతోనే కొన్ని యూట్యూబ్ ఛానళ్లు వార్తలను ప్రసారం చేశాయి. దీంతో వారితో పాటు, ఆయా యూట్యూబ్ ఛానెళ్లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ ఆర్యవైశ్య / 22y & 24y & 26y & 28y & 28 & 30y & 32y & 33y & 34y & 36y & 37y & 38y & 39y & 40y & 42y & 44y & 46y & 49 & 51y & 52y & 54y & 55y & 56y & 58y & 59y / జి. సుధీజా గుప్తా "మాసేవా" (Since 1998) : PH: 9291503949 AJH-003233

★ 62/ రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / Govt. ఫ్యామిలీ పెన్షనర్ / పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ / ప్రాపర్టీ / ఎలాంటి బాదరబందీలేని వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9030858258 AJH-003233

★ 45 సం. వధువుకు పెన్షనర్ వరుడు కావలెను. అన్ని కులాల అన్ని వయస్సుల వారికి సంబంధాలు చూడబడును. 1st, 2nd విడో / డైవర్స్ / పెన్షనర్ తుఫ్, స్త్రీలకి ఫ్రీ సర్వీసెస్, ఫాస్ట్ సెటిల్మెంట్ కాలీ మ్యాట్రిమోని. ఫోన్: 6281147818 AJH-003351

★ OC/ కుల పట్టింపు లేదు / 44 / 5'5" / సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ / బెంగుళూరు / వధువుకు Engineer / Doctor / వృత్తిపరమైన వరుడు కావలెను. డైరెక్ట్: 9182734077 AJH-003239

★ రెండో పెళ్ళి / కుల పట్టింపు లేదు / 24y & 25y & 27y & 29y & 31y & 32y & 33y & 34y & 36y & 38y & 39y & 41y & 42y & 43y & 44y & 45y & 46y & 48y & 50y & 51y & 53y & 55y & 57y & 59y / జి. సుధీజా గుప్తా "మాసేవా" (Since 1998) : PH: 9291503949 AJH-003233

★ Kamma 31 Doctor Fair Beautiful Doctor UK NHS 60L pa Wealthy UK-PR వరుడు కావలెను. Strictly UK Settled / Working Doctor / Engineer / Finance / Bank. Ad by F:9994686849 AJH-2758

★ విశ్వబ్రాహ్మిణ్స్ / 26 సం.రాలు / ఇంటర్, సొంత ఇల్లు. ఫాదర్ కార్పెంటర్ వర్క్ / స్థిరాస్తి ఉన్న అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. ఫోన్: 8008831764 AJH-003235

★ కాపు / మొదటి సంబంధం / 26 సం.లు డిగ్రీ / సొంత ఇల్లు / ఒక బ్రదర్ మ్యారేజ్ / వ్యవసాయం ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. ఫోన్: 8008831764 AJH-003235

★ వైశ్య /46 సం.లు / రెండో పెళ్ళి / విడో, Govt.ఫ్యామిలీ పెన్షనర్, సొంత ఇల్లు రెంట్లు , పిల్లలు లేరు. ఎలాంటి బాదరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల అస్తి పట్టింపు లేదు) ఫోన్: 8008599883 AJH-003351

★ రెడ్డి / 1st మ్యారేజ్ / 25 to 35 సం.లు ఉన్న అమ్మాయికి సొంత ఇల్లు, వ్యవసాయం ఉన్న వారికి ఆంధ్ర, తెలంగాణలో వరులు కావలెను. ఫోన్: 8008831764 AJH-003235

★ పద్మశాలి / మొదటి సంబంధం / డిగ్రీ / Inter 10 to డిగ్రీ / వయస్సు 26 to 34 సం.లు ఉన్న అమ్మాయిలకి వరులు కావలెను. ఫోన్: 8008831764 AJH-003235

★ వాయి బ్రాహ్మిణ్స్ (మంగలి)/ మొదటి సంబంధం / 26 సం.లు / ఇంటర్ / టైలరింగ్ / ఫాదర్ షాపు. ఒక బ్రదర్ మ్యారేజ్‌గా ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. ఫోన్: 8008831764 AJH-003236

★ రాజులు (సూర్యవంశం, చంద్రవంశం) భట్‌రాజులు వయస్సు (26 to 35 సం.లు). చదువు. 10 to B.Tech / ఉన్న అమ్మాయిలకి ఏదయినా బిజినెస్ లేదా జాబ్ ఉన్న వరులు కావలెను. ఫోన్: 8008831764 AJH-003236

★ (చౌదరి) కమ్మ 1st మ్యారేజ్ (25 to 40 సం.లు). సొంత ఇల్లు. బ్రదర్ సాఫ్ట్‌వేర్. అలాగే వ్యవసాయం భూమి ఉన్న అమ్మాయిలకి వరులు కావలెను. ఫోన్: 8008831764 AJH-003236

★ ఆర్యవైశ్య, గౌడ్స్ మొదటి సంబంధం. అలాగే రెండవ సంబంధం. వయస్సు 25 to 40 సం.లు). ఉన్న అమ్మాయిలకి ఏదయినా జాబ్ లేదా బిజినెస్ వరులు కావలెను. ఫోన్: 8008831764 AJH-003236

★ కుల అస్తి పట్టింపు లేదు / చౌదరి / 42y / 5'6"/ ఫెయిర్ / డాక్టర్ / గైనకాలజిస్ట్ / మంచి అస్తి గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్: 9160754026. AJH-003294

★ ముదిరాజ్ / B.Tech / Govt. A.E.E. / ఇరిగేషన్ Dept. / మంచి జీతము / 5'4" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9618007652 AJH-16248

★ యాదవ /ఏకైక కుమార్తె/ BE / C.Govt. ప్రివిలియంట్ ఆఫీసర్ / కస్టమ్స్ Dept. / మంచి జీతము / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8297439565 AJH-16248

★ వెలమ /ఏకైక కుమార్తె/ B.Tech / Govt. Jr. Asst / రెవెన్యూ Dept. / మంచి జీతము / 5'5" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9550166072 AJH-16248

★ కుల పట్టింపు లేదు / 40-60y / Widow / ఆంధ్ర / పిల్లలు లేరు / సొంత ఇల్లు / Govt. Job. Lands / రైల్వే ఎంప్లాయి / మంచి జీతము / అందమైన వధువుకు వరుడు కావలెను. (డైరెక్ట్ మీటింగ్ సంబంధం కుదిరించబడును.) ఫోన్: 9989350417 AJH-003349

★ కుల పట్టింపు లేదు / 48y / Widow / ఆంధ్ర / బ్యాంక్ మేనేజర్ / మంచి జీతము / ఓన్ హౌజ్ / అమ్మ సంరక్షణలో ఉంటున్న వధువుకు వరుడు కావలెను. చదువు ప్రసక్తి లేదు. ఫోన్: 7075948409 AJH-003349

★ SC హిందూ మాల /CA / చార్టెడ్ అకౌంటెంట్ / మంచి జీతము / 5'5" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9908222406 AJH-16248

★ SC హిందూ మాదిగ / B.Tech / Govt. Asst. ఇంజనీర్ /RWS/ మంచి జీతము / 5'5" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9966760501 AJH-16248

★ కుమ్మరి / B.Tech / C.Govt.Jr. Asst. పోస్టల్ Dept./ మంచి జీతము / 5'4" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9618008271 AJH-16248

★ కుల పట్టింపులేదు / విడో / 49y / Thirupathi / Govt. Employee / Own house / Rents / Agriculture Lands / పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8374476725 AJH-003349

★ కుల, అస్తి ప్రసక్తి లేదు / విడో / 50y / Hyderabad/ Warangal / Khammam Own Business Family Pensioner / పిల్లలు లేరు / Well Settled / వధువుకు వరుడు కావలెను. (ఆంధ్ర ఓకే) ఫోన్: 9581155315 AJH-003349

★ SC మాదిగ /ఏకైక కుమార్తె / B.Tech / Govt. Asst. ఇంజనీర్ / R&B Dept. / మంచి జీతము / 5'3" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8897389698 AJH-16249

★ వడ్డెర /B.Tech / C.Govt. Asst. మేనేజర్ / యూనియన్ బ్యాంక్ / మంచి జీతము / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9618579861 AJH-16249

★ 2వ పెళ్లి /47y / పిల్లలు లేని సొంత ఇల్లు గల వధువుకి వరుడు కావలెను. Any FC / BC Only. ఫోన్: 9848023736 AJH-16249

★ పద్మశాలి / B.Tech / Govt. Jr. ఇంజనీర్ / రైల్వే / మంచి జీతము / 5'5" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8790689274 AJH-16249

★ INDIA TOP 5 రేటింగ్ ఉన్న కంపెనీ వధువు 26/5'4"/ MBBS, PG వధువుకు ALL Caste High Level People Only Hyd. రిజి. ఫ్రీ. ఫోన్: 6305502298, 7660803720 AJH-16249

★ అస్తి, కుల పట్టింపు లేదు / రెడ్డి / 27y/ B.TECH / మంచి స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చెయ్యండి. ఫోన్: 9133640971 AJH-16249

★ రెడ్డి 2వ మ్యారేజ్ / కుల, అస్తి పట్టింపు లేదు / 32yrs/ 5'4"/మంచి అస్తి గల అందమైన వధువుకి వరుడు కావలెను. అన్ని కులాల వారికి 1st & 2nd సంబంధాలు మా వద్ద కలవు. సంప్ర:8143226625 AJH-16250

★ రెడ్డి 2nd విడో,Age: 30, H:5.5, డిగ్రీ /ప్రైవేట్ జాబ్ & మంచి స్థిరాస్తి / వెల్ సెటిల్డ్ గల అందమైన వధువుకి వరుడు కావలెను. (కుల-అస్తి) పట్టింపు లేదు. 1st or 2nd OK. Ph: 9704782370 AJH-16250

★ కమ్మ, 32, 5'.5", ఫెయిర్, MBBS, MD (డెర్మటాలజీ) అతి సంపన్న సాంప్రదాయ కుటుంబ వధువుకు డాక్టర్ / ఇంజనీర్ వరుడు కావలెను. సెల్ : 6303433873 AJG-239658

★ CNB, Rich, Fair, 29, 5'.5", MBA (UK) Director in Family బిజినెస్ హైదరాబాద్ వధువుకు బిజినెస్ / సివిల్ సర్వీస్ Elite Family వరుడు కావలెను. ✆ 78939 71953. AJB-209463

★ రెడ్డి: విడో/కుల, అస్తి, ప్రసక్తి లేదు / Age: 35, / B.Com, Own Business / Own House / మంచి అస్తి గల అందమైన వధువుకి వరుడు కావలెను. 1 & 2 అన్ని కులాల వారికి వివాహాలు చూడబడును. ఫోన్: 8074131208 AJH-16250

వధువు కావలెను



★ యాదవ /పూజారి / 29y / 5'4"/ మెడికల్ కోడింగ్ (కంప్యూటర్ వర్క్) హైదరాబాద్ / మంచి జీతం గల వరునకు అదే కులానికి చెందిన ఏదైనా డిగ్రీ చేసిన వధువు కావలెను. (నో బ్రోకర్స్) డైరెక్ట్ సం.ప్ర: 9959956699 AJH-003234

★ కుల పట్టింపు లేదు / రీసెంట్‌గా రిటైర్డ్ గవర్నమెంట్ ఆఫీసర్ / పెన్షనర్ ఫ్యామిలీ పెన్షన్ విడో (Govt. Job చేస్తున్న భర్త చనిపోగా అతని మూలంగా పెన్షన్ వచ్చే వ్యక్తి) కావలెను. (LR కొరకు) Any Details వాట్సాప్: No Calls - 8985030723 (No Brokers) AJH-003234

★ కుల ఆస్తి పట్టింపు లేదు / పురగిరి / క్షత్రియ / పెన్షనర్ / 2వ వివాహం / 68 వయస్సు / 5.5 ఎత్తు / డైరెక్ట్ (నో బ్రోకర్స్): 9492529397 AJH-003294

★ కాపు, కుల కట్న పట్టింపు లేదు. 42 సం. / ఎ 5.9 / MBA / విశాఖపట్నం 35 సం. / ఎ.5.6 /MBA/ బెంగళూరు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేయుచున్న అబ్బాయిలకి 1వ & 2వ వధువులు కావలెను. Direct Cont.: 8088801146 AJH-003294

★ వడ్డెర / కట్నం ప్రసక్తి లేదు / CA / C.Govt. అకౌంటెంట్ ఆఫీసర్ / మిధాని / మంచి జీతము / 6' ఎత్తు / 29 సం.ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్: 9618007652 AJH-16248

★ పద్మశాలి / B.Tech / C.Govt. Asst. మేనేజర్ / FCI / మంచి జీతము / 5'11" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 8297439565 AJH-16248

★ రజక /కట్న ప్రసక్తి లేదు/ B.Tech / C.Govt. Asst. మేనేజర్ / SBI / మంచి జీతము / 6' ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9550166072 AJH-16248

★ క్రిస్టియన్ మాల /M.Tech / Govt. Asst. ఇంజనీర్ / మున్సిపల్ Dept. / మంచి జీతము / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9908222406 AJH-16248

★ క్రిస్టియన్ మాదిగ / కట్న ప్రసక్తి లేదు / B.Tech / Govt. ఇంజనీర్ / ఎలక్ట్రికల్ Dept. / మంచి జీతము / 5'11" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9966760501 AJH-16248

★ గౌడ / B.Tech / Govt. ఇంజనీర్ /R & B Dept. / మంచి జీతము / 6' ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9618008271 AJH-16248

★ యాదవ / B.Tech / C.Govt. కస్టమ్స్ ఆఫీసర్ / మంచి జీతము / 5'11" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9618579861 AJH-16249

★ రెడ్డి /2వ పెళ్ళి/కుల ప్రసక్తిలేదు/ MBA / PG / Govt. ఆఫీసర్ / మంచి జీతము / 5'9" ఎత్తు / 49 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9963757612 AJH-16249

★ కాపు, లేట్ మ్యారేజ్ / 42y / 5'10"/B.Tech/ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ / మంచి జీతము / మంచి అస్తి / మంచి వరుడికి వధువు కావలెను. 1st / 2nd OK. వాట్సాప్: 8187053655, 8333894916 AJH-16250

★ చౌదరి రెండవ పెళ్ళి / 45 సం./ 5'11" ఎరుపు / డిగ్రీ / ప్రైవేట్ జాబ్ / మంచి ఆస్తి గల వరునికి (కుల ప్రసక్తి లేదు) వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ సంప్ర: 9133642321 AJH-003351

★ పద్మశాలి - 40 సం. /M.A/5.8/బ్యాంకు/ HYD, 12 L.P.A 40Cr ప్రాపర్టీ గల వరునకు మొదటి / రెండవ కమ్మ, రెడ్డి, విశ్వబ్రాహ్మ, రజక, గౌడ OK, అందమైన వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర:76739 26517, 81791 95689 AJB-235609

★ కుల, మత, చదువుతో పని లేదు, 36Y. లోపు మంచి మనస్సు వున్న వధువు కావలెను. చెముదు / మూగ O.K, శ్రీరామ్, 5'.3", డిగ్రీ, గుళ్ళపల్లి, గుంటూరు జిల్లా. డైరెక్ట్ : 63099 26003 AJG-239660

★ 40 సం॥ వయస్సు, 5.1 ఎత్తు గల పద్మశాలిని వరుడుకు విడాకులు తీసుకుని ఏ బాదరా బంది లేని వధువు కావలెను. ఏ కులం అయినా పర్వాలేదు. సంప్ర: 85008 81624 (నో ఏజెంట్స్) AJG-239633

★యాదవకులం : వరుడునకు 38 సం॥లు, మొదటి లేక రెండవ సంబంధం వధువు కావలెను. కుల పట్టింపు లేదు. డైరెక్టుగా సంప్రదించండి. సెల్ : 96522 84046. AJL_236765

★ 69 తిరుపతి బలిజ ద్వితీయ చదువైన వ్యక్తికి తగిన సిరిగల అందమైన స్త్రీ వధువుగా కావలెను. ఇష్టమైన వాళ్ళు మాత్రమే సంప్రదించగలరు. డైరెక్ట్: 83338 67884 AJT-239890

★ బలిజ, 36yrs, డిగ్రీ / జాబ్ - కంప్యూటర్ ఆపరేటర్ @ మెడికల్ ఏజెన్సీ, కరీంనగర్లో స్వంత గృహం వున్న అబ్బాయికి తగిన వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్: 9440378427 AJH-003351

కళ్యాణ వేదిక

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE/ Govt. / Doctors/ MNC/ Matches/ Late & 2nd Matchesకై సంప్ర: Ph: 9704656103/ 9533608887 (Whatsapp) AJH-003232

★ స్వాతి పరిణయ మ్యారేజ్ బ్యూరో / కేవలం కమ్మ/చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. దండమూడి శ్రీనాథ్. ఫోన్ : 8019658575 / Whatsapp 8019658575 AJH-003234

★ రజక / డాక్టర్స్ / ఇంజనీర్స్ / Govt. Jobs / Abroads / పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి. కోట్ల శ్రీనివాస్. ఫోన్: 8106303155 / 9391265304 AJH-003232

★ కమ్మ చౌదరి, రెడ్డి మ్యారేజ్ బ్యూరో / హై రేంజ్ / హై స్టడీస్ / Engineers & Doctors, ఇండియా మరియు అబ్రాడ్, లేట్, 1st & 2nd ఫోన్: 9394002999 AJH-003232

★ కావ్య మ్యారేజ్ లింక్స్ 1వ, 2వ లేట్ మ్యారేజస్, డైవర్సీస్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లు అన్ని కులాల వారికి సంబంధములు త్వరగా చూడబడును. (స్త్రీలకు ఫ్రీ) ఫోన్: 8074670989 AJH-003232

★ విశ్వ బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం (Online)/24y Aug, 2025 న Free Register. Bhavani Matrimony.com Hyd - 9704656103 / 9533608887 AJH-003234

★ 1వ, 2వ వివాహాలు, భర్తను కోల్పోయిన భార్యకు, భార్యను కోల్పోయిన భర్తకు వయస్సుతో నిమిత్తం లేకుండా ఎన్నో పెళ్లిళ్లు చేసిన ఏకైక సంస్థ. తోడు నీడ. 9246882324 AJH-003294

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506 / 9705588313 AJH-003226

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగినసంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9985921386, 9703618806.

పర్వతనేని (కమ్మ) వివాహ వేదిక

Regd. No. AP-06-17-001-02477065

పర్వతనేని రామబ్రహ్మం, VJA 9849350056 పర్వతనేని శ్రీకాంత్, HYD 8886664567

గత 30 సం॥లుగా దేశ విదేశీ వధూవరులకు మొదటి & రెండవ (డైవోర్స్) పెళ్ళి సంబంధాలు కుదుర్చుతున్న అగ్రగామి సంస్థ

వధువు కావలెను

కమ్మ: 32 6'2 MBA (Business) 10cr (income) 60Cr; 29 5'10 BE 50L 30cr; 29 5'9 BE 13L 35cr; 31 5'10 Cinematography 12L 30cr.

కమ్మ: 32 5'10 B.tech 12L 20 cr; 34 5'7 MS 11L 4 cr; 30 5'11 B.tech 20L 2 cr; 31 5'10 B.tech 80L 2cr; 36 5'9 M.tech 75L 6cr.

కమ్మ: 36 5'8 B.tech 30L 4cr; 29 5'9 B.tech 30L 5 cr; 35 5'11 B.tech (MBA) 33L 8 cr; 30 6'2 B.tech (MBA) 14L 5 cr.

కమ్మ: 29 5'8 ME & BE 30L 25 cr; 30 5'6 BE & PGDM 30L 5 cr; 29 5'6 B.tech 18.5L 3 cr; 31 6' B.tech 16L 5 cr.

కమ్మ: 35 5'8 MS & B.tech 24L 5 cr; 32 6' B.tech 16L 6 cr; 27 5'6 B.tech 25L 2.5 cr; 35 5'8 M.tech & B.tech 10L 8 cr.

కమ్మ: 33 5'8 M.sc 40cr; 35 5'9 B.tech 30L 10cr; 36 5'11 BE - MBA 35L 15 cr; 33 5'6 CA 16 L 50 cr; 36 5'8 MS 12L 15 cr.

కమ్మ: 32 5'10 LLB 8L 60cr; 34 5'8 B.tech 20L 5cr; 31 5'9 B.tech 25L 2 cr; 35 5'6 B.tech 33L 2cr; 31 5'7 B.tech 30L 4cr.

కమ్మ: 35 5'9 Diploma 35L 2 cr; 32 5'8 CA 15L 5 cr; 32 5'10 BE&ME 16L 2cr (Haryan); 29 6'1 CA 15L 7cr; 31 5'9 CA 50L 10cr.

కమ్మ: 31 5'9 CA 17L 5cr; 35 5'11 CA 30L 50cr; 27 5'6 BBA-LLB 100cr; 29 5'9 CA 50L 10cr; 32 5'10 BBA 12cr 70cr; 26 5'9 BBA 24L 6cr.

కమ్మ: 29 5'5 BE-MBA 30L 2cr; 35 5'11 B.tech 24L (Business) 2cr; 30 5'10 BE-MBA 10L 8cr; 32 5'8 BE 7L 10cr; 34 5'9 MS 12L 12cr.

కమ్మ: 32 5'10 MS $200K 40cr; 33 5'11 MS $140K 10cr; 27 5'11 MS $95K 10cr;30 6'MS $200K 8cr;33 MS 5'10 $150K 10cr.

కమ్మ: 29 5'11 MS-Doing Ph.D $180K 10cr; 32 6'0 MS $105K 10cr; 32 5'7 MS $350K 10cr; 33 5'11 MS $150K 6cr.

కమ్మ: 30 6'2 MS $85AUD 10cr (Australiy); 32 6'2 Doctor 25cr (US); 30 6'1 Doctor 25cr(US); 30 6'2 $95K BE-Business Analyst (Canada) 10cr.

కమ్మ: 30 5'10 MS $130K 10cr; 33 5'11 MS $180K 30cr; 30 6'0 MS $135K 6cr; 30 5'11 MS $100K 7cr; 30 6'1 BDS-MPH $200K 2.5cr.

కమ్మ: 30 6'MS 41L Sweden 2cr; 29 5'8 MS 45L(Netherland) 10cr; 34 6'2 BE $250K US 15cr; 35 5'8 MS $110K 10cr;

కమ్మ: 30 6'2 MS (Sidney) 13cr 120AUD; 29 5'11 MS $200K (Cana) 5cr; 31 5'10 MS 70L (UK) 10cr; 31 5'6 MS 12L dollars (Australia) 10cr.

కమ్మ: 30 6'1 MS $125K(US) 20cr; 31 6'2 MS $120K (US) 30cr; 29 6'1 MS $150K(US) 30cr; 32 5'10 MS $120K (US) 6cr;29 5'10 MS(US) $80K 40cr.

కమ్మ: 32 5'9 MS $110K 20cr; 33 6'MS $135K 5cr; 29 5'11 MS $130k 8Cr; 30 6'MS $300K 30cr; 29 6'0 MS $317K 10 cr; 31 5'9 MS $130K 15cr.

Divorce: 35 5'8 MS 70cr; 31 6' MS $150K 20cr; 33 5'10 MS $300K 10cr; 36 5'10 MS $310K 50cr; 38 5'7 MS $270K 10cr; 33 6'2 MA 70L 50cr.

Divorce: 40 5'7 MBA 25L 5cr; 37 5'11 Doctor 24L 5cr; 35 5'10 BE 42L 2cr; 33 6'MS 10L 4cr; 43 5'10 24L Doctor 8cr; 35 5'9 BE 10L 6cr.

వరుడు కావలెను

కమ్మ: 31 5'4 MS 30cr; 29 5'0 PGDM 10cr; 29 5'4 MS 18L 10cr; 33 5'6 BE 8L 10cr; 29 5'5 BE 12L 12cr; 32 5'7 Msc 18L 15cr.

కమ్మ: 30 5'2 MS 60cr; 33 5'3 BE 15L 10cr; 30 5'8 BE 8cr; 29 5'3 25cr; 29 5'6 MS 10cr; 26 5'4 BE 35L 7cr; 32 5'4 BE 70L 9cr.

కమ్మ: 32 5'7 BE 24L 20cr; 27 5'3 BE 18L 10cr; 31 5'9 MS 10cr; 31 5'3½ BE-MBA 60L 10cr; 26 5'5 ME 15cr; 29 5'4 BE 13.5L 30cr.

కమ్మ: 25 5'5 MS 30cr; 25 5'6 BE 14L 10cr; 28 5'3 BE 25L 30cr; 30 5'5 BE-MBA 15L 15cr; 28 5'8 MS 18L 20cr; 24 5'4 BE 10L 3cr.

కమ్మ: 28 5'5(Fashion designer) 20L 4cr; 23 5'1 BE 5cr; 29 5'8 ME 15L 5cr; 25 5'7 BE 8L 3cr; 32 5'2 BE 16L 50L; 32 5'6 BE-MS 20L 2cr.

కమ్మ: 25 5'10 BE 6L 5cr; 25 5'5 BE 21L 3cr; 29 5'4 BE 7L 2cr; 29 5'5 BE 8L 5cr; 33 5'6 ME-BE 40L 1cr; 27 5'7 BE 18L 2cr; 32 5'1 BE 25L 4cr.

కమ్మ: 27 5'7 BE 5L 1½ ; 31 5'4 BE 8L 1.5cr; 31 5'5 BE-ME 5L 3cr; 26 5'10 BE 7L 2cr; 27 5'5 BE 7L 1cr; 28 5'4 BE 9L 3cr; 35 5'3 ½ 20L 1cr.

కమ్మ: 33 5'5 BE 32L 2cr; 27 5'7 BE 7L 2cr; 28 5'5 MS 27 ½ 5cr; 29 5'5 BE 20L 5cr; 25 5'2 BE 7L 1cr; 28 5'5 Msc 8L 5cr; 25 5'9 BE 30L 6cr.

కమ్మ: 27 5'5 MBA 6L 5cr; 30 5'4 BE-ME 18.5L 7cr; 32 5'3 BE 20 L 1cr; 33 5'4 ME 12L 5cr; 27 5'7 BE 10L 2cr; 29 5'7 BE 13.5L 3cr.

కమ్మ: 25 5'6 BBA 40cr; 24 5'4 MA 5cr; 26 5'2 MBA 12cr; 28 5'4 CA 23L 1cr; 24 5'6 BA 50cr; 29 5'7 LLB 25cr; 24 5'6 MBA 3cr.

కమ్మ: 25 5'8 MS 80cr; 33 5'5 MS $180K 10cr; 30 5'8 MS $120K8 8cr; 31 5'5MS $110K 7cr; 27 5'4 MS$105K 5cr; 29 5'4 MS $90K 3cr.

కమ్మ: 26 5'6 MS $85K 6cr; 28 28 5'4 MS $100K 4cr; 25 5'5 BE 15 Cr(OPT); 35 5'5 MS $120K 20cr; 26 5'6 MS $110K 10cr; 29 5'5 MS 5cr.

కమ్మ: 28 5'8 MS $130K 10cr; 29 5'10 MS $126K 5cr; 33 5'4 MS $200K 6cr; 33 5'7 MS $110K 6cr; 32 5'4 MS-HSAC Doctor $285K 5cr.

కమ్మ: 30 5'4 MS $145K 2cr; 27 5'7 MS $100K 1cr; 33 5'5 MS $140K 50cr; 31 5'5 Phar.D $120K 25cr; 31 5'6 MS $150K 40cr; 28 5'4 MS 50cr.

కమ్మ: 30 5'5 MS 10cr; 29 5'3 MS 29 5'3 MS $125K 20cr; 30 5'6 MS 30Cr $160K; 29 5'5 BDS-MS 6cr; 32 5'3 BE $95K 5cr.

కమ్మ: 28 5'4 MS 130K(CAD)-UK 2cr; 28 5'6 BE 24L(UK) 5cr; 28 5'2 MS 25L(UK) 2cr; 26 5'2 BE-Msc 4cr; 28 5'4 MS (UK) 5cr.

కమ్మ: 31 5'8 MS $110K canada 5cr; 31 5'0 MS 25L (Pune) 3.5cr; 28 5'4 MS 70K AUD (Australia) 2cr.

Doctors: 28 5'4 MS-ENT 10cr; 32 5'6 MD.Derm 50cr; 36 5'6 MS.Opth 10cr; 28 5'5 MBBS 10cr; 30 5'4 MBBS 35cr; 29 5'6 Gen. Surgeon 10cr;

Doctors: 32 5'8 MD.Der 10cr; 32 5'6 32 5'6 G.me 7cr; 27 5'9 MS.OBG 10cr; 29 5'7 MD.Redi 12cr; 29 5'4 Gynec 20cr; 27 5'4 G.su 50cr; 29 5'4 MBBS 25cr;

Doctors: 29 5'4 MD.Radi 5cr; 29 5'7 G.Med 20cr; 29 5'7 G.me 10cr; 33 5'6 MD.Psy 10cr; 31 5'3 Orth 12L 10cr; 31 5'3 MS.Obs 6cr;

శారద వివాహ వేదిక

Mail: saradamatrimony1@gmail.com, website: www.saradaram.com

EXCLUSIVE CHOWDARY COMMUNITY
Hyderabad. Phone: 9849413031

కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr. B.Tech MS 31 /20 Cr. B. Tech MS / 33 / 15 Cr. B.Tech MS / 37 / 70 Cr. B.Tech MS Citizen 28 / USA వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr. B.Tech MS UK return 26 / 100 Cr. B.Tech MBA UK 30 / India వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B.Tech MS Sweedon / 10 Cr B.Tech MS UK / 9 Cr B.Tech Irland / 20 Cr. Australia B.Tech MS / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr. MBBS MD GM 27 / Cr MS Orthopedics 34 / 20 Cr MBBS Pediatrics / 10 Cr MBBS Radiology వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr / MBBS PG USA 30 / 100 Cr. USA Citizen Doctor 29/27 USA Doctor వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 Cr. B.Tech 28 LPA /30 B.Tech 5 Cr. 18 LPA / 7 Cr B.Tech 13 LPA 30 / 10 Cr B.Tech 80LPA 33 / వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 1 to 500 Cr 25 to 45 B.Tech MS / Doctors ఇంజనీర్స్ / Business / USA / UK / India / Australia / Ireland / Sweedon వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండో పెళ్ళి / 20 Cr. B.Tech IIT Business 32/10 Cr MBA 12LPA 30 / 15 Cr. B.Tech 80LPA 40 /50 Cr B.Com Business 42 వరులకి తగిన వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : Govt. Job 50 Cr / B.Tech MS / 29 / 10 Cr IRS 50 34 / వరులకి వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం (USA) : రెండో పెళ్ళి 34 B.Tech MS 20 Cr / 37 B.Tech MS 15 Cr / 20 Cr B.Tech MS 39 / 10 Cr B.Tech MS USA Citizen 45 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

వరుడు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 28 MBBS ENT / 50 Cr MBBS MD Pediatrics / 10 Cr MBBS MD Pediatrics 25 / 28 MDS Vijayawada / 27 MBBS Gynaecology వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 35 Cr BDS MS UK 28 / 10 Cr / B.Tech MS UK వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండోపెళ్ళి 500 Cr Bangalore 39 / 70 Cr MPharmacy Law 35 / 20 Cr B.Tech 34 / 100 Cr B.Tech 37 / 15 Cr B.Tech MS 38 వధువులకు వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA Citizens 32 PG Doctor / 26 BA JD(LAW) / 23 B.Tech BCS / 28 BA Texas 70 Cr / USA Citizen వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr BArch 41/15 Cr BA LLB 30 / 25 Cr B.Tech MS 30 LPA Hyd / 70 Cr BArch 32 వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10Cr MTech IIIT 31 / 10 Cr BE 28 / 26 B.Tech 25 LPA / 27 B.Com CA Final / 28 MPharmacy / 25 BTech 30 / B.Tech వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం రెండవపెళ్ళి : 38 B.Tech MS India / 37 B.Tech MS USA / 38 B.Tech MS USA / 28 B.Tech MS UK 28 / B.Tech MS Australia వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 28 MDs Doctor / 29 MBBS PG Doctors / 32 LLB లాయర్స్ / 32 B.Tech IIIT Swe వధువుకి వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం USA : 10 Cr. B.Tech MS 38 / 20 Cr. B.Tech MS 35 / 20 Cr. Doctor 32 / B.Tech MS 25 / B.Tech MS 30 వధువులకు వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 28 USA Doctor Pediatrician / India / USA / UK / Australia / Canada / 22 to 45 వధువులు మరియు 1,2 లేటు Match లకై వరుడు కావలెను. సంప్ర: శారద 9849413031

అమెరికా జైలులో తెలంగాణ యువకుడి ఆత్మహత్య

- స్నాప్‌చాట్‌లో 15 ఏళ్ల బాలుడిలా నమ్మిస్తూ అమెరికా బాలికలతో చాటింగ్
- నగ్న వీడియోలు తీసి పంపేలా ఒత్తిడి, బెదిరింపులు
- ఏప్రిల్‌లో 35ఏళ్లు జైలుశిక్ష వేసిన అమెరికా కోర్టు
- గత నెల 26న ఆత్మహత్య.. ఆలస్యంగా వెలుగులోకి



సాయికుమార్ (ఫైల్)

లింగాలఘణపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని జైలులో తెలంగాణ యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. బాలికలపై లైంగిక వేధింపులు, అశ్లీల వీడియోల కేసులో 35 ఏళ్ల జైలుశిక్షపడిన ఆయన ఆందోళనతో జైలులోనే ఉరివేసుకున్నారు. మృతదేహాన్ని అప్పగించేందుకు అమెరికా అధికారులు నిరాకరించడంతో.. అక్కడే అంత్యక్రియలు పూర్తి చేశారు. గత నెల 26న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన కుర్రెముల సాయికుమార్ (31) పదేళ్లుగా అమెరికాలోని ఒక్లహోమాలోని ఎడ్మండ్ లో ఉంటున్నారు. రెండేళ్ల క్రితం అక్కడే ఉద్యోగం చేస్తున్న బంధువుల అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సోషల్ మీడియా మెసేజింగ్ యాప్ 'స్నాప్‌చాట్' ద్వారా బాలికలతో పరిచయం పెంచుకుని, వారిపై లైంగిక వేధింపులకు పాల్పడారని, ఆ బాలికల అశ్లీల వీడియోల (చైల్డ్ పోర్నోగ్రఫీ)ను ఇతరులకు పంపారని ఆయనపై కేసునమోదైంది. స్నాప్‌చాట్‌లో ఆ వీడియోలు షేర్ అవుతున్న ఖాతా ఐపీ (ఇంటర్నెట్ ప్రొటోకాల్) అడ్రస్ ఆధారంగా అమెరికా దర్యాప్తు అధికారులు సాయికుమార్ ను అరెస్టు చేశారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో.. స్నాప్‌చాట్‌లో తాను 13-15 ఏళ్ల బాలుడని నమ్మిస్తూ 18 మంది అమెరికా బాలికలతో చాటించ్ చేసి, మభ్యపెట్టి.. వారి నుంచి నగ్న, అశ్లీల వీడియోలు సేకరించారని గుర్తించారు. నిరాకరించిన బాలికలను, వారి కుటుంబసభ్యులను చంపేస్తామని, అశ్లీల ఫొటోలు, వీడియోలు బయటపెడతానని బెదిరించాడని తేల్చారు. ఈ మేరకు కోర్టులో చార్జిషీట్ వేశారు. విచారణలో ముగ్గురు బాలికలతో నేరపూరితంగా ప్రవర్తించినట్టుగా సాయికుమార్ అంగీకరించి, తనకు తక్కువ శిక్ష వేయాలని న్యాయమూర్తిని అభ్యర్థించారు.

బాలలపై నేరాలకు తీవ్రమైన శిక్షలు

బాలికలపై వేధింపులు, చైల్డ్ పోర్నోగ్రఫీని అత్యంత తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ.. న్యాయమూర్తి చార్లెస్ గుడ్విన్ సాయికుమార్‌కు 35 ఏళ్ల (420 నెలలు) జైలుశిక్ష విధిస్తూ ఈ ఏడాది మార్చి 27న తీర్పు ఇచ్చారు. దీంతో మానసిక వేదనకు గురైన సాయికుమార్.. గత నెల 26న జైలులో ఉరివేసుకున్నారు. సాయికుమార్ వ్యక్తిగతంగా చాలా మంచివాడేనని, అమెరికాలో ఇలాంటి దారుణానికి పాల్పడ్డాడంటే నమ్మలేకపోతున్నామని నెల్లుట్ల గ్రామస్తులు అంటున్నారు.

టీటీడీకి అనుసంధానంగా రూ.100 కోట్లతో కొడంగల్ ఆలయ అభివృద్ధి

- దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్

కొడంగల్/హైదరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): టీటీడీకి అనుసంధానంగా ఆగమ శాస్త్రం ప్రకారం కొడంగల్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తామని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ అన్నారు. ఆమె శనివారం వికారాబాద్ జిల్లాలోని కొడంగల్‌లో పర్యటించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్, ధార్మిక సలహాదారులు గోవిందు, హరితో కలిసి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన ఆమెకు ధర్మకర్తలు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. సీఎం ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యార్థం టీటీడీ తరహాలో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధిలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి ప్రభుత్వం.. ఇంటి స్థలంతోపాటు పరిహారం చెల్లిస్తుందన్నారు. అంతకు ముందు కడా కార్యాలయంలో ఆలయ పనులపై ప్రజంటేషన్‌ను పరిశీలించారు.

అనుమతి లేకుండా లోకకల్యాణాలు, బ్రహ్మోత్సవాలు వద్దు

దేవాదాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు ముందస్తు అనుమతి లేకుం డా లోకకల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, ప్రవచనాలు నిర్వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కొందరు వేదపండితులు, అర్చకులు అనుమతులు లేకుండా రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంలో కమిషనర్ దృష్టి సారించాలని, స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ సర్క్యులర్ జారీ చేయాలన్నారు.

అర్చక, ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా

దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు పొందుతున్న అర్చక, ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా సదుపాయం కల్పించేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు. శనివారం బ్యాంకర్లతో దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్రావు నేతృత్వంలో అధికారుల బృందం సమీక్ష నిర్వహించింది. ఏడీసీలు కృష్ణవేణి, శ్రీనివాస రావు, అర్చక, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, అర్చక వెల్ఫేర్ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు కాండురి కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు. కేవలం గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాలు పొందుతున్నవారే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో చిన్న ఆలయాల్లో పనిచేసే అర్చకులకు సైతం ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని నిర్ణయించారు. బ్యాంకర్ల నుంచి నివేదికలు స్వీకరించిన ఉన్నతాధికారులు.. ప్రభుత్వానికి త్వరలోనే నివేదిక అందించనున్నారు.

ఏపీకి రూ.లక్ష కోట్ల రోడ్లు మంజూరు చేస్తాం

- 27వేల కోట్ల విలువైన ఆరు ప్రాజెక్టులకు తక్షణ ఆమోదం
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వరాల జల్లు

అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే రెండేళ్ల వ్యవధిలో ఏపీకి లక్ష కోట్ల రూపాయల విలువైన రహదారి ప్రాజెక్టులను మంజూరు చేస్తామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీ ప్రకటించారు. శనివారం ఇక్కడి మంగళగిరిలో జరిగిన సమావేశం సాక్షిగా ఆయన ఏపీపై వరాలజల్లు కురిపించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆరు కీలక ప్రాజెక్టులకు గడ్కరీ తక్షణ ఆమోదం తెలిపారు. ఈప్రాజెక్టుల విలువ 27వేల కోట్లపైమాటే. సీఎం చంద్రబాబుతో కలిపి రూ.2800కోట్ల విలువైన కొత్త రహదారి వర్క్‌లకు శంకుస్థాపన చేశారు. అలాగే, రూ.2100 కోట్ల వ్యయంతో పూర్తిచేసిన రెండు రహదారులను జాతికి అంకితం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనల జాబితా చాలా పెద్దగా ఉందంటూ చమత్కరించిన ఆయన, ప్రతి ప్రాజెక్టునూ ఆమోదిస్తామన్నారు.

75 ఏళ్ల నిబంధన మోదీకి వర్తించదా?

(మొదటిపేజీ తరువాయి)

దాటనివ్వబోమని ప్రకటించారు. మోదీని ఓడించేందుకు, ఆయనను కుర్చీ నుంచి దింపేందుకు, రాజ్యాంగాన్ని రక్షించేందుకు రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులన్నీ పోరాడతాయని చెప్పారు. శనివారం ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ఏఐసీసీ ఆధ్వర్యంలో 'రాజ్యాంగ సవాళ్లు: దృక్పథం, మార్గాలు' అనే అంశంపై నిర్వహించిన కాంగ్రెస్ వార్షిక న్యాయసదస్సులో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "2001లో ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఇప్పటివరకు కుర్చీని నరేంద్రమోదీ వదలడం లేదు. ఆర్‌ఎస్ఎస్ చెప్పినా ఆయన వినడం లేదు. రెండు నెలల క్రితమే ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ 75 ఏళ్లు నిండినవారు కుర్చీ వదలాలని చెప్పారు. అయినా.. మోదీ అందుకు సిద్ధంగా లేరు. అద్వాణీ, మురళీ మనోహర్ జోషికి వర్తించే నిబంధనలు మోదీకి వర్తించవా? మోదీని కుర్చీ నుంచి ఆర్‌ఎస్ఎస్, వాజపేయి దింపలేకపోయారు. వాళ్లతో కానిది మనం చేసి చూపిద్దాం. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీయే మోదీని కుర్చీ నుంచి దింపేస్తారు. మోదీ లేకుంటే బీజేపీకి 150 సీట్లు కూడా రావని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే అన్నారు. దూబే నీ డైరీలో రాసి పెట్టుకో. బీజేపీకి 150కి మించి ఒక్క సీటు కూడా రానివ్వం" అని రేవంత్ అన్నారు. రాహుల్‌గాంధీ అనుకుంటే 2004లోనే కేంద్ర మంత్రి, 2009లోనే ప్రధానమంత్రి అయ్యేవారని గుర్తు చేశారు. కానీ, ఆ రెండింటినీ ఆయన త్యాగం చేశారని తెలిపారు. త్యాగాలు కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని, సామాన్య కార్యకర్తగానే రాహుల్ కొనసాగుతున్నారని గుర్తుచేశారు. పేదలు, దళితులు, ఆదివాసీలు, ఓబీసీల కోసం, సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా రాహుల్ గాంధీ పోరాడుతున్నారని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే కాంగ్రెస్ పార్టీ ఉందని, బ్రిటిష్ వాళ్లతో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, ఈ విషయాన్ని బీజేపీ వాళ్లకు గుర్తు చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ మినహా.. బీజేపీ, బీఆర్ఎస్, జేడీ, బీజేడీ, ఆర్జేడీ సహా ఇతర పార్టీలన్నీ స్వాతంత్ర్యం తర్వాతే వచ్చాయని గుర్తు చేశారు. ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయని, కానీ.. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా ప్రజల మధ్య ఉన్న పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, 11 ఏళ్లుగా సామాజిక న్యాయం గురించి ఆయన ఆలోచించడం లేదని ఆరోపించారు. వక్ర మార్గంలో ఉన్న నేతలను రెండు చెంపదెబ్బలు కొట్టయినా దారిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోందని తెలిపారు.



రాహుల్‌గాంధీతో రేవంత్‌రెడ్డి కరచాలనం

కాంగ్రెస్ త్యాగాల పార్టీ..

ఇందిరాగాంధీ పాకిస్థాన్‌ను యుద్ధంలో ఓడించి.. రెండు ముక్కలు చేసి.. కాళీమాతగా గుర్తింపు పొందారని రేవంత్ అన్నారు. ఉగ్రవాదుల నుంచి దేశాన్ని ఇందిరాగాంధీ రక్షించారని, ఆ క్రమంలో ఆమె ప్రాణాలనూ త్యాగం చేశారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో రాజీవ్‌గాంధీ కూడా అమరత్వం పొందారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఏం చేసిందని పదే పదే బీజేపీ వాళ్లు ప్రశ్నిస్తున్నారని, ఈ దేశం కోసం గాంధీజీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణత్యాగాలు చేశారని అన్నారు. 2004లో కేంద్రంలో యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలని సోనియాగాంధీని అందరూ కోరినా.. ఆమె దానిని త్యాగం చేసి మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిని చేశారని తెలిపారు. రాష్ట్రపతిగా అవకాశం వచ్చినా వదులుకొని ప్రణబ్ ముఖర్జీని రాష్ట్రపతిని చేశారని పేర్కొన్నారు. ఇక దేశంలో సామాజిక న్యాయం, కులగణన కోసం ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు నూతన సామాజిక న్యాయ సాధనకు రాహుల్‌గాంధీ నేతృత్వంలో పోరాడతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. భారత్ జోడో యాత్ర సమయంలో తెలంగాణలో కుల గణనపై రాహుల్ ఇచ్చిన హామీ మేరకు తాము కులగణన చేశామని, దేశానికి మోడల్‌గా ఇచ్చామని అన్నారు.

సుప్రీం తీర్పుపై ఏం చేద్దాం?

» న్యాయ సలహా తీసుకోవాలనే యోచన

» పోచారం నివాసంలో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు శనివారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. భవిష్యత్తు కార్యాచరణపై వారు చర్చించారు. ఈ కేసును వాదిస్తున్న సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, ముకుల్ రోహిత్గీలను సంప్రదించి, న్యాయ సలహా తీసుకుని ముందుకెళ్లాలని ఒకరిద్దరు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. అదే సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నుంచి కూడా పిలుపు వస్తుందని, వేర్వేరుగా తమ అభిప్రాయాన్ని తీసుకునే అవకాశం ఉందని చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో తమకు సరైన ప్రాధాన్యత లేకపోవడం వల్లనే ఆ పార్టీకి దూరంగా ఉంటున్నామని, అధిష్ఠానం తీరు నచ్చక అసంతృప్త ఎమ్మెల్యేలంతా కలిసి ప్రత్యేక గ్రూపుగా ఏర్పడ్డామని, పార్టీలోనే ఉంటూ ప్రత్యేక శిబిరంగా కొనసాగుతున్నామని, ఇదే విషయాన్ని కోర్టుకు, స్పీకర్‌కు కూడా వెల్లడిస్తే బాగుంటుందని ఒకరిద్దరు సీనియర్ ఎమ్మెల్యేలు అభిప్రాయపడినట్లు తెలిసింది. కాగా, ఈ భేటీకి ఉమ్మడి రంగారెడ్డిలోని గ్రేటర్‌కు సమీపంలో ఉన్న ఓ ఎమ్మెల్యే హాజరు కాలేదని సమాచారం. మిగతా 9 మందీ పాల్గొన్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.

మోదీ గ్రాఫ్ పడిపోయిందనే..

» 75 ఏళ్లకే రిటైర్మెంట్ అంశాన్ని తెరపైకి తెచ్చిన ఆర్‌ఎస్ఎస్: నారాయణ

హైదరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మోదీ గ్రాఫ్ పడిపోయిందనే నాయకులకు 75 ఏళ్ల వరకే పదవీ కాలం అనే అంశాన్ని ఆరెస్సెస్ తెరపైకి తీసుకొచ్చిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ అన్నారు. పహల్గాం ఉగ్రవాదులను పార్లమెంట్ సమావేశాలకు ఒక్కరోజు ముందు హతమార్చి, వారి శవాలను అడ్డం పెట్టుకుని సభలో తప్పించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అబద్ధాలను అవలీలగా చెప్పే వ్యక్తులు దేశంలో ఇద్దరే ఇద్దరు ఉన్నారని, అందులో మొదటివారు మోదీ, రెండో వ్యక్తి కేసీఆర్ అని విమర్శించారు. శనివారం ఆయన సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని మోదీ బానిసత్వం చేయడం అవమానకరమన్నారు. కర్ణాటకలోని ధర్మస్థల ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని, బోర్డు సభ్యులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను 4ఏళ్లుగా పెండింగ్‌లో పెట్టడమంటే నేరమేనన్నారు. కాళేశ్వరం అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీల పార్టీ ఫిరాయింపులపై ఎన్నికల కమిషన్ ఏం చేస్తోందని నిలదీశారు. ఎవరైనా పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే ఎన్నికల కమిషన్ వారిని అనర్హులుగా ప్రకటించాలని కోరారు.

క్రీడల అభివృద్ధికి.. 9 ఒప్పందాలు

రాష్ట్రంలో ఫిఫా సాకర్ అకాడమీ ఏర్పాటు.. షూటింగ్‌లో అత్యాధునిక శిక్షణ

» క్రీడాకారుల ప్రదర్శన విశ్లేషణ, గాయాల పాలవకుండా ప్రత్యేక వ్యవస్థ

» గురుకుల విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ

» 'స్పోర్ట్స్ కాన్‌క్లేవ్'లో ఒప్పందాలు

» క్రీడల్లో ప్రపంచంతో పోటీ పడతాం

» క్రీడల్లో రాజకీయ జోక్యం తగ్గించేందుకు స్పోర్ట్స్ హబ్ బోర్డు: సీఎం రేవంత్‌రెడ్డి



క్రీడాకారిణికి చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్రంలో క్రీడా రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం తొమ్మిది కీలక అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకుంది. వివిధ క్రీడల్లో ప్రత్యేక శిక్షణతోపాటు క్రీడాకారులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు వీలుగా చర్యలు చేపట్టనుంది. గురుకులాల్లోని విద్యార్థులను జల్లెడపట్టి ప్రతిభావంతులను ఎంపిక చేసి ప్రత్యేకంగా శిక్షణ అందించనుంది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన స్పోర్ట్స్ కాన్‌క్లేవ్‌లో రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది ఎంవోయూలు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా పాలసీని సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రపంచ క్రీడా రంగంతో పోటీపడేలా ఈ పాలసీని రూపొందించామనితెలిపారు. ఈ పాలసీ కాగితాలపై మాత్రమే కనిపించేది కాదని, తెలంగాణకు బంగారు రేఖగా మారుతుందని చెప్పారు. ప్రపంచ క్రీడా రంగంలో ప్రభావం చూపాలంటే.. దేశ క్రీడా వ్యవస్థలో సమూల మార్పులు రావాలని ఆయన చెప్పారు. ఆ మార్పు తెలంగాణ నుంచే మొదలవనుందన్నారు. రాష్ట్రంలో క్రీడా రంగ అభివృద్ధి కోసం ముందుకొచ్చే సంస్థలకు ప్రభుత్వ అనుమతుల కోసం సింగిల్ విండో విధానం అమలు చేస్తామని తెలిపారు. యంగ్ ఇండియా యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీల ఏర్పాటుకు సహకరించేందుకు క్రీడా రంగ ప్రముఖులు, కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని కోరారు.

స్పోర్ట్స్ గవర్నింగ్ బోర్డు ఏర్పాటు..

క్రీడల్లో రాజకీయ జోక్యం తగ్గించేందుకు, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం పెంచేందుకు స్పోర్ట్స్ హబ్ ఆఫ్ తెలంగాణ బోర్డును ఏర్పాటు చేసినట్టు సీఎం రేవంత్ తెలిపారు. దీనికి సంజీవ్ గోయెంకా చైర్‌పర్సన్‌గా, కొణిదెల ఉపాసన కో-చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రముఖ క్రీడాకారులు కపిల్ దేవ్, బైచుంగ్ భూటియా, పుల్లెల గోపీచంద్, గగన్ నారంగ్, అభినవ్ బింద్రా, హైదరాబాద్ సన్‌రైజర్స్ క్రికెట్ జట్టు యజమాని కావ్యమారన్ తదితరులు ఈ బోర్డులో సభ్యులుగా, మార్గదర్శకులుగా ఉంటారని వివరించారు. కాగా, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్వహణ కోసం కొరియా క్రీడా విశ్వవిద్యాలయంతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో గత పదేళ్లలో క్రీడా మైదానాలు సన్‌బర్న్ ఈవెంట్లు, ఇతర వేడుకలకు ఫంక్షన్ హాళ్లుగా మారిపోయాయని విమర్శించారు. సరైన క్రీడా పాలసీ లేకనే యువత పెడదారి పడుతోందన్నారు. ఈ కాన్‌క్లేవ్‌లో రాష్ట్ర క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడా ప్రముఖులు అభినవ్ బింద్రా, అనిల్ కుంబ్లే, గగన్ నారంగ్, అంజూ బాబీ జార్జ్, రవికాంత్‌రెడ్డి, నయీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది ఒప్పందాలు ఇవే

- హైదరాబాద్‌లో ఫిఫా సాకర్ అకాడమీ ఏర్పాటు కోసం జాతీయ ఫుట్‌బాల్ సంఘంతో ఒప్పందం.
- రాష్ట్ర షూటర్లకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు ఒలింపియన్ షూటర్ గగన్ నారంగ్‌కు చెందిన 'గన్ ఫర్ గ్లోరీ (జీఎఫ్‌జీ) ఫౌండేషన్‌తో ఒప్పందం. హెచ్‌సీయూలోని శాట్ షూటింగ్ రేంజ్‌ను ప్రభుత్వం ఆధునికీకరిస్తుంది. శాట్ ప్రతిపాదించిన 20 మంది షూటర్లకు జీఎఫ్‌జీ అత్యాధునిక శిక్షణ ఇస్తుంది.
- రాష్ట్రంలో షూటింగ్ అభివృద్ధి కోసం గగన్ నారంగ్ మెంటార్‌గా వ్యవహరిస్తారు. ప్రతిభావంతులైన షూటర్ల గుర్తింపు, శిక్షణను పర్యవేక్షిస్తారు.
- బ్యాడ్మింటన్ మెంటార్‌గా నియమితులైన పుల్లెల గోపీచంద్.. ప్రతిభావంతులైన షట్లర్ల గుర్తింపు, శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.
- 'స్పోర్ట్స్ సైన్స్ సెంటర్-అథ్లెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' కోసం ఒలింపియన్ అభినవ్ బింద్రాకు చెందిన 'అభినవ్ బింద్రా టార్గెటింగ్ పెర్ఫామెన్స్ (ఏబీటీపీ)'తో ఒప్పందం క్రీడాకారుల ప్రదర్శన విశ్లేషణ, గాయాల బారిన పడకుండా చర్యలు, త్వరగా కోలుకునేందుకు అవసరమైన వ్యవస్థ ఏర్పాటుకు ఏబీటీపీ సహకారం అందిస్తుంది. గురుకులాల్లో క్రీడాకారులకు శిక్షణ, క్రీడా సామగ్రి అందించేందుకు కూడా ఈ సంస్థతో ఒప్పందం జరిగింది.
- క్రీడాకారుల్లో ఆత్మ స్థైర్యం, విశ్వాసం పెంపు, ఇంగ్లిష్ భాష, డిజిటల్ అక్షరాస్యతపై పట్టు కల్పించేందుకు ఆస్పైర్ సంస్థతో ఒప్పందం.
- 'బాస్కెట్‌బాల్ హైపెర్ఫామెన్స్ కోచింగ్ ప్రోగ్రాం' నిర్వహణ కోసం స్పోర్ట్జ్‌ప్రీ కంపెనీతో ఒప్పందం. ఈ క్రీడలో సబ్ జూనియర్ నుంచి సీనియర్ల వరకు శిక్షణ ఇస్తారు.
- అథ్లెటిక్స్, కబడ్డీ, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, వాలీబాల్ క్రీడాంశాల్లో గురుకుల విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు అనిల్ కుంబ్లేకు చెందిన టెన్‌విక్ సంస్థతో ఒప్పందం. సుమారు లక్షా 50 వేల మంది విద్యార్థులను పరీక్షించి, ప్రతిభావంతులను గుర్తిస్తారు.



గగన్‌నారంగ్‌తో ఎంవోయూ కుదుర్చుకుంటున్న దృశ్యం

ఐదుగురు క్రీడాకారులకు చెక్కులు

స్పోర్ట్స్ కాన్‌క్లేవ్ సందర్భంగా ఐదుగురు క్రీడాకారులకు ఆర్థిక సాయం చెక్కులను సీఎం అందజేశారు. హెప్టాథ్లాన్ క్రీడాకారిణి అగసర నందినికి రూ.5 లక్షలు, జిమ్నాస్ట్ నిషిక అగర్వాల్‌కు రూ.3 లక్షలు, షూటర్ ధనుష్ శ్రీకాంత్‌కు రూ.10 లక్షలు, గోల్‌బాల్ క్రీడాకారులు పవన్ కల్యాణ్, సాయితేజకు చెరో రూ.2 లక్షల 40 వేలు అందజేశారు.

యూరియాపై పార్లమెంట్‌లో తప్పుడు లెక్కలు

» ఖరీఫ్‌కు రాష్ట్రానికి కేటాయించింది 9.80 లక్షల టన్నులే

» సభలో 20.20 లక్షల టన్నులని చెప్పారు

» కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్‌కు రాష్ట్ర మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు యూరియా సరఫరా అంశంపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల టన్నుల యూరియా కేటాయించి, పార్లమెంట్‌లో మాత్రం 20.20 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నాయని చెప్పడంపై తుమ్మల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ తప్పుడు లెక్కల వల్ల రాష్ట్ర రైతులు అయోమయానికి గురయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో యూరియా పరిస్థితిపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్‌కు మంత్రి తుమ్మల శనివారం ఓ లేఖ రాశారు. కేంద్ర రసాయనాలు, ఎరువుల విభాగం రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల వివరాలతో కూడిన లేఖను దానికి జతపరిచారు. 2025 ఖరీఫ్ కోసం రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల టన్నులు మాత్రమే కేటాయించారని, దానిలో కూడా నెలవారీ సరఫరా చేయాల్సిన దాని కంటే తక్కువ సరఫరా చేస్తున్నారని తుమ్మల పేర్కొన్నారు. ఫలితంగా రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని వివరించారు. ఏప్రిల్ నుంచి జూలై వరకు 6.60 లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా కేంద్రం 4.36 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేసిందని తెలిపారు. కేటాయింపుల ప్రకారం జూలై వరకు సరఫరా కానీ 2.24 లక్షల టన్నుల యూరియాతోపాటు ఆగస్టు నెల కేటాయింపులు త్వరగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల కోరారు.

చంద్రబాబు అరెస్టును మొదట ఖండించింది నేనే: తుమ్మల

ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు తొలుత స్పందించింది, అరెస్టును ఖండించింది తానేనని మంత్రి తుమ్మల అన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తి, ఆశీస్సులతోనే రాజకీయాల్లోకి వచ్చానని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ఎక్కడా ఎప్పుడూ కమ్మ జాతి గౌరవం తగ్గకుండా నిస్వార్థంగా పనిచేశానని చెప్పారు. పీసీసీ ప్రధాన కార్యదర్శిగా బండి రమేష్, ఉపాధ్యక్షుడిగా పృథ్వీ చౌదరి ఎన్నికైన సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని కమ్మ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన సభకు తుమ్మల హాజరై మాట్లాడారు. సమాజ సేవ కోసం కమ్మ సంఘాలు అనునిత్యం పనిచేస్తున్నాయని అభినందించారు. త్వరలో కమ్మ సంఘాల సమాఖ్య సమావేశం నిర్వహించాలని, దానికి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని పిలవాలని సూచించారు. 1985లో ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా 60 మంది కమ్మ ప్రజాప్రతినిధులు ఉన్నా అమీర్‌పేట కమ్మ సంఘం భవనం శంకుస్థాపనకు ఎవరూ రాలేదని, తానొక్కడినే నిర్భయంగా వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు.

అసెంబ్లీ పాత భవన పునరుద్ధరణ పూర్తిచేయాలి

పనులను పరిశీలించిన మండలి చైర్మన్

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న శాసనమండలి సమావేశాలను అసెంబ్లీ పాత భవనంలో నిర్వహించేందుకు భవన పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తి చేయాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రోడ్లు భవనాల శాఖ, ఆగాఖాన్ సంస్థతో పాటు శాసనసభ అధికారులతో కలిసి ఆయన శనివారం పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వర్షాకాల సమావేశాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా పాత అసెంబ్లీ భవనంలోనే మండలి సమావేశాలు నిర్వహించాలని ఆదేశించినట్టు తెలిపారు.

స్పీడ్‌పోస్టులో రిజిస్టర్డ్ పోస్టు విలీనం

సెప్టెంబరు 1 నుంచి అమలు

న్యూఢిల్లీ, ఆగస్టు 2: భారత తపాలాశాఖ సుదీర్ఘకాలంగా అందిస్తున్న రిజిస్టర్డ్ పోస్టు సేవలను స్పీడ్ పోస్టులోకి విలీనం చేయనుంది. లేఖలను అడ్రస్‌లో పేర్కొన్న వ్యక్తికి మాత్రమే అందించడం ద్వారా రిజిస్టర్డ్ పోస్టు గమ్యస్థానానికి సురక్షితంగా చేర్చుతుందనే అభిప్రాయం ఉంది. రిజిస్టర్డ్ పోస్టుతో పోల్చితే స్పీడ్ పోస్టు వేగవంతంగా గమ్యస్థానానికి చేర్చుతుంది. మెయిల్ సేవలను క్రమబద్ధీకరించడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడం, ట్రాకింగ్ మెకానిజాన్ని మెరుగుపరచడం, వినియోగదారులకు మరింత సౌకర్యవంతమైన సేవలందించడం లక్ష్యంగా ఈ విలీనం చేయనున్నట్టు సంస్థలోని అధికారులకు జూలై 2న తపాలాశాఖ అంతర్గతంగా ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. సెప్టెంబరు 1 నుంచి ఇది అమలవుతుందని పేర్కొంది. అవసరమైన చోట 'రిజిస్టర్డ్ పోస్టు', 'రిజిస్టర్డ్ పోస్టు విత్ అక్నాలడ్జ్‌మెంట్ డ్యూ' అనే పదాలను తొలగించి ఆ స్థానంలో స్పీడ్‌పోస్టు టెర్మినాలజీని వినియోగించాలని అన్ని డైరెక్టరేట్లు, డివిజన్లను డీడీజీ(మెయిల్ ఆపరేషన్స్) దుష్యంత్ ముద్గల్ ఆదేశించారు. ఆ మేరకు పరిపాలనా పరమైన ఆదేశాలు, ఎస్‌ఓపీలు(ప్రామాణిక కార్యాచరణ విధానాలు), సాంకేతిక మాన్యువల్స్, శిక్షణ మాడ్యూల్స్, వర్క్‌ఫ్లో డాక్యుమెంట్లను సమీక్షించి, అప్‌డేట్ చేయాలని నిర్దేశించారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల పునర్వ్యవస్థీకరణ

» కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాల నిర్మాణం

» త్వరలో గచ్చిబౌలిలో శంకుస్థాపన: పొంగులేటి



హైదరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ సేవలు మరింత సమర్థంగా, పారదర్శకంగా ఒకే చోట అందేలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించనున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ ఆఫీసులను నిర్మిస్తామని వెల్లడించారు. సచివాలయంలో శనివారం రెవెన్యూ కార్యదర్శి లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి శనివారం పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా 37 మాత్రమే సొంత భవనంలో ఉన్నాయని మిగిలినవి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దశలవారీగా కొత్త కార్యాలయాలను నిర్మించాలన్న ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నాలుగు లేదా ఐదు కార్యాలయాలను ఒకే చోట నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రెండు చోట్ల, రంగారెడ్డి జిల్లాలోని 14 ఆఫీసులను మూడు చోట్ల, మేడ్చల్ జిల్లాలోని 12 కార్యాలయాలను మూడు చోట్ల.. సంగారెడ్డి, పఠాన్‌చెరు కలిపి ఒక చోట ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడటమే కాకుండా పర్యవేక్షణ సులభమవుతుందని, అవినీతిని తగ్గించవచ్చని, కార్యాలయాల మధ్య పని భారం సమానంగా ఉండటంతో పాటు దస్త్రాల పరిశీలన వేగవంతం అవుతుందని వివరించారు. మొదటగా హైదరాబాద్‌లోని గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్(తాలిమ్) కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్‌గా నిర్మిస్తామని ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి ఈ భవన నమూనాకు తుది రూపునిస్తామని, వీలైనంత త్వరగా శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి తెలిపారు.

'ఇందిరమ్మ ఇళ్ల'కు కేంద్రం కొర్రీలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరు చేసే ఇళ్ల నిర్మాణం కోసం కేంద్రంపై ఆధారపడలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇళ్ల విషయంలో కేంద్రం అనేక కొర్రీలు వేస్తోందని ఆరోపించారు. శనివారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై) పథకం కింద గ్రామీణ ప్రాంతాలకు రూ.72వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.52 లక్షలను మాత్రమే అందిస్తున్నదని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలకు ఇస్తున్నదని అన్నారు. అందుకే కేంద్రం నుంచి అందే అరకొర సహాయంపై ఆధారపడకుండానే ప్రభుత్వం అనుకున్న విధంగా రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. అలాగే కేంద్రం సూచించిన విధంగా దరఖాస్తుదారుల విషయంలో రీ సర్వే కూడా చేపట్టామని, ఇది తుది దశలో ఉందన్నారు. అయితే లబ్ధిదారుల విషయంలో కేంద్ర నిబంధనల కంటే రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలే పకడ్బందీగా ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా కేంద్రం సహకరించకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఆగవని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా సీఎం రేవంత్ ఆలోచనకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు ఆశించిన స్థాయిలో పురోగతిలో ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక, భూ భారతికి వచ్చిన దరఖాస్తుల్లో ప్రధానంగా సాదాబైనామాలకు సంబంధించినవే ఉన్నాయని, ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని.. కోర్టు తీర్పురాగానే పరిష్కరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచామన్నారు. కాగా తన పీఏ, డిప్యూటీ తహశీల్దార్ నవీన్‌రెడ్డి రచించిన తెలంగాణ చరిత్ర, ఉద్యమం, కళలు పుస్తకం ఐదో ఎడిషన్‌ను మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు.

షోరూం వద్దే రిజిస్ట్రేషన్

» వాహనాల డీలర్ల వద్ద ఆన్‌లైన్‌లో ప్రక్రియ

» వాహనదారు ఇంటికే స్మార్ట్‌కార్డు.. రవాణా శాఖ నిర్ణయం

» జనవరి నుంచి అమల్లోకి..దళారీ వ్యవస్థకు పడనున్న అడ్డుకట్ట

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కొత్తగా వాహనం కొనుగోలు చేస్తున్నారా! అయితే రిజిస్ట్రేషన్ కోసం ఇకపై స్లాట్ బుక్ చేసుకోవాల్సిన అవసరం లేదు. స్లాట్ కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సిన అవసరం అసలే లేదు. వాహనం కొనుగోలు చేసిన వెంటనే అక్కడికక్కడే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని రవాణా శాఖ కల్పించబోతోంది. వాహన డీలర్ (షోరూం) వద్దనే అవసరమైన రుసుమును ప్రభుత్వానికి ఆన్‌లైన్‌లో చెల్లించి సులువుగా రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించనుంది. డీలర్ వద్ద రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం శాశ్వత రిజిస్ట్రేషన్ (పీఆర్) స్మార్ట్ కార్డు ప్రస్తుతం అందిస్తున్న తరహాలోనే.. పోస్టల్‌లో నేరుగా వాహనదారుడి ఇంటికి వస్తుంది. దీంతో.. రవాణా శాఖ కార్యాలయంలో సిబ్బంది కొరత, రోజురోజుకూ పెరుగుతున్న నూతన వాహనాల సంఖ్య నేపథ్యంలో అటు అధికారులు, సిబ్బందికి, ఇటు వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఫుల్‌స్టాప్ పడనుంది. అంతేకాదు.. వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాల వద్ద కొనసాగుతున్న దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట పడనుంది. మూడో వ్యక్తి ప్రమేయం లేకుండానే వాహనదారులకు సేవలు అందనున్నాయి. ఎటువంటి ఇబ్బంది లేకుండా సులువుగా, తక్షణమే వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే ఈ నూతన విధానం అమలుపై రవాణా శాఖ కసరత్తు పూర్తి చేసింది. వచ్చే ఏడాది జనవరి నుంచి ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చే యోచనలో అధికారులు ఉన్నారు. ఇటీవల జరిగిన కీలక సమావేశంలో వారు ఈ అంశంపై చర్చించారు. డీలర్ల వద్ద వాహన రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేసి, అనుమతి కూడా పొందారు. ప్రతి రోజూ సుమారు 2500 వరకు ద్విచక్ర వాహనాలు, 600కు పైగా కార్లు, ఇతర వాహనాలు రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. డీలర్లకే రిజిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించడం వల్ల వాహనదారులు రవాణా శాఖ కార్యాలయానికి రావాల్సిన అవసరం ఉండదు. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడంతోపాటు అధికారులు, సిబ్బందికి పని ఒత్తిడి తగ్గుతుంది. వారు ఇతర సేవలపై ఎక్కువగా దృష్టి సారించి సత్వర సేవలు అందించే అవకాశం కలుగుతుంది. డీలర్ల వద్దే వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో అమల్లో ఉంది. ఆయా రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన అధికారులు తెలంగాణలోనూ నూతన విధానం తెస్తున్నారు. దీంతో వాహనదారుల అసౌకర్యం, సిబ్బందిపై పనిభారం సహా అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుందని రవాణా శాఖ కీలక అధికారి ఒకరు అన్నారు. వాస్తవానికి రహదారి భద్రత చట్టంలో కేంద్ర ప్రభుత్వం వాహనదారులకు ఊరట కల్పించే అనేక అంశాలను పొందుపరిచింది. అందులో ఒకటి వాహనాలకు డీలర్ల వద్దే రిజిస్ట్రేషన్ చేయడం. ఇందుకు సంబంధించి 2016లోనే కేంద్రం మార్గదర్శకాలు రూపొందించింది. ఆ మార్గదర్శకాలకు లోబడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో నూతన విధానం అందుబాటులోకి వచ్చింది. త్వరలో తెలంగాణలోనూ ఈ విధానం అమల్లోకి రానుంది.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

■ ఆర్కే RK

సాధారణ ఎన్నికలకు మరో మూడేళ్లకు పైగా వ్యవధి ఉన్నప్పటికీ తెలంగాణ రాజకీయాలు ఇప్పటికే వేడెక్కాయి. జన నేతగా ప్రచారం చేయించుకుంటున్న కేటీఆర్ బీఆర్‌ఎస్‌లో అంతా తానై వ్యవహరిస్తున్నారు. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడానికి కూడా ఆయన నిరాకరిస్తున్నట్టుగా ఉంది. ఒక నికృష్టుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడు అంటూ తనలోని అక్కసును వెళ్లగక్కుతున్నారు. ఈ ఇరువురి మధ్య ఉండాల్సిన రాజకీయ వైరం వ్యక్తిగత వైరంగా మారుతోంది. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీలో తిరుగుబాటు రాబోతోంది అన్నట్టుగా తన చేతిలోని మీడియా ద్వారా కేటీఆర్ ప్రచారం చేయిస్తున్నారు. రేవంత్‌రెడ్డి స్థానంలో కాంగ్రెస్ పార్టీ తరఫున మరొకరు ముఖ్యమంత్రి అయితే కేటీఆర్ శాంతించవచ్చు. తమ అంచనాలకు భిన్నంగా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని కేసీఆర్ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. ఈ కారణంగానే పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హత వేటు పడి ఉప ఎన్నికలు రావాలని ఆ కుటుంబం బలంగా కోరుకుంటోంది.

'ఫిరాయింపు' చిక్కులు!

సుప్రీంకోర్టు తీర్పుతో పార్టీ ఫిరాయింపులకు అడ్డుకట్ట పడుతుందా? పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది తెలంగాణ ఎమ్మెల్యేల విషయంలో మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీం తీర్పును శాసనసభ స్పీకర్ ఔదాల్చుతారా? చట్ట సభల స్పీకర్లు ఇకపై సుప్రీంకోర్టు పరిధిలోకి వెళతారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించాలంటే ఏం చేయాలి? జ్యుడీషియరీ, లెజిస్లేచర్ వ్యవస్థలలో ఎవరిది పై చేయి? చట్ట సభల స్పీకర్ల వ్యవహారాలపై తరచూ వివాదాలు ఎందుకు వస్తున్నాయి? ఈ ప్రశ్నలకు సుప్రీంకోర్టు తాజా తీర్పు సమాధానం చెప్పిందా? అంటే అవుననిగానీ, కాదనిగానీ చెప్పలేని పరిస్థితి! పార్టీ ఫిరాయింపు చట్టం లోపభూయిష్టంగా ఉండటంతోపాటు నిర్ణయాలు తీసుకోవడంలో చట్టసభల స్పీకర్లకు నిర్దిష్ట కాలవ్యవధి లేకపోవడమే వివాదాలకు కారణం అవుతోంది. ఒకప్పుడు చట్ట సభల స్పీకర్లు పార్టీలకు అతీతంగా, న్యాయబద్ధంగా నిర్ణయాలు తీసుకొనేవారు. కాలక్రమంలో స్పీకర్లు చట్టసభల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో వివాదాలు న్యాయస్థానాలకు చేరుతున్నాయి. అయితే స్పీకర్ల అధికారాల్లో జోక్యం చేసుకొనే విషయంలో సర్వోన్నత న్యాయస్థానానికి సైతం పరిమితులు ఉన్నందున వివాదాలు వివాదాలుగానే మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే భారత రాష్ట్ర సమితికి చెందిన ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేస్తుందని బీఆర్‌ఎస్ ఆశించింది. అప్పటికే పార్టీ ఫిరాయించిన వారిపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకుంటుందని బలంగా చెప్పడం ద్వారా మరికొందరు పార్టీ ఫిరాయించకుండా బీఆర్‌ఎస్ అడ్డుకోగలిగింది. అయితే సుప్రీంకోర్టు తీర్పు ఆ పార్టీకి ఆశాభంగం కలిగించిందని చెప్పవచ్చు. 'ఆపరేషన్ సక్సెస్–పేషెంట్ డెడ్' అన్నట్టుగా తమ తీర్పు ఉండకూడదని భావించిన సుప్రీంకోర్టు... ఫిరాయింపుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు మూడు నెలల గడువు విధించింది. ఈ గడువుకు లోబడి స్పీకర్ నిర్ణయం తీసుకోని పక్షంలో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలన్నా, చట్టసభలు–న్యాయ వ్యవస్థ మధ్య ఘర్షణ తలెత్తరాదన్నా నిర్ణయాలు తీసుకోవడంలో స్పీకర్‌కు పార్లమెంటు గడువు విధించాలని సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో పేర్కొంది. స్పీకర్ వద్ద వివాదాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఫలితంగా ఫిరాయింపుల నిరోధక చట్టం అపహాస్యం పాలవుతోంది. ఆ చట్టాన్ని మరింత పకడ్బందీగా సవరించడంతోపాటు స్పీకర్లకు కాలవ్యవధి నిర్ణయిస్తూ పార్లమెంటు చర్యలు తీసుకున్నప్పుడే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అప్పటివరకు జ్యుడీషియరీ, లెజిస్లేచర్‌లలో ఎవరిది పైచేయి అన్న అకడమిక్ చర్చలు సాగుతూనే ఉంటాయి.

అధికారంలో ఒకలా.. విపక్షంలో మరోలా!

అధికార పార్టీ ప్రయోజనాలు కాపాడటానికే ఆయా చట్ట సభల స్పీకర్లు అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున సకాలంలో నిర్ణయాలు వెలువడటం లేదు. పార్టీ ఫిరాయింపుల విషయమే తీసుకుందాం. అధికారంలో ఉన్నప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించని పార్టీ లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతిపక్షంలోకి వెళ్లాక అవే పార్టీలు అన్యాయం అంటూ ఆక్రోశిస్తుంటాయి. తెలుగు రాష్ట్రాలే ఇందుకు నిదర్శనం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన కొంత మంది ఎమ్మెల్యేలను నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఇలా చేయడం అనైతికం, అక్రమం అని టీఆర్‌ఎస్ అధినేతగా ఉన్న కేసీఆర్ ఆక్రోశించారు. ఒక పార్టీ తరఫున గెలిచిన వారిని మరో పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు? సీన్ కట్ చేస్తే... తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. తాను ఒకప్పుడు తప్పుపట్టిన పనినే ఆయన అధికారంలోకి వచ్చాక దర్జాగా చేశారు. కాంగ్రెస్–తెలుగుదేశం–కమ్యూనిస్టు పార్టీలకు చెందిన సభ్యులను తమ పార్టీలో కలుపుకొన్నారు. అప్పట్లో శాసనసభలో కేసీఆర్‌కు బొటాబొటి మెజారిటీ మాత్రమే ఉన్నందున ఈ చర్యను ప్రజలు కూడా పెద్దగా ఆక్షేపించలేదు. ఆయన రెండోసారి ముఖ్యమంత్రి అయినప్పుడు సభలో సొంతంగా కావల్సినంత మెజారిటీ ఉండింది. అయినా కాంగ్రెస్, తెలుగుదేశం సభ్యులను చేర్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా లభించకుండా చేశారు. ఇందులోని నైతికతను పక్కనపెడితే కేసీఆర్ చర్యను ప్రజలు కూడా ఆక్షేపించారు. ప్రభుత్వ మనుగడకు ముప్పు లేకపోయినా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అప్పట్లో తన చర్యను సమర్థించుకునేందుకు.. బంగారు తెలంగాణ సాధనకోసం వారంతా తనతో చేతులు కలిపారని కేసీఆర్ చెప్పుకొన్నారు. 2023లో భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోయింది. గతంలో కేసీఆర్ చేసిన విధంగానే తన ప్రభుత్వ సుస్థిరత కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఫిరాయింపులను ప్రోత్సహించారు. బీఆర్‌ఎస్ తరఫున గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో జట్టుకట్టారు. దీంతో బాధితుడిగా మిగిలిన కేసీఆర్, తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేయించారు. స్పీకర్ ఎంతకీ నిర్ణయం తీసుకోకపోవడంతో ముందు హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులపై అప్పటి స్పీకర్లు కూడా నిర్ణయాలను పెండింగ్‌లోనే ఉంచారు.

రాజీనామాలూ 'పెండింగ్'లోనే...

ఫిరాయింపుల విషయంలోనే కాదు, సభ్యుల రాజీనామాల విషయంలో కూడా స్పీకర్లు నిర్ణయాలు తీసుకోకుండా పెండింగ్‌లో పెడుతున్నారు. రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా ఉన్న నాదెండ్ల మనోహర్ సభ్యుల రాజీనామాలను ఆమోదించకుండా కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ తరఫున కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ముఖ్యమంత్రి పదవి తనకు కట్టబెట్టడానికి కాంగ్రెస్ అధిష్ఠానం నిరాకరించడంతో జగన్మోహన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకున్నారు. కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆయనతో చేతులు కలిపారు. వారితో రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలు తీసుకురావడం ద్వారా తన బలం ప్రదర్శించుకోవాలని జగన్‌రెడ్డి తలపోశారు. ఉప ఎన్నికలు వస్తే గెలుపు జగన్‌దే అని తేలిపోవడంతో సదరు రాజీనామాలు ఆమోదం పొందకుండా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి నాటి స్పీకర్ మనోహర్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో కూడా ఇలాంటి పరిస్థితి పునరావృతం అవుతోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ తరఫున శాసనమండలికి ఎన్నికైన కొందరు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. సదరు రాజీనామాలు ఆమోదం పొందితే వారి స్థానాలు కూటమికి దక్కుతాయి. కూటమికి శాసనసభలో తిరుగులేని మెజారిటీ ఉన్నప్పటికీ శాసనమండలిలో వైసీపీకే మెజారిటీ ఉంది. చైర్మన్‌గా కూడా ఆ పార్టీకే చెందిన మోషేన్ రాజు ఉన్నారు. దీంతో ఆయన సదరు రాజీనామాలను ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారు. చట్టసభల ప్రిసైడింగ్ అధికారులు ఈ విధంగా తమ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. 2019లో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు శాసనమండలిలో తెలుగుదేశం పార్టీకి మెజారిటీ ఉండేది. అప్పుడు బిల్లులు ఆమోదం పొందడంలో జగన్‌రెడ్డి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో శాసనమండలిని రద్దు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఎదురుకావడంతో శాసనమండలిని రద్దు చేయించారు. 1983లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు శాసనమండలిలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఉండేది. దివంగత రోశయ్య వంటి హేమాహేమీలు కాంగ్రెస్‌లో ఉండేవారు. వారిని ఎదుర్కోవడం ఎన్టీఆర్‌కు సమస్యగా మారింది. ఆ దశలో 'పెద్దల గలభా' పేరిట ఈనాడు పత్రిక పెట్టిన ఒక శీర్షిక సభా హక్కులను ఉల్లంఘించేదిగా ఉందని కాంగ్రెస్ పార్టీ హక్కుల తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. 'పెద్దలు' అని పెట్టిన శీర్షిక తమను అవమానించేదిగా ఉందనేది అభియోగం. హక్కుల తీర్మానానికి ఆమోదం లభించడంతో ఈనాడు పత్రికకు అప్పుడు చీఫ్ ఎడిటర్‌గా ఉన్న రామోజీరావు శాసనమండలికి

> 'నా సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను' అని ఒక సభ్యుడు మొత్తుకుంటున్నా సదరు రాజీనామాను ఆమోదించకపోవడం ఏమిటి? అదే రాజకీయంగా అవసరం అయినప్పుడు గంటలు, రోజుల వ్యవధిలోనే ఆమోదించడం ఏమిటి? ఇలాంటి చర్యల వల్ల చట్టసభలపైన, స్పీకర్లపైన ప్రజల్లో గౌరవం సన్నగిల్లదా?

రావాలని మండలి చైర్మన్ తాఖీదు ఇచ్చారు. దీనిపై రామోజీరావు సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. తమ ఆదేశాలపై స్టే ఇచ్చే అధికారం కోర్టుకు లేదని భావించిన శాసనమండలి రామోజీరావును అరెస్టు చేసి తీసుకురావాలని అప్పటి పోలీస్ కమిషనర్ విజయరామారావును ఆదేశించింది. దీనిపై కూడా కోర్టు స్టే ఇచ్చినందున... స్టే ఇచ్చిన న్యాయమూర్తిని కూడా సభకు రప్పించి మందలించాలని శాసనమండలి భావించింది. రాజ్యాంగపరంగా ఇదొక చిక్కుముడిగా మారింది. అటు కోర్టు ఆదేశాలను పాటించాలా? ఇటు శాసనమండలి ఆదేశాలను పాటించాలా? అన్న సందిగ్ధంలో పోలీసు కమిషనర్ విజయరామారావు చిక్కుకున్నారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన ఎన్టీఆర్ శాసనమండలి రద్దుకు శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. తెలుగునాట శాసనమండలి రద్దు వెనుక జరిగిన కథ ఇది. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు శాసనమండలిని పునరుద్ధరించింది. చట్టసభలు–న్యాయ వ్యవస్థలలో ఎవరిది పైచేయి? అన్న వివాదం ఏర్పడినప్పుడు ఇలాంటి రాజ్యాంగపరమైన సంక్షోభాలు తలెత్తుతాయి. ఆయా వ్యవస్థలు తమ పరిధికి లోబడి చట్టాలు అపహాస్యం కాకుండా నిర్ణయాలు తీసుకుంటే ఇలాంటి వివాదాలు తలెత్తవు. గతంలో చట్టసభల స్పీకర్లు, చైర్మన్లుగా ఎన్నికైనవారు అప్పటివరకు తాము

> **సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా శాసనసభ స్పీకర్ మూడు నెలల్లోగా అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకుంటారా? ఒకవేళ తీసుకుంటే ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు? అనర్హత వేటు వేయని పక్షంలో పరిస్థితి ఏమిటి? సుప్రీంకోర్టు కంటే పార్లమెంటే సుప్రీం అని ఇటీవలే ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ మాటలను స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఉటంకించడం గమనార్హం. రాష్ట్రాలు ఆమోదించిన బిల్లుల విషయంలో రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలను ప్రస్తావిస్తూ జగదీప్ ఆ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి విషయంలో గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు లేని పక్షంలో స్పీకర్‌కు కూడా గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉండదన్నది స్పీకర్ ప్రసాద్‌కుమార్ అభిప్రాయం కావొచ్చు. దీంతో అధికార పరిధి విషయంలో మళ్లీ పేచీ తలెత్తుతుంది. ఒకటి మాత్రం నిజం. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని అన్ని పార్టీలూ అపహాస్యం చేస్తున్నాయి. 2018 తర్వాత కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ భారత రాష్ట్ర సమితిలో విలీనమయిందని ప్రకటించారు. ఆ తర్వాత కూడా భట్టి విక్రమార్క నాయకత్వంలో పది మంది వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగారు. వారిని కాంగ్రెస్ సభ్యులుగానే పరిగణించారు. అయినా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ బీఆర్‌ఎస్‌లో విలీనమయిందని ప్రకటించుకున్నారు. ఇంతకంటే హాస్యాస్పదం మరొకటి ఉంటుందా? ఈ నేపథ్యంలో ఫిరాయింపులను తప్పుపట్టే నైతికత బీఆర్‌ఎస్‌కు లేదని చెప్పవచ్చు.**

ప్రాతినిధ్యం వహించిన రాజకీయ పార్టీకి రాజీనామా చేసేవారు. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికైనప్పుడు భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేశారు. చట్టంలో లేకపోయినా ఇలాంటి ఉన్నత సంప్రదాయాలను పాటించినవారు ఎందరో ఉన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదు. చట్టసభల అధిపతులు పార్టీ సభ్యుల్లా వ్యవహరిస్తున్నారు.

రాజకీయ వ్యూహాలు...

ఇప్పుడు మళ్లీ పార్టీ ఫిరాయింపుల విషయానికి వద్దాం. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా ఉందని, ఈ పరిస్థితుల్లో ఉప ఎన్నికలు వస్తే గెలుపు తమదే అన్న ధీమాతో ఉన్న భారత రాష్ట్ర సమితి సుప్రీం కోర్టును ఆశ్రయించింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సహజంగానే ఉప ఎన్నికలు రావడం ఇష్టం ఉండదు. ఈ కారణంగానే ప్రస్తుత వివాదం. పార్టీ ఫిరాయిస్తే అనర్హత వేటు పడుతుందన్న భయం లేకపోతే భారత రాష్ట్ర సమితికి చెందిన మరో పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టేవారు. ఈ నేపథ్యంలో ఎన్నికైన సభ్యులు చేజారిపోకుండా కాపాడుకోవడంతో పాటు, పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉందని పార్టీ శ్రేణులలో భరోసా కల్పించేందుకు బీఆర్‌ఎస్ ఉప ఎన్నికలు కోరుకుంటోంది. ఈ కారణంగానే మూడు నెలల తర్వాత ఉప ఎన్నికలు రావడం ఖాయమని ఆ పార్టీ ప్రచారం చేసుకుంటోంది. రెండు మూడు నెలల క్రితం బీఆర్‌ఎస్ విజయావకాశాలు మెరుగుపడిన విషయం వాస్తవం. అయితే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవలి కాలంలో తీసుకున్న నిర్ణయాల వల్ల క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పరిస్థితి మెరుగుపడింది. రైతుబంధు నిధులు విడుదల చేయడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు రేషన్ కార్డుపై సన్న బియ్యం సరఫరా చేయడం వంటి నిర్ణయాలు కాంగ్రెస్ పట్ల ప్రజల ధోరణి మారడానికి దోహదపడ్డాయి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడి ఉప ఎన్నికలు వస్తాయో రావో అప్పుడే చెప్పలేంగానీ మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి మాత్రం త్వరలో ఉప ఎన్నిక జరుగుతుంది. ఈ ఎన్నిక ఫలితంతో తెలంగాణ రాజకీయాలపై కొంత స్పష్టత వస్తుంది. ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడం ద్వారా హైదరాబాద్ మహానగరంపై తమ పట్టు సడలలేదని నిరూపించుకోవడానికి భారత రాష్ట్ర సమితి ప్రయత్నాలు మొదలెట్టగా... బీఆర్‌ఎస్ స్థానాన్ని హస్తగతం చేసుకోవడం ద్వారా నగరంలో కూడా తమ బలం పెరిగిందని రుజువు చేసుకోవడానికి కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డనుంది. సాధారణ ఎన్నికలకు మరో మూడేళ్లకు పైగా వ్యవధి ఉన్నప్పటికీ తెలంగాణ రాజకీయాలు ఇప్పటికే వేడెక్కాయి. జన నేతగా ప్రచారం చేయించుకుంటున్న కేటీఆర్ బీఆర్‌ఎస్‌లో అంతా తానై వ్యవహరిస్తున్నారు. ఆయనకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య ఉప్పు–నిప్పు అన్నట్టుగా ఉంది. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడానికి కూడా కేటీఆర్ నిరాకరిస్తున్నట్టుగా ఉంది. హౌలాగాడు, లొట్టపీసుగాడు అని కేటీఆర్ ముఖ్యమంత్రిని సంబోధిస్తున్నారు. ఒక నికృష్టుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడు అంటూ తనలోని అక్కసును వెళ్లగక్కుతున్నారు. ఈ ఇరువురి మధ్య ఉండాల్సిన రాజకీయ వైరం వ్యక్తిగత వైరంగా మారుతోంది. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీలో తిరుగుబాటు రాబోతోంది అన్నట్టుగా తన చేతిలోని మీడియా ద్వారా కేటీఆర్ ప్రచారం చేయిస్తున్నారు. రేవంత్‌రెడ్డి స్థానంలో కాంగ్రెస్ పార్టీ తరఫున మరొకరు ముఖ్యమంత్రి అయితే కేటీఆర్ శాంతించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు– జగన్ మధ్య నెలకొన్న పరిస్థితి తెలంగాణలో రేవంత్‌రెడ్డి– కేటీఆర్ మధ్య నెలకొంది. తమ అంచనాలకు భిన్నంగా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని కేసీఆర్ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. ఈ కారణంగానే పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హత వేటు పడి ఉప ఎన్నికలు రావాలని ఆ కుటుంబం బలంగా కోరుకుంటోంది. ఉప ఎన్నికల్లో విజయం సాధిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలిపోయే అవకాశం ఉందని బీఆర్‌ఎస్ నాయకులు అంచనా వేస్తున్నారు. ఏ కారణం వల్లనైనా రేవంత్‌రెడ్డి నాయకత్వం మారితే ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్టుగా ఉంటుంది. ఇలాంటి అంచనాలతోనే ఉప ఎన్నికలకోసం భారత రాష్ట్ర సమితి ఉబలాటపడుతోంది. అయితే సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా శాసనసభ స్పీకర్ మూడు నెలల్లోగా అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకుంటారా? ఒకవేళ తీసుకుంటే ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు? అనర్హత వేటు వేయని పక్షంలో పరిస్థితి ఏమిటి? వంటి శేష ప్రశ్నలు మిగిలే ఉన్నాయి. సుప్రీంకోర్టు కంటే పార్లమెంటే సుప్రీం అని ఇటీవలే ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ మాటలను స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఉటంకించడం గమనార్హం. రాష్ట్రాలు ఆమోదించిన బిల్లుల విషయంలో రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలను ప్రస్తావిస్తూ జగదీప్ ఆ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి విషయంలో గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు లేని పక్షంలో స్పీకర్‌కు కూడా గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉండదన్నది స్పీకర్ ప్రసాద్‌కుమార్ అభిప్రాయం కావొచ్చు. దీంతో అధికార పరిధి విషయంలో మళ్లీ పేచీ తలెత్తుతుంది. ఒకటి మాత్రం నిజం. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని అన్ని పార్టీలూ అపహాస్యం చేస్తున్నాయి. 2018 తర్వాత కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ భారత రాష్ట్ర సమితిలో విలీనమయిందని ప్రకటించారు. ఆ తర్వాత కూడా భట్టి విక్రమార్క నాయకత్వంలో పది మంది వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగారు. వారిని కాంగ్రెస్ సభ్యులుగానే పరిగణించారు. అయినా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ బీఆర్‌ఎస్‌లో విలీనమయిందని ప్రకటించుకున్నారు. ఇంతకంటే హాస్యాస్పదం మరొకటి ఉంటుందా? ఈ నేపథ్యంలో ఫిరాయింపులను తప్పుపట్టే నైతికత బీఆర్‌ఎస్‌కు లేదని చెప్పవచ్చు. రాజకీయ పార్టీలు నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చినప్పుడు రాజ్యాంగపరమైన మౌలిక ప్రశ్నలు తలెత్తుతాయి. ఫిరాయింపులు, రాజీనామాల విషయంలో స్పీకర్లు ఏళ్ల తరబడి నిర్ణయాలు తీసుకోకుండా కాలయాపన చేస్తే న్యాయస్థానాలు జోక్యం చేసుకోకూడదా? అన్న ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పాలి? ఒక పార్టీ తరఫున ఎన్నికైన వ్యక్తి మరొక పార్టీలోకి మారడం అనైతికం అవుతుంది. అన్ని రాజకీయ పార్టీలూ ఈ అనైతిక చర్యలను ప్రోత్సహిస్తున్నాయి.



పరిష్కారం ఏది?

సుప్రీంకోర్టు తాజా తీర్పుతో చిక్కు ముడులు అన్నీ విడిపోతాయని చెప్పలేం. మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని నాకు గడువు ఎలా విధిస్తారు? అని స్పీకర్ ఎదురు తిరగవచ్చు. లేదా అలా ఆదేశించడం సమంజసం కాదని మళ్లీ సుప్రీంకోర్టునే ఆశ్రయించవచ్చు. అదే జరిగితే వివాదం కొనసాగుతూనే ఉంటుంది. ఒకవేళ స్పీకర్ సదరు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తే వారు కోర్టులను ఆశ్రయించవచ్చు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్య తీసుకోని పక్షంలో బీఆర్‌ఎస్ కూడా మళ్లీ అన్యాయం జరిగిందని తిరిగి సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు. ఇలాంటి సందేహాలు ఎన్నో ఉన్నాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ ఇచ్చిన తాజా తీర్పులో చేసిన సూచనలను అమలు చేయడమే ఈ చిక్కుముడులకు ఏకైక పరిష్కారం. ముందుగా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా సవరించాలి. ఫిరాయింపులకు పాల్పడే వారికి దొడ్డిదారులు లభించకుండా చట్టాలను సవరించాలి. ప్రస్తుత చట్టంలో ఉన్న లొసుగులను సవరించాలి. ఈ చట్టం అమలులోకి వచ్చాక అది ఎంతగా దుర్వినియోగం అయిందో అందరికీ తెలిసిందే. అందుచేత లోపాలను గుర్తించి సరిచేయడం పెద్ద సమస్య కాదు. కాకపోతే రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి ఉండాలి. ఇక స్పీకర్లు రాజ్యాంగం తమకు కల్పించిన వెసులుబాట్లు, విచక్షణాధికారాలను దుర్వినియోగం చేయకుండా ఉండాలంటే సుప్రీంకోర్టు సూచించిన విధంగా నిర్ణయాలు తీసుకోవడంలో స్పీకర్లకు పార్లమెంటు ద్వారానే గడువు విధించాలి. ఈ సూచన చేయడం ద్వారా స్పీకర్లకు తాము గడువు విధించలేమని సుప్రీంకోర్టు పరోక్షంగా అంగీకరించినట్టు అయింది. 'నా సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను' అని ఒక సభ్యుడు మొత్తుకుంటున్నా సదరు రాజీనామాను ఆమోదించకపోవడం ఏమిటి? అదే రాజకీయంగా అవసరం అయినప్పుడు గంటలు, రోజుల వ్యవధిలోనే ఆమోదించడం ఏమిటి? ఇలాంటి చర్యల వల్ల చట్టసభలపైన, స్పీకర్లపైన ప్రజల్లో గౌరవం సన్నగిల్లదా? గౌరవ సభ అని పిలుచుకొనే సభలు తమ గౌరవాన్ని నిలుపుకొనే విధంగా వ్యవహరించాలి కదా? కార్యనిర్వాహక వ్యవస్థపై ప్రజలు ఇప్పటికే విశ్వాసం కోల్పోయారు. న్యాయ వ్యవస్థ, చట్టసభలపై కూడా నమ్మకం సన్నగిల్లుతున్నప్పటికీ వాటికి రాజ్యాంగం కల్పించిన రక్షణల వల్ల ప్రజలు బహిరంగంగా విమర్శలు చేయలేని పరిస్థితి. చట్టాలు చేస్తున్న చట్టసభలే సదరు చట్టాలను సక్రమంగా అమలు చేయకపోవడాన్ని ఏమనాలి? ఫిరాయింపుల బెడదకు శాశ్వత పరిష్కారం లభించని పక్షంలో ప్రభుత్వాలు కూడా సుస్థిరంగా ఉండలేవు. సభ్యుల ఒత్తిళ్లకు ప్రభుత్వాలు లొంగిపోవాల్సిన పరిస్థితి ఇప్పుడుంది. ఈ నేపథ్యంలో అధికార పరిధుల గురించి కాకుండా రాజకీయ పార్టీలన్నీ ఆత్మపరిశీలన చేసుకోవాలి!


సహస్ర వృత్తుల సమస్త చిత్రం

తలచుకోగానే ఎవరైనా కళ్లబడితే వారికి 'నిండు నూరేళ్లు' అంటాం. అట్లా కాపు రాజయ్యకి నిండు ఆయుర్దాయం నేటికి నిండినదేమీ కాదు, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనే వారి యాది సంపూర్ణం. శతాయువు మాత్రమే కాదు, వారు అనునిత్యం చిరంజీవి. అయితే ఇక ముందు వారి మరో అంకం సాగనుంది. అదే ఈ వ్యాసం సారాంశం.

ఎవరైతే తమ గడుల్లో బలవంతంగా బతుకమ్మ ఆడించారో వారే బతుకమ్మ ఆడే స్థితి తెలంగాణ ఉద్యమం తేనే తెచ్చింది. వాళ్ల మెడలు వంచి బతుకమ్మను, బోనాలను నెత్తిమీద పెట్టుకునేలా చేయనే చేసింది. అంతేకాదు, సకల జనుల సమిష్టి చేతనలోకి మన సాంస్కృతిక ఆనవాళ్లు బలీయమై, ఉద్యమ సోయిలోకి వచ్చేసరికి మళ్లీ సజీవ స్మృతిలోకి వచ్చి చేరిన రెండే రెండు బొమ్మలు, రాజయ్య గీసినవే. ఒకటి– సద్దుల బతుకమ్మ, రెండు– బోనాలు, ఈ రెండు బొమ్మలు రాష్ట్ర పండుగలుగా అయ్యేనాటికి ఎంతో ముందు, అనేక దశాబ్దాల క్రితమే వారు ఆ ఉత్సవాలను అపురూపంగా పదిలపరిచారు. చిత్రమేమిటంటే, 'ఫక్తు రాజకీయాల దశ' పోయి 'ప్రజా పాలన' అని మూడో దఫా ప్రభుత్వం వచ్చేనాటికి తెలంగాణ తల్లి చేతుల్లో బతుకమ్మ మాయం అయి ఉండొచ్చు గాక. కానీ, ఆయన చేసిన పని అంతకుముందే పరిసమాప్తి అయింది. అవును, వారు చిత్రించి పెట్టిన ఆ రెండు బొమ్మలు చేయవలసిన పని చేశాయి. ఇప్పుడు మిగితావి కూడా బయలుపడతాయి. అదే శత జయంతి ఆన.

నేటి (ఆగస్టు 3) సాయంత్రం హైదరాబాద్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కాపు రాజయ్య శత జయంతి ఉత్సవ సందర్భంగా కళా ప్రదర్శన ప్రారంభం. ఆగస్టు పది వరకూ ఉంటుంది. ఈ ప్రదర్శనలో బహుశా అనేక చిత్రాలు నూతన అంకురానికి ప్రేరేపణ ఇస్తాయనే నమ్ముతాను నేను.

అవును, రాజయ్య సబ్బండ వర్ణాల చిత్రకారులు. వారు పండుగలు, పబ్బాలను మాత్రమే చిత్రించలేదు. నేడు బీసీ కుల గణన ద్వారా మొదటిసారిగా దేశవ్యాప్తంగా మెజారిటీ ప్రజ గణన జరిగే తరుణం ఆసన్నమయ్యే సరికి వారు అసలైన ఉత్సవ రథాన్ని మన ముందుకు చేర్చనే చేర్చారు. ఆయన తీరొక్క కులాన్ని, వారి వ్యావృత్తులతో కూడి, కడు సుందరంగా ఎప్పుడో చిత్రించి ఉన్నారు. ఇకముందు వారి అన్ని చిత్రాలూ ఊరేగక మానవు. వెలికి తీయవలసిన సందర్భం ఇది.



ఒక్క మాటలో భారతదేశ చిత్రకళా మండలంలోకి ఒకనాడు పరిపుష్టంగా తులతూగిన తెలంగాణ గ్రామాన్ని, అందలి మెజారిటీ కుల సముదాయాలను కాపు రాజయ్య ప్రతిక్షేపించి చూపినంత ఘనంగా మరొకరు చేయలేదు. వారు సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలను ఉపరితల మానకంగా వేయలేదు. ఆయా వృత్తిదారులను వారి పనిపాటలే రక్తమాంసాలతో తమవైన అచ్చట్లు ముచ్చట్లతో తమవైన అలంకారాలతో ఒక కోలాటంగా చిత్రించి పెట్టారు. నేడు వాటిని చూడటం అంటే వాంఛితంగా నైరూప్యం చేసిన మెజారిటీ ప్రజల గ్రామీణ జీవన ఉత్సవాన్ని తిరిగి వాస్తవికంగా దర్శించడమే. అదే ఇప్పటి కవి సమయం లేదా చిత్రకళా పునరుజ్జీవన సందర్భం.


అనేకులకు వారి బతుకమ్మ, బోనాలతో పాటు రాజయ్య గీసిన రాధాకృష్ణుల చిత్రం తెలుసు. చాలామందికి తాటి చెట్టు ఎక్కుతున్న గౌడ్ తాలూకు 'రిస్కీ లైఫ్' తెలుసు. కానీ, వారి కాన్వాసు పెద్దది. అందులో కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, బెస్త, స్వర్ణకారి, మేదరి, పద్మశాలీ, వడ్డెరలు, నకాషీలే కాదు, యాదవులు, దూదేకులు, రజకులు ఎందరో ఉన్నారు. పరమాత్మ, జీవాత్మలతో సహా ఇంకా ఎన్నో చిత్రించారు. నిజానికి వారు సహస్ర వృత్తుల సమస్త చిహ్నాంగా చూపింది 'కళ'ను. అవును. కళే ఒక్కో కులానికి ఉన్న బహుజన ప్రజల అసలైన విద్యా ఉద్యోగ ఔపాధిక సంస్కృతి అని, అదే స్వరాజ్యం అని ఆయన చిత్రించారు. అదే రాజయ్య రాజరికం.

నిజానికి బహుజన సమాజాన్ని, ఒక్కో సముదాయంగా తరతరాలుగా వారు చేపట్టి అభివృద్ధి చేసిన పనులను 'వృత్తులు' అనే చాలా మంది భావించారు. వాటిని 'హస్తకళలు' అనే మాట్లాడారు. కానీ రాజయ్య తన లలిత కళలో ఒక్కో కులాన్ని గొప్ప జీవకళగా అభివ్యక్తం చేసి చూపారు. ఒకరి చేతుల్లో ఒకరు చేయుంచి ఊరు ఉమ్మడిగా సకల కులాల సమ్మేళనంగా, తీరొక్క మనుషుల సమిష్టి జీవన గ్రామంగా ఆయన దేనికదే ఒక బొమ్మగా చిత్రించి పెట్టారు. అదే వారి 'కళా భవనం'. మరో మాటలో ఆయన గ్రామాన్ని తన జానపద చిత్తమూ చిత్రంతో పల్లకీ ఎక్కేలా చేశారు. ఆ బోయలే అందులో ఊరేగేలా చిత్రించారు. ధ్వంసం కాకముందరి గ్రామాన్ని, మనం కోల్పోయిన గ్రామ పునాదిని, అందలి నాగరికతలను వారు చూపినంత విశిష్టంగా ఇంతటి వైవిధ్యంతో దేశంలోనే మరే చిత్రకారుడూ చిత్రించలేదు. అందువల్లే రాజయ్య శత జయంతి ఉత్సవం ఒక్క తెలంగాణకు, తెలుగు రాష్ట్రాలకు పరిమితం కారాదు, దేశంలోని బహుళ ప్రజానీకపు బతుకులకు ఈ వేడుక పునరుజ్జీవన కానుక. ఒక ఎరుక. గణన.

అందుకే సరికొత్తగా అనడం, వారి కళ సహస్ర వృత్తుల సమస్త చిహ్నం అని. అది ఒకనాడు కేవలం బతుకమ్మ బొమ్మగానే కానవచ్చింది. కానీ నేడు వారి శత జయంతి సమయానికి, ఒక్కో కులానికి చెందిన వారి బొమ్మలన్నీ తీరొక్క పూల వంటి ఒక సాంస్కృతిక సమ్మేళనంగా, ఒక గణనీయమైన వైవిధ్యంగా మన ముందుకు వచ్చాయని. అదే దేనికదే నిజమైన 'బతుకమ్మ'. విభిన్న పండుగగా చూడాలి. ఇక వారి ఒక్కో బొమ్మను లెక్కించి చూడాలి. అదే వారికి మనమిచ్చే ఘనమైన నీరాజనం.

■ కందుకూరి రమేష్‌బాబు
స్వతంత్ర పాత్రికేయుడు, ఛాయాచిత్రకారుడు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
హనుమకొండ
HANUMAKONDA
ఆదివారం 3 ఆగస్టు 2025



డీఆర్‌ఓగా బి.రాజాగౌడ్

రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారిగా బి.రాజాగౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషినల్ కలెక్టర్స్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్స్, డిప్యూటీ కలెక్టర్స్ బదిలీలలో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.రాజాగౌడ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ డీఆర్‌ఓగా పనిచేస్తున్న వై.వి గణేశ్‌కు ఇంకా ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు.



గుండె నిండా.. ఉండు ఫ్రెండు!

- పరస్పరం మంచి కోరుకునే వారే అసలైన స్నేహితులు
- కష్టాల్లో గుర్తుకు వచ్చే మొదటి వ్యక్తి స్నేహితుడే..
- దోస్తానపై సోషల్ మీడియా తీవ్ర ప్రభావం
- సాంకేతికత పెరిగిన తరువాత తగ్గుతున్న స్నేహబంధాలు
- చాటింగ్స్, స్టేటస్‌లతో స్నేహానికి డిజిటల్ సంకెళ్లు
- సహాయం చేస్తే గుర్తిండిపోతారు.. లేదంటే మర్చిపోతారు..
- కొందరి బంధం మాత్రం.. అవసరాలకు అతీతం..
- నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం
- మారుతున్న స్నేహం తీరుపై ఉమ్మడి జిల్లాలో ఆంధ్రజ్యోతి సర్వే

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ప్రతీ ఏటా ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ ఏడాది కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఫ్రెండ్‌షిప్‌డే నిర్వహించుకునేందుకు అన్నివర్గాల ప్రజలు, ముఖ్యంగా యువతరం ఏర్పాట్లు చేసుకుంటోంది. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆంధ్రజ్యోతి నిర్వహించిన సర్వేలో పలువురి యువతీ యువకుల తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

"స్నేహమంటే.. బుడి బుడి అడుగుల బాల్యంలో పరిచయమైన మరొక బంధం..
బడిలో బలపం పంచుకున్నప్పుడు ఏర్పడిన సంబంధం..
అక్షరాలు నేర్చుకునేటప్పుడు ఆసరాగా నిలిచిన అనుబంధం
ఆటలు ఆడుతున్నప్పుడు అల్లుకున్న ఆత్మీయ బంధం
కష్టసుఖాల్లో నేనున్నాంటూ భరోసాగా నిలిచే స్నేహబంధం"

స్నేహితుడంటే..

ఒకప్పుడు స్నేహం అంటే సంతోషాలను, బాధలను పంచుకునే బంధం. ఒకరికి కష్టం వస్తే.. మరొకరు తనకే వచ్చినట్లుగా భావించే కాలం. స్కూల్ డేస్‌లో లంచ్ బాక్స్ పంచుకుని తినడం, ప్రశ్నలకు సమాధానం చెప్పలేక టీచర్ ఎదుట కలిసి నిలబడటం.. ఇలా స్నేహం ఇద్దరినీ ఒకటిగా నిలిపేది. కానీ, ఈరోజుల్లో ఒకరినొకరు బెస్ట్‌ఫ్రెండ్‌గా పిలుచుకుంటున్నప్పటికీ వారిద్దరి మధ్య బంధం డిజిటల్ డివైజ్‌లకు పరిమితం అవుతోంది. చాట్స్, స్టేటస్ లైక్స్ ఫొటో ట్యాగ్స్. ఇవే స్నేహానికి ప్రమాణాలుగా మారాయి.

కొందరి విషయాల్లో ముఖానికి చిరునవ్వుతో సెల్ఫీ తీయటం ఒకవైపు.. మనసులో అసూయ, నకిలీ మాటలు మరో వైపు.. ఇతరుల బాధలకు చలించాల్సిన మనసులు ఇప్పుడు 'అది నాకేందుకులే..' అనే దూరపు ప్రశ్నను వేసే స్థాయికి ఆలోచనలు వెళుతున్నాయి. ఇంకొందరి విషయాల్లో అవసరం ఉన్నప్పుడు మాత్రమే స్నేహితుడి నెంబరు డయల్ అవుతుంది. మన తప్పులను దాచుకోవడానికో.. ఒంటరితనం తీర్చుకోవడానికో.. వాడే వ్యవస్థలా మారుతుంది ఈ స్నేహ బంధం. అయితే వ్యవస్థలో స్నేహం మొత్తం స్వార్థమే అనలేం. ఇంకా కొందరు మిగిలే ఉన్నారు. స్వార్థం లేకుండా, మాట ఇచ్చినట్లే నిలబడి.. కష్ట సమయంలో పక్కన నిలిచేవారు. నిజమైన స్నేహం ఇంకా ఉందని, అది అంతమయ్యేది కాదని చాటేవారు. కానీ, అలాంటి వారు చాలా అరుదే. నిజమైన స్నేహితుడిగా ఎలా ఉండాలో మనల్ని మనమే అడిగే రోజు కావాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అవసరాలకు మాత్రమే గుర్తొచ్చే స్నేహాలు.. అవసరం ముగిసిన వెంటనే మరిచిపోయే బంధాలు నిజమైన స్నేహాలు కావనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఫ్రెండ్‌షిప్ ఎడే ఒక తాత్కాలిక సంబరం కాకుండా.. మన జీవితాల్లో ఒక అర్థవంతమైన ప్రయాణంగా మారాలని ఆంధ్రజ్యోతి సర్వేలో పలువురు తేల్చిచెప్పారు.

స్నేహితుడే భరోసా..

స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆరు ప్రశ్నలు అడుగగా, ఒక్కొక్క ప్రశ్నకు మూడు ఆప్షన్ ఇచ్చాం. ఇందులో ప్రధానంగా మీరు కష్టాల్లో ఉన్నప్పుడు ముందుగా గుర్తుకు వచ్చే వ్యక్తి ఎవరని అడిగిన ప్రశ్నకు 56.5శాతం మంది స్నేహితుడే అపద్బాంధవుడని తేల్చి చెప్పారు. కష్టాల్లో తోడు ఉండే వ్యక్తి మిత్రుడేనని పేర్కొన్నారు. ఆ తరువాత కుటుంబసభ్యులుగా 38శాతం మంది పేర్కొనగా, ఈ ఇద్దరు కాదు మరొకరు ఉన్నారంటూ 32.5 శాతం మంది పేర్కొనటం గమనార్హం. అలాగే మీ స్నేహితులలో

(మిగతా 7లో...)

సర్వే ఇలా : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన సర్వేలో స్నేహంపై భిన్నవర్గాల వారు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. వారి మాటలు మారుతున్న కాలానికి ప్రతిబింబంగా కనిపించాయి. ఒక్కొక్కరిని 6 ప్రశ్నలు అడగగా, వారు నిర్మొహమాటంగా స్పందించారు. ఏ ప్రశ్నకు ఎలా జవాబులు ఇచ్చారో శాతాల వారీగా ఇలా వున్నాయి...

మీ జీవితంలో నిజమైన స్నేహితుడిని కలిశారా..?	
ఏ). అవును	(56.5శాతం)
బీ). లేదు	(18శాతం)
సీ). చెప్పలేం	(25.5శాతం)

మీ స్నేహితుల్లో కొందరు అవసరానికి మాత్రమే గుర్తు చేసుకుంటారని అనిపించిందా..?	
ఏ). చాలాసార్లు	(51శాతం)
బీ). కొన్ని సార్లు	(33.5శాతం)
సీ). ఆ ఆలోచనే రాలేదు	(15.5శాతం)

మీకు అవసరం లేకపోయినా, రెగ్యులర్‌గా మాట్లాడే స్నేహితులు ఎంతమంది..?	
ఏ). ఎవరూ లేరు	(18శాతం)
బీ). ఒకరిద్దరు	(42.5శాతం)
సీ). ముగ్గురికి పైగా	(25.5శాతం)

మీరు కష్టాల్లో ఉన్నప్పుడు ముందుగా గుర్తుకు వచ్చే వ్యక్తి ఎవరు..?	
ఏ). స్నేహితుడు	(56.5శాతం)
బీ). కుటుంబ సభ్యుడు	(38శాతం)
సీ). ఇద్దరు కాదు	(32.5శాతం)

మీరు స్నేహితులతో ఎక్కువగా ఎలా మాట్లాడతారు..?	
ఏ). ఫోన్ కాల్	(41.5శాతం)
బీ). మెసేజ్ / చాట్	(23శాతం)
సీ). ప్రత్యక్షంగా కలవడం	(35.5శాతం)

సోషల్ మీడియా వల్ల మీరు నిజమైన స్నేహితులను పొందారా లేక కోల్పోయారా?	
ఏ). పొందాను	(40శాతం)
బీ). కోల్పోయాను	(31.5శాతం)
సీ). రెండు జరిగాయి	(25.5శాతం)



స్నేహం అనేది గొప్ప బహుమతి

ప్రొఫెసర్ పృథ్వీ, నిట్ వరంగల్

నిజ జీవితంలో ధనిక, పేద అనే తేడా లేకుండా కష్టసుఖాల్లో, మంచి, చెడు విషయాల్లో ధైర్యం చెబుతూ.. తోడుండేవారే స్నేహితులు. దుఖంలో ఉన్నప్పుడు మన భుజం తట్టి.. నేనున్నాను అని భరోసా కలిగించి, ప్రతిరోజు పలకరిస్తూ, మనల్ని నవ్వించేవారే నిజమైన స్నేహితులు. మంచి స్నేహాలను ఎప్పుడు దూరం చేసుకోవద్దు. చెడుస్నేహాలను ఎప్పుడు దగ్గరికి తీసుకోవద్దు.



నా స్నేహితురాలికి అస్పత్రిలో సేవలు చేశా..

కొమ్ముల సహారా, విద్యార్థిని, జనగామ

స్నేహం అంటే స్వార్థం లేని ఒక అద్భుతమైనబంధం. కష్టాల్లో, సంతోషాల్లో మనతో ఉండేదే స్నేహం. కుటుంబ సభ్యులు తోడుగా లేని సమయంలో ఆలోటు తీర్చేది స్నేహితులే. నా స్నేహితురాలు అనారోగ్యంతో అస్పత్రిలో చేరితే తాను కోలుకునే వరకు దగ్గరుండి సేవలు అందించాను. తనకి ఎవరూ అందుబాటులో లేకపోవటంతో నేనే అన్ని పనులు చేస్తూ.. తాను కోలుకునే వరకు ఉంటే ఉన్నాను. నా స్నేహితురాలికి సేవ చేయటం నా అదృష్టంగా భావిస్తా.



అన్ని బంధాలోకెల్లా స్నేహబంధం గొప్పది

అంబటి అరుణ్‌కుమార్, మహబూబాబాద్


అన్ని బందాల్లోకెల్లా స్నేహ బంధం గొప్పది. చిన్నతనంలో పాఠశాలలో చేరిన సమయంలో కలిసిన స్నేహాలు చిరకాలం కొనసాగుతాయి. తోటి స్నేహితుడికి ఏ ఆపద వచ్చినా క్షణాల్లో అక్కడికి చేరడమే నిజమైన స్నేహం. జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలు, బాధలను నివృత్తి చేసుకునే ఏకైక వ్యక్తి స్నేహితుడు. భవిష్యత్తుకోసం తీసుకునే నిర్ణయాలను కూడా కుటుంబసభ్యులతో కంటే స్నేహితుడికి చెప్పి నిర్ణయం తీసుకుంటాం. జీవితంలో అతిగొప్ప వ్యక్తి స్నేహితుడే.



విద్యార్థి జీవితానికి స్నేహితులే కీలకం

గుర్రం శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, హనుమకొండ

విద్యార్థుల జీవితానికి స్నేహితులు వెన్నుముక లాంటివారు. స్నేహితులు పక్కనుంటే బాల్యంలో ఒత్తిడి తేలిక అవుతుంది. విజయం చేరవవుతుంది. మంచి మిత్రుడు ఇంకో మిత్రుడి జీవితాన్ని మార్చగలరు. ఉరుకుల, పరుగుల జీవితంలో స్నేహితులను కలుసుకునే సమయం దొరకటం లేదు. వాట్సాప్ గ్రూపుల్లో పలకరింపులే మిగులుతున్నాయి. ఎన్ని బంధాలు ఉన్నప్పటికీ స్నేహబంధాన్ని మించినవి కావు. కష్టసుఖాల్లో తోడుగా నిలిచినవారే నిజమైన స్నేహితులు.



ఐటీ చెల్లించే వారి 'రేషన్' కట్?

- అనర్హుల ఏరివేతకు కేంద్రం ఆదేశాలు
- పీఎంజీకేఏవై లబ్ధిదారుల్లో గుబులు



వర్ధన్నపేట ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల జాబితా నుంచి అనర్హుల ఏరివేతకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. పాత, కొత్త రేషన్‌కార్డులకు ఇది ఇబ్బందిగా మారింది. ఆదాయపు పన్ను చెల్లిస్తూ రేషన్ పొందుతుంటే రేషన్ కార్డు తొలగించడం ఖాయమని తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన మార్గదర్శకాలే అందుకు నిదర్శనం. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకం కింద లబ్ధిపొందుతున్న వారిలో అనర్హులను తొలగించడానికి కేంద్రం కసరత్తు ప్రారంభించింది. ఆదాయ పన్ను శాఖ కేంద్ర ఆహార శాఖకు సహకారం అందించనుండగా లబ్ధిదారుల వ్యవహారం మంత్రిత్వశాఖలోని ఫుడ్ అండ్ డిస్ట్రిబ్యుషన్ (డీఎఫ్‌పీడీ) విభాగానికి ఆదాయం పన్ను శాఖ సమకూర్చనున్నట్లు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలే స్పష్టం చేస్తున్నాయి. ఈ క్రమంలో లబ్ధిదారుల ఆధార్ నంబర్ లేదా పాన్ వివరాలను ఆదాయ పన్ను శాఖకు డీఎఫ్‌పీడీ ఇవ్వనుండగా దీని ఆధారంగా లబ్ధిదారుని ఆర్థిక స్థితిగతులను ఆదాయపన్ను శాఖ నిర్ధారించి తిరిగి వివరాలను ఆహార శాఖకు అందించనుందని అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం రుణం లేకుండా ఏ పనులు ముందుకు సాగడంలేదు. పేద నుంచి మధ్య తరగతి వరకు రుణాలతో జీవనం సాగిస్తున్నారు. సదరు కుటుంబాలు ఇంటి నిర్మాణ రుణం తీసుకున్నా, ఇతర అవసరాల కోసం బ్యాంక్‌లు, ప్రవేట్ సంస్థల ద్వారా రుణం పొందాలన్నా ఆదాయపు పన్ను చెల్లించే వారికే రుణాలు అందిస్తున్నారు. వరసగా మూడేళ్ల ఆదాయపు పన్ను వివరాలు పరిశీలించాకే రుణం మంజూరు చేస్తున్నాయి. ప్రతీ పనికి ఆధార్‌కార్డు ఇవ్వాల్సిందే. దానికి అనుసంధానంగా పాన్‌కార్డు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సదరు నిబంధనల పరిధిలోకి వేల కుటుంబాలు వచ్చే ఆవకాశం ఉంది. దీంతో తెల్లరేషన్ కార్డు నుంచి ఆదాయపు పన్ను చెల్లిస్తూ గృహ, వాహన ఇతర అవసరాల కోసం రుణాలు తీసుకున్న కుటుంబాలు వేలల్లో ఉన్నాయి. వారందరికీ ఈ నిబంధన పూర్తిస్థాయిలో అమలయితే మాత్రం తెల్ల రేషన్ కార్డులు కోల్పోతారు. దీంతో ఉచిత రేషన్ కార్డు రద్దవడంతోపాటు ఆరోగ్యశ్రీ ఇతర సంక్షేమ పథకాలకు దూరమవుతారు. కేంద్ర ఆదేశాలపై తెల్ల రేషన్ కార్డు దారుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రేషన్‌కార్డు అనుభవిస్తున్న వారిలో సంపనులెవ్వరూ లేరని, రుణం కోసం ఆదాయ పన్ను చెల్లించినట్లుగా చూపి రుణాలు తీసుకుంటున్నామని చెబుతున్నారు.

జంక్షన్‌లను సుందరంగా తీర్చిదిద్దాలి

నగర మేయర్ గుండు సుధారాణి

జంక్షన్‌ల స్థితిగతులపై క్షేత్రస్థాయి పరిశీలన



ఉర్సు ప్రాంతంలో పక్షుల బొమ్మలను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని జంక్షన్లను సుందరంగా తీర్చిదిద్దాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. శనివారం మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి వరంగల్ నగరంలోని పలు ప్రాంతాలు, జంక్షన్లను సందర్శించారు. శానిటేషన్‌తో పాటు టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ముందు, జెమినీ టాకీస్ జంక్షన్, పోతనరోడ్డు జెండా ప్రాంతం, రామన్నపేట స్థూపం, బీఆర్‌నగర్ జంక్షన్, ఉర్సు జంక్షన్, ఉర్సు బండ్ వినాయక నిమజ్జన ప్రాంతం, నాయుడు పెట్రోల్‌పంపు జంక్షన్, మెట్టుగుట్ట జంక్షన్, ఫాతిమానగర్ జంక్షన్, రెడ్ క్రాస్ భవన్ సమీపంలోని హనుమాన్ దేవాలయం ప్రాంతం, హనుమకొండ కలెక్టర్ విశ్రాంత్రి భవనం ముందు, కాళోజీజంక్షన్, ములుగురోడ్డు జంక్షన్‌లలో సందరీకరణ, శానిటేషన్ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. పోతననగర్ జంక్షన్‌లో కల్వర్టు నిర్మించి గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. ఉర్సుగుట్ట ప్రాంతంలో పక్షుల బొమ్మలకు పెయింటింగ్ వేయించాలన్నారు. నాయుడు పెట్రోల్‌పంపు ప్రాంతాల్లో డివైడర్ల మధ్య మొక్కలు నాటాలని ఆదేశించారు. ఇంకా డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్ ముందు జంక్షన్‌ను ఇంకా విస్తరించాలన్నారు. కాజీపేట ఫాతిమానగర్ జంక్షన్‌లో వావ్ వరంగల్ లోగో దెబ్బతిని ఉందని, వెంటనే మరమ్మతు చేయాలన్నారు. ములుగు రోడ్డు జంక్షన్‌ను విస్తరించి అభివృద్ధి చేయాలన్నారు.

స్పాంజ్ పార్కులు

నగరంలో స్పాంజ్ పార్కుల ఏర్పాటు కోసం శనివారం స్థల పరిశీలన జరిపినట్టు మేయర్ సుధారాణి తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతో పాటు వర్షాకాలంలో నీటిని పీల్చుకుని భూమిలోకి పంపించేందుకు స్పాంజ్ పార్కులు బాగా ఉపయోగపడుతాయన్నారు. స్పాంజ్ పార్కులను ఏర్పాటు చేయడానికి ముందుగా పోతనరోడ్డుతో పాటు బృందావన్ కాలనీలో రెండు చోట్ల కమిషనర్‌తో పాటు స్థలపరిశీలన చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, హెచ్‌వో రమేష్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, మాధవిలత, ఏసీపీ రజిత, శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను, టీపీఎస్‌లు ఇర్షాద్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

అనుమతుల్లేని ఆస్పత్రులపై కొరడా

- తనిఖీలు చేసేందుకు బృందాలు ఏర్పాటు
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య



మాట్లాడుతున్న అప్పయ్య

వరంగల్ మెడికల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌లు, ఆస్పత్రులను గుర్తించేందుకు తనిఖీలు నిర్వహించనున్నట్లు హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య తెలిపారు. శనివారం హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ప్రత్యేక బృందాలు సోమవారం నుంచి తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఒక డాక్టర్, హెల్త్ అసిస్టెంట్లతో 15 బృందాలు ఈ తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. ఇందులో ఒక చెక్లిస్ట్ ప్రకారం వాటికి అనుమతులు ఉన్నాయా? రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, తారీఫ్ లిస్ట్, సేవలు అందిస్తున్న డాక్టర్ల వివరాలు అందరికీ కనిపించే విధంగా ప్రదర్శన, నిబంధనలు పాటిస్తున్నా లేదా తదితర అంశాలను పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ భార్గవ్, వి.అశోక్‌రెడ్డి, జి.ప్రసన్న కుమార్, డాక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



డ్యూటీ మీట్‌లో విన్యాసం ప్రదర్శిస్తున్న పోలీసు జాగిలం

మన పోలీసులు దేశానికే ఆదర్శం

- సిబ్బందిలో నైపుణ్యం పెంచేందుకే పోటీలు
- డ్యూటీమీట్ ముగింపు వేడుకల్లో రాష్ట్ర డీజీపీ జితేందర్
- డ్యూటీమీట్, స్పోర్ట్స్ మీట్ పండుగ లాంటివి : జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా
- 400 మందికి బహుమతులు, పతకాల పంపిణీ

7



విజేతలకు మెడల్స్, ట్రోఫీలను బహుకరిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

యువత రెడ్‌క్రాస్ సొసైటీలో చేరాలి

● సమాజ సేవ చేసేందుకు ముందుకు రావాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : యువత ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వం తీసుకొని మానవసేవ చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ సత్యశారద పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజాసేవలో ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీల మాదిరిగా జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇవి.శ్రీనివాసరావు, డీఈవో జ్ఞానేశ్వర్, జిల్లా సహకార అధికారి నీరజ, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, నాడెం శాంతికుమార్, రాజేశ్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రేవూరి ఇంటి వద్ద వాహనం చోరీ

హనుమకొండ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారి పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు అశోక్ యాదవ్‌కు చెందిన ద్విచక్ర వాహనం శనివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఇంటి వద్ద చోరీకి గురైంది. అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఇంటి వద్ద ఏడాదిగా అశోక్ విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి ద్విచక్ర వాహనంపై వచ్చి ఎమ్మెల్యే ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉండగా ఉదయం 5గంటలకు చూసే సరికి చోరీకి గురైనట్లు తెలిపారు. ఈ విషయంపై హోంగార్డు అశోక్ యాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ద్విచక్ర వాహనం ఆచూకీ తెలియలేదని తెలిపారు. సీసీ కెమెరాలను పరిశీలించినా ఇప్పటి వరకు తన ద్విచక్ర వాహనం దొరకక పోవడంతో సుబేదారి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సేవ చేయడమే అభిమతం కావాలి

● లయన్స్ అంతర్జాతీయ డైరెక్టర్ బాబురావు
● నేత్రపర్వంగా ఉమ్మడి జిల్లా లయన్స్ సదస్సు
● నూతన క్యాబినెట్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాబురావు

మడికొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సేవ చేయడమే సభ్యులందరి అభిమతం కావాలని అంతర్జాతీయ డైరెక్టర్ బాబురావు అన్నారు. శనివారం రాత్రి మడికొండ శివారులోని ఏ1 కన్వెన్షన్ వేదికగా నేత్రపర్వంగా నిర్వహించిన సాకారం ఉమ్మడి జిల్లా లయన్స్ సదస్సును ఆయన ప్రారంభించారు. 320ఎఫ్ జిల్లా నూతన గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాబురావు మాట్లాడారు. రెండు వందలకు పైగా దేశాలకు విస్తరించిన లయన్స్ సంస్థలో సభ్యుడిగా చేరడమే గర్వకారణమన్నారు. అంతకు ముందు 320ఎఫ్ ఉమ్మడి జిల్లా నూతన వీడీజీ 1గా నరహరి సుధాకర్‌రెడ్డి, వీడీజీ 2గా పుట్టా హరికిషన్‌రెడ్డితో పాటు జిల్లా క్యాబినెట్ కార్యదర్శిగా రేణికుంట్ల ప్రకాశం, క్యాబినెట్ ట్రెజరర్‌గా సీహెచ్.రఘునాథరెడ్డితో పాటు రీజియన్ చైర్మన్లు, జోన్ చైర్మన్లు, గ్యాట్ సభ్యులతో మహారాష్ట్ర నుంచి వచ్చిన పూర్వ గ్యాట్‌నాయకురాలు మోనికాసావంత్ ప్రమాణస్వీకారం చేయించారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

సాకారం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, పోడియంలను బహుకరించడం అభినందనీయమని లయన్స్ మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ ఎ.రాజేంద్రప్రసాద్, గ్యాట్ ఏరియా నాయకులు ఆవుల గోపాల్‌రావ్ ప్రశంసించారు. ఏ జిల్లా గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య నాయకత్వంలో లక్షలాది రూపాయల వ్యయంతో చేపట్టిన సేవ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో డాక్టర్ సుధాకర్‌రెడ్డి, మహేష్‌కుమార్ అగర్వాల్, కుందూరు వెంకట్‌రెడ్డి, కన్నా పరశురాములు, ముచ్చ రాజిరెడ్డి, డాక్టర్ కె.రాజేందర్‌రెడ్డి, గంప నాగేశ్వర్‌రావు, జాన్‌బన్నీతో పాటు చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.సురేష్‌కుమార్, చీఫ్ సెక్రటరీ చంద్రగిరి ప్రసాద్, చీఫ్ సెక్రటరీ(సర్వీస్) మార్గం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. సాకారం జిల్లా సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ తాళ్ల రవి స్వాగతం పలికారు. జిల్లా ప్రథమ మహిళా నేత డాక్టర్ రాజేశ్వరి జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభించారు.

ద్రావిడ వర్సిటీ మాజీ వీసీ లక్ష్మీనారాయణ మృతి

కేయూ క్యాంపస్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ద్రావిడ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ(78) ఇకలేరు. లక్ష్మీనారాయణకు కాకతీయ యూనివర్సిటీతో ప్రత్యేక అనుబంధం ఉంది. ప్రతిభావంతులు, పట్టుదల కలిగిన పరిపాలనా దక్షుడిగా ఖ్యాతి పొందారు. వివిధ భాషల తులనాత్మక అధ్యయనం, భాష వైదుష్యంతో పరిశోధన చేశారు. తెలుగు సాహితీ ప్రపంచం గొప్ప సాహితీవేత్తలను కోల్పోయింది. ద్రావిడ వర్సిటీ వీసీగా లక్ష్మీనారాయణ అద్భుతంగా పనిచేశారు. తెలుగు భాష వారధిగా పేరు పొందారు. మృతి పట్ల కేయూ తెలుగు విభాగం ప్రొఫెసర్ కె.యాదగిరి, విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కేయూతో తన అనుబంధాన్ని గుర్తు చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రవి (ఫైల్)

నర్మెట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పోచారం మునిసిపాలిటీ పరిధిలో వరంగల్ జాతీయ రహదారి అన్నోజీగూడ డీమార్టు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మండలంలోని వెల్దండకు చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం వెల్దండకు చెందిన చేర్యాల రవి(45) బతుకుదెరువు కోసం కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లి వివిధ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారంరాత్రి స్కూటీపై స్వగ్రామానికి వస్తుండగా అన్నోజిగూడ డీమార్ట్ సమీపంలో స్కూటీని కారు ఢీకొట్టింది. దీంతో కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోచారం సీఐ గాయాలతో ఉన్న రవిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి



ఎల్లేష్ మృతదేహం

మడికొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. ఎస్సై పెగడ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన గడ్డం ఎల్లేష్(45) కూలి పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం పనికి వెళ్లి ఇంటి వస్తూ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టడంతో తలకు గాయమైంది. స్థానికులు 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. శనివారం ఉదయం ఆకస్మాత్తుగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణించాడు. మృతుడి సోదరుడు గడ్డం ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు కాజీపేట జంక్షన్‌కు డీఆర్ఎం రాక

కాజీపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ ఆర్.గోపాలకృష్ణన్ ఆదివారం సందర్శించనున్నారు. ప్రత్యేక రైలులో సాయంత్రం 4.30 గంటలకు కాజీపేటకు చేరుకుని 6.30 తిరిగి వెళ్తారు. రైల్వేస్టేషన్, లాబీ, యార్డ్, రన్నింగ్ రూమ్, క్రూ లాబీ పరిశీలించనున్నట్లు రైల్వేఅధికారులు తెలిపారు.

డీటీసీని కలిసిన ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం



డీటీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

వరంగల్ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రవాణా శాఖ ఉమ్మడి వరంగల్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సురేశ్‌రెడ్డిని శనివారం ప్రైవేట్ బస్సుల సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశార కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లక్కం శ్రీధర్, ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల అనిల్, ఉపాధ్యక్షుడు చింతల పూడి క్రాంతికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి ప్రహరీ క్లబ్‌లు

● జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

హనుమకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాలను నిరోధించేందుకు, వాటి వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులకు ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావంపై శిక్షణ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ.. ప్రహరీ క్లబ్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చైర్మన్‌గా, విద్యార్థులతో సన్నిహితంగా మెలిగే ఉపాధ్యాయుడు వైస్ చైర్మన్‌గా ఉంటూ ప్రతీ తరగతి నుంచి ఒక బాలిక, ఒక బాలుడు చొప్పున ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులతో ఈ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులు వారి పాఠశాల, ఇంటి పరిసరాల్లో ఎవరైనా మాదక ద్రవ్యాలు అమ్మడం, కొనడం, వాడటం జరిగినా పోలీసులకు 1908 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలని చెప్పారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు వాడడం వల్ల వ్యక్తి శారీరకంగా, మానసికంగా బలహీన పడి వివిధ రకాల జబ్బులకు లోనవుతారని చెప్పారు. సీఎంవో బద్దం సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రవికుమార్, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రిబ్యునల్ సూచనలు అమలు చేయండి

▸▸ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచనలు అమలు చేయాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి మునిసిపల్, కాలుష్య నియంత్రణ మండలి, సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం కోట చెరువును శుభ్రం చేయించాలని, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ఎన్‌జీటీ ఆదేశించిన విధంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బయో హజార్డ్ మేనేజ్‌మెంట్‌లను ప్రాసెసింగ్ చేసి డాక్యుమెంట్ అందజేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న లెగసీ వ్యర్థాలను టెండర్ ప్రాసెసింగ్ చేయాలని సూచించారు. ఎన్‌జీటీ విధి విధానాల ప్రకారం 17 ఎకరాల ల్యాండ్‌ను రాంపూర్ డంప్‌యార్డులో నిర్వహించడంతోపాటు బయో మైనింగ్ పూర్తి చేశామని, కొనుగోలు చేసిన ల్యాండ్‌కు టెండర్ ప్రక్రియ పూర్తయిందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించాలని, అందుకోసం కాలుష్య నియంత్రణ మండలి, పురపాలికల, కార్పొరేషన్ తరుపు నుంచి ఉచితంగా మట్టి విగ్రహాలను అందజేయాలని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలనే పూజించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, జీడబ్ల్యూఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

లారీ ఓనర్లపై కేసు నమోదు

హనుమకొండ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలో ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఎదుట ధర్నాచేసి అధికారుల విధులకు ఆటంకం కలిగించినందుకు లారీ ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ శనివారం తెలిపారు. జూలై 31న దామెర మండలం ఓగ్లాపూర్ గ్రామ సమీపంలోని దర్గా వద్ద మైనింగ్ శాఖ, ఆర్‌టీఏ, రాష్ట్ర పన్నుల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రూట్ చెక్ పోస్టు నిర్వహించారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలను తనిఖీ చేశారు. దీనికి నిరసనగా శనివారం హనుమకొండలోని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంఎదుట వరంగల్ జిల్లా ఇసుక లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో 20 మంది లారీల ఓనర్లు ఆందోళన చేయడంతో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.అనిల్ తమ విధులకు ఆటంకం కలిగించిన లారీఓనర్లపై సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వయోవృద్ధులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

▸▸ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

వరంగల్ మెడికల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోనే రెండో అతి పెద్ద ప్రభుత్వ ఆస్పత్రి అయిన ఎంజీఎంతోపాటు అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో వయోవృద్ధులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ సూచించారు. శనివారం ఎంజీఎంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం-2007పై శిక్షణ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వయోవృద్ధులకు ప్రత్యేక వార్డులను, ఇతర సౌకర్యాలు ఏర్పాటుచేసి మర్యాదపూర్వకమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఇంటిలోని పెద్దల పట్ల ప్రేమ, గౌరవ మర్యాదలతో మెలగాలని, వీరిని చూసి పిల్లలు కూడా పెద్దవారితో సన్నిహితంగా ఉంటారని తెలిపారు. వారు ఇచ్చిన ఆస్తులను అనుభవిస్తూ వారిని వృద్ధాశ్రమాల్లో వేయడం తగదని తెలిపారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్, డాక్టర్ సమ్మయ్య, హెల్పేజ్ ఇండియా సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్యామ్‌కుమార్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య, కజాంపురం దామోదర్, వరంగల్ డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.సాయికుమార్, డాక్టర్ మమత, తేరాల యుగంధర్, నర్సయ్య, రవీందర్, సత్యనారాయణ, సాంబయ్య, యాదగిరి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

● అనారోగ్యంతో మనస్తాపం



ఉమారాణి (ఫైల్)

బచ్చన్నపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన యువతి, చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం... సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరుకు చెందిన బైకాని మంజుల-బీరయ్య దంపతులు 13ఏళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి నక్కవానిగూడెం వచ్చి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ముగ్గురు కూతుళ్లున్నారు. ఇద్దరి వివాహాలు కాగా, చిన్న కూతురు బైకాని ఉమారాణి(19) జనగామలో డిగ్రీ చదువుతోంది. కొద్దినెలల క్రితం అనారోగ్యానికి గురికావడంతో సర్జరీ చేయించారు. అయినా ఆరోగ్యం కుదుటపడ లేదు. గత నెల 31న వ్యవసాయ బావి వద్దకు కుటుంబ సభ్యులతో వ్యవసాయ పనుల్లో సహాయం చేసేందుకు పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగింది. జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా ఉండటంతో ఎంజీఎంకు తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామం ఆకునూరుకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అబ్దుల్ హమీద్ తెలిపారు.

ఆర్ఐలపై నిఘా వర్గాల ఆరా

● లాంగ్ స్టాండింగ్‌పై కమిషనర్ సీరియస్
● వివరాలు కావాలని మునిసిపల్ అధికారులకు ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో విధులు నిర్వర్తించే ఆర్ఐ(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు)ల బాగోతం బట్టబయలైంది. చాలాకాలంగా ఒకే చోట పాతుకుపోయి ప్రతీ ఫైలుకు లక్షల్లో వసూలు చేస్తున్న కొందరు ఆర్ఐల పనితీరుపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఆర్ఐలా?..వసూలు రాజాలా?' అనే వార్త ప్రచురితం కావడంతో జీడబ్ల్యూఎంసీలో చర్చ జరిగింది. వరంగల్‌తోపాటు రాష్ట్ర నిఘా వర్గాలు, విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టినట్టు విశ్వసనీయ సమాచారం. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల పరిధిలో పనిచేసే ఆర్ఐలపై ఇంటిలిజెన్స్, ఎస్‌బీ పోలీసు విభాగాలు విచారణ చేపట్టాయి. కార్యాలయంలో ఎంత మంది ఆర్ఐలు పని చేస్తున్నారు? వారు ప్రజల నుంచి అక్రమంగా వసూలు చేసిన డబ్బులు ఎవరికి ఎంత పర్సంటేజీ ఇస్తారు? అనే కోణంలో దర్యాప్తు చేసినట్టు తెలిసింది. అంతేకాకుండా అడ్డదారిలో డబ్బులు సంపాదించి విలాసవంతమైన ఇండ్లు, కార్లు ఎంత మంది కొనుగోలు చేశారు. బ్యాంకు బ్యాలెన్స్‌లపై పూర్తి విచారణ నిఘా వర్గాలు చేపట్టినట్టు తెలిసింది.

ఆర్ఐల అక్రమాలపై గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ సీరియస్ అయినట్టు తెలిసింది. శనివారం సాయంత్రం రెండో శ్రేణి గ్రేటర్ ఉన్నతాధికారితో పాటు సెక్షన్ పర్యవేక్షణ అధికారిని తన కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడినట్టు తెలిసింది. ఆర్ఐలు ఎవరు ఎప్పుడు ఆర్ఐలుగా విధుల్లో చేరారు? ఎందుకు ఒకే చోట మూడు టర్మ్‌లు పని చేయవలసి వచ్చింది? అనే కోణంలో అధికారులను ఆరా తీసినట్టు తెలిసింది. అంతేకాకుండా ఆర్ఐలతో పాటు ఆర్‌వోల పూర్తి వివరాలు కూడా తనకు అందించాలని కోరినట్టు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో ఆర్ఐలను బదిలీ చేయడం, అర్హత కలిగిన కొత్త వారిని గాని ఆర్ఐలుగా నియమించే అవకాశం ఉన్నట్టు బల్దియాలో ప్రచారం జరుగుతోంది.

కాగా, జీడబ్ల్యూఎంసీ పరిధిలోని ఓ సర్కిల్ అధికారి ఆర్ఐలు అంతా అవినీతికి పాల్పడుతున్నారని, తన వద్ద పనిచేస్తున్న వారిని ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని కమిషనర్‌కు లెటర్ పెట్టడం కార్పొరేషన్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

గుండె నిండా.. ఉండు ఫ్రెండు!

(5వ పేజీ తరువాయి)

కొందరు అవసరానికి మాత్రమే మిమ్ము లను గుర్తు చేసుకుంటారని అనిపించిందా..? అని అడిగిన ప్రశ్నకు కూడా 51శాతం మంది అనిపించిందని అభిప్రాయపడ్డారు. అంటే అవసరం ఉన్నప్పుడే స్నేహితుడు గుర్తుకువస్తాడని, ఆ తరువాత పట్టించుకోరనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఆ తరువాత కొన్నిసార్లు అలా అనిపించిందని 33.5శాతం అభిప్రాయపడగా, అసలు ఆ ఆలోచనే రాలేదని 15.5శాతం మంది అభిప్రాయపడ్డారు. సందర్భం ఏదైనా అవసరానికి ఉపయోగపడే వాడు స్నేహితుడే అని తేల్చిచెప్పారు.



అలాగే దోస్తనాపై సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా పడిందనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. సోషల్‌మీడియా వల్ల మీరు నిజమైన స్నేహితులను పొందారా..? లేక కోల్పోయారా..? అని అడిగిన ప్రశ్నకు 40శాతం మంది నిజమైన స్నేహితులను పొందామని అభిప్రాయ పడగా, కోల్పోయామని 31.5శాతం మంది, రెండు జరిగాయని 33.5శాతం మంది అభిప్రాయ పడ్డారు. అంటే సోషల్ మీడియా వల్ల మంచి చెడు రెండు ఉన్నాయని తేల్చిచెప్పారు. అలాగే మీరు స్నేహితులతో ఎక్కువగా ఎలా మాట్లాడతారని అడిగిన ప్రశ్నకు 41.5శాతం మంది ఫోన్‌ద్వారానే రెగ్యులర్‌గా మాట్లాడుకుంటామని పేర్కొన్నారు. 35.5శాతం మంది మాత్రం రెగ్యులర్‌గా కలుసుకుంటామని చెప్పగా, 23శాతం మంది మాత్రం చాటింగ్‌లు, మెసేజ్‌ల ద్వారా పలకరించుకుంటామని చెప్పారు. సాంకేతికత పెరిగిన తరువాత మనుషుల మధ్య దూరం పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

మీకు అవసరం లేకపోయినా రెగ్యులర్‌గా మాట్లాడే స్నేహితులు ఎందరు ఉన్నారని అడిగిన ప్రశ్నకు.. ఎవరూ లేరని 25శాతం మంది అభిప్రాయ పడగా, ఒకరిద్దరు ఉన్నారని 42.5శాతం మంది, ముగ్గురికంటే పైనే అని 32.5శాతం మంది చెప్పారు.

మీ జీవితంలో నిజమైన స్నేహితుడిని కలిశారా..? అని అడుగగా, 56.5శాతం మంది కలిశామని తేల్చిచెప్పారు. 36శాతం మంది తమ మనసుకు నచ్చిన అసలైన మిత్రుడు ఇంకా లభించలేదనే అభిప్రాయాన్ని తెలిపారు. అలాంటి మిత్రుడిని కలిశామా..? లేదా..? అని కచ్చితంగా చెప్పలేమని 25.5శాతం మంది తేల్చి చెప్పారు. మొత్తంగా స్నేహితుడిపైనే అధికంగా నమ్మకం, భరోసా, బాధ్యత ఉన్నట్లుగా సర్వేలో అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

స్నేహం అంటేనే భరోసా..



అపదలో ఉన్నప్పుడు నిజమైన స్నేహితుల విలువ తెలుస్తుంది. కుటుంబసభ్యులకు కూడా చెప్పలేని విషయాలను స్నేహితులతో పంచుకుంటాం. చిన్ననాటి స్నేహాలు పటిష్టంగా ఉంటాయి. సెల్‌ఫోన్ వినియోగం పెరిగిన తరువాత వృత్తిరీత్యా ఎక్కడెక్కడ ఉన్న కనీసం వారంలో ఒకసారైనా ఫోన్‌లో మాట్లాడుకుంటున్నాం. నా మిత్రులకు చాలామందికి సాయం చేశాను. అవసరమైనప్పుడే వారి నుంచి నాకు కూడా సహాయం లభించింది.

- లక్కాకుల సారంగపాణి, ప్రయివేటు ఉద్యోగి, భూపాలపల్లి

ఎల్లప్పుడూ తోడుండే బంధమే స్నేహం



స్నేహమంటే ఎలాంటి స్వార్థం లేకుండా ఎల్లప్పుడూ తోడుగా నిలిచే బంధం. అది మాటల్లో కంటే మనుసుల్లో నిలిచిపోయే సంబంధమే స్నేహం. నా కుమారుడికి యాక్సిడెంట్ అయి కోమాలో ఉన్నప్పుడు నా మిత్రులు నాకు ఆర్థిక సాయం చేయటమే కాకుండా మనోధైర్యాన్నిచ్చారు. ఆన్‌లైన్ స్నేహాల పట్ల నేటి యువత జాగ్రత్తగా ఉండాలి. క్షణికావేశంలో ఎవరినీ నమ్మవద్దు. మంచి స్నేహాలు ఎప్పుడు జీవితానికి తోడుగా ఉంటాయి.

- అచ్చ సుదర్శన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, హసన్‌పర్తి

కష్ట సమయాల్లో ఓదార్చేది స్నేహితులే..



కష్ట సమయాల్లో ఓదార్పుగా స్నేహితులే ఉంటారు. చాలసార్లు నా స్నేహితులకు నేను సాయం చేశాను. నాకు కూడా నా స్నేహితుల నుంచి సాయం అందింది. బంధువులు తోడు ఉన్నా లేకున్నా.. స్నేహితులు మాత్రం అండగా నిలుస్తారు. కులాలు, మతాలు, వయస్సుతో సంబంధం లేకుండా మంచి స్నేహాలు జీవితానికి భరోసా ఇస్తాయి.

- బజ్జూరి సుహాసిని, సాఫ్ట్‌వేర్‌ఉద్యోగి, కరీమాబాద్

ఆన్‌లైన్ స్నేహాలు ప్రమాదకరం



ఆన్‌లైన్ స్నేహాలకు ఆకర్షితులు కావద్దు. అనేక మోసాలకు ఈ స్నేహాలే కారణం అవుతున్నాయి. అవతలి వారి వ్యక్తిత్వం తెలియక మోసపోవాల్సి వస్తోంది. చిన్నతనం నుంచి మనతో కలిసి ఉన్న ఫ్రెండ్స్‌తో స్నేహం కొనసాగించాలి. మిత్రులకు కష్టం వస్తే అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రతీ ఫ్రెండ్‌పై ఉంటుంది. మంచి స్నేహాలు జీవితాలకు అండగా నిలుస్తాయి. చెడు స్నేహాలను ఎప్పటికీ దగ్గరికి రాకుండా చూసుకోవాలి.

- మేడి చైతన్య, సూపరిండెంటెండ్, ఇరిగేషన్ శాఖ, ములుగు జిల్లా

అ'పూర్వ' స్నేహబంధాలు

- ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న క్లాస్‌మేట్స్
- నిజమైన స్నేహానికి అర్థంగా నిలుస్తున్న చిన్ననాటి స్నేహితులు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం అన్న పదాలను నిజం చేస్తున్నారు క్లాస్‌మెట్స్ చిన్నతనంలో విద్యాకేంద్రాలు, సరస్వతి నిలయాల్లో ఏర్పడ్డ స్నేహబంధం కడదాక నిలుస్తోంది. స్నేహితుడు అనారోగ్యం బారిన పడితే తమకు తోచిన సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. అంతే కాదు, స్నేహితుడు దురదృష్టవశాత్తు కానరాని లోకాలకు వెళ్లితే, అతడి కుటుంబ సభ్యులకు బాసటగా ఉంటున్నారు. పాఠశాల స్థాయిలో విద్యాభ్యాసాన్ని ముగించుకుని ఉన్నత చదువుల కోసం దశాబ్దాల కిందట విడిపోయిన పదో తరగతి విద్యార్థులంతా గత కొద్ది కాలంగా వారు చదివిన పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాల (అపూర్వ కలయిక) పేరుతో ఒకే వేదికపై కలుస్తూ స్నేహబంధాలకు బలాన్ని చేకురుస్తున్నారు. సమావేశాల్లో ఒకరి గూర్చి ఒకరు తెలుసుకొని ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నారు. అవసరాలున్న వారిని గుర్తించి మిగతా వారంతా ఆసరాగా నిలుస్తున్నారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు భరోసాగా నిలుస్తున్నారు. కేసముద్రం ఎస్‌వీవీ పాఠశాలలో 1996-97 టెన్త్ బ్యాచ్‌కు చెందిన వెంకటగిరి వాసి గాండ్ల అశోక్, అతని భార్య అనారోగ్యంతో మృతి చెందగా, వారి కూతురు చదువు బాధ్యతను తీసుకుని ఆరేండ్లుగా పాఠశాల ఫీజు చెల్లిస్తూ స్నేహానికి మారుపేరుగా నిలుస్తున్నారు. స్నేహం అంటే కేవలం కలుసుకున్న సమయాల్లో మాట్లాడుకోవడం, సంతోషాల్లో కలవడం కాదు.. ఆపదలో ఉన్న సమయాల్లో తామున్నామంటూ భరోసా నిచ్చేది అని నిరూపిస్తున్నారు క్లాస్‌మేట్స్.



నర్సంపేటలో స్నేహితుడి కుమార్తె స్కూల్ ఫీజు చెల్లిస్తున్న 1996-97 టెన్త్ బ్యాచ్ కేసముద్రం ఎస్‌వీవీ స్కూల్ క్లాస్‌మెట్స్

దేవాదుల మూడో దశ పనులు వెంటనే చేపట్టాలి

మంత్రి ఉత్తమ్‌ను కోరిన ఎమ్మెల్యేలు శ్రీహరి, యశస్వినిరెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా చేపట్టిన మూడో దశ పనులు వెంటనే చేపట్టాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్ సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో కడియం శ్రీహరి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి దేవాదుల ప్రాజెక్టు గురించి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. దేవాదుల ఎత్తిపోతల పథకం మూడో దశ ఆరో ప్యాకేజీలో నవరించిన పనులను వెంటనే చేపడితే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించే ప్రాజెక్టుగా దేవాదుల మారుతుందని పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, పాలకుర్తి, తుంగతుర్తి నియోజకవర్గాల్లో దాదాపు 78 వేల ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం ఉందని తెలిపారు. వివిధ కారణాల వల్ల పనుల్లో జాప్యం జరిగిందని, దీంతో ఈ ప్రాంతాలకు సాగునీరు అందలేదని తెలిపారు. ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టులోని పెండింగ్ పనులను పూర్తి చేయాలని మంత్రిని కోరారు. ఉప్పుగల్లు రిజర్వాయర్ నుంచి దంస చెరువు, జఫర్‌గఢ్ పెద్ద చెరువు నింపడంతో పాటు 10 వేల ఎకరాలకు సాగు నీరు అందిచవచ్చని తెలిపారు. పాలకుర్తి నియోజక వర్గంలో సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, వీటితో పాటు నెల్లుట్ల చెక్‌డ్యాం, లోతువాగుపైన ఆనకట్ట, ధర్మసాగర్ సౌత్ మెయిన్ కెనాల్‌లో పూడిక తీత పనులను చేపట్టాలని, పాముమారు వద్ద బంజర్ మాటు, ఆకేరు వాగుపైన కొనాయిచలం, తిడుగు గ్రామాల వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు కడియం తెలిపారు. దీనిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖ అధికారులకు త్వరితగతిన పూర్తిచేసి పరిపాలన అనుమతి కోసం పంపించాలని ఆదేశించినట్లు తెలిపారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్విని రెడ్డి

నేడు 'మనసు – మనిషి' వ్యక్తిత్వ వికాస పుస్తకావిష్కరణ

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సైకాలజిస్టు, కౌన్సెలింగ్ ఎక్స్‌పర్ట్, పీజీ హెచ్‌ఎం మెండు ఉమామహేశ్వర రచించిన మనసు - మనిషి వ్యక్తిత్వ వికాస పుస్తకం ఆవిష్కరణ ఆదివారం ఉదయం 10గంటలకు హనుమకొండ కిషన్‌పురాలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఉదయం మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ తొలి శాసనసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, గౌరవ అతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన వక్తగా సీనియర్ పాత్రికేయుడు శెంకేసి శంకర్‌రావు, అతిథిగా ప్రముఖ సైకాలజిస్టు జి.నాగేశ్వర్‌రావులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని మేధావులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

ఎస్సై కందుల అశోక్‌కు సీఐగా పదోన్నతి

వరంగల్ క్రైం, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న 2012 బ్యాచ్‌కు చెందిన కందుల అశోక్‌కు సీఐగా పదోన్నతి లభించింది. మామునూరు సమీపంలోని బొల్లికుంట గ్రామానికి చెందిన అశోక్ 2012లో ఎస్సైగా ఎంపికై ఎస్సైగా హసన్‌పర్తి, రఘునాథపల్లి, ఐనవోలు, ఇంతేజార్‌గంజ్‌లో విధులు నిర్వర్తించాడు. ప్రస్తుతం హనుమకొండ పీఎస్‌లో ఎస్సైగా కొనసాగుతుండగా పదోన్నతి వరించింది. దీంతో పోలీస్‌స్టేషన్ సిబ్బంది, 2012 బ్యాచ్‌కు చెందిన అధికారులు అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.





రైలు పట్టాలపై లారీ

పై ఫొటోను చూడగానే రైలు పట్టాలపైకి లారీ వచ్చినట్లుగా కనిపిస్తోంది కదా! ఇది రైల్వే శాఖకు చెందిన 'థర్మెట్ వెల్డింగ్' వాహనం. కేసముద్రంలో కొద్దినెలలుగా మూడో రైల్వేట్రాక్ పనులు కొనసాగుతున్నాయి. రైలుపట్టాల మధ్య జాయింట్ వేసేందుకు థర్మెట్ వెల్డింగ్ పరికరాలతో కూడిన ఈ లారీని వినియోగిస్తున్నారు. ట్రాక్‌పై నడిచే హైడ్రాలిక్ ట్రాలీ వాహనంపైకి లారీ చేరగానే అమాంతం పైకి లేపి పట్టాలు జాయింట్ వేసే చోటికి తరలిస్తున్నారు. పని పూర్తయ్యాక హైడ్రాలిక్ వాహనంపై నుంచి లారీని దింపేస్తే రోడ్డుమార్గంలో లారీ మరో చోటికి తరలివెళుతోంది. రైల్వేట్రాక్, రోడ్డుపై ఉభయచరంగా ఈ వాహనం ఉండడం పలువురిని ఆకట్టుకుంటోంది.

- ఆంధ్రజ్యోతి, కేసముద్రం

మన పోలీసులు దేశానికే ఆదర్శం

- సిబ్బందిలో నైపుణ్యం పెంచేందుకే పోటీలు
- డ్యూటీమీట్ ముగింపు వేడుకల్లో రాష్ట్ర డీజీపీ జితేందర్
- డ్యూటీమీట్, స్పోర్ట్స్ మీట్ పండుగ లాంటివి : జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా
- 400 మందికి బహుమతులు, పతకాల పంపిణీ

మామునూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాలను అదుపు చేయడంలో తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శమని డీజీపీ జితేందర్ అన్నారు. మామునూరు పీటీసీ వేదికగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం పోలీస్ డ్యూటీ మీట్-2025 పోటీల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీజీపీ జితేందర్, జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. నేర దర్యాప్తుతో పాటు అన్ని విభాగాల్లో దేశంలోనే తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో నిలవడం సంతోషదాయకమన్నారు. తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వహించే పోలీసుల్లో ఈ డ్యూటీ మీట్ పోటీలు ఉత్తేజం నింపుతాయని అన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ డ్యూటీ మీట్‌లో రాష్ట్రంలోని ఏడు జోన్లతో పాటు హైదరాబాద్, రాచకొండ కమిషరేట్ పోలీసులు, సీఐడి, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ విభాగాలకు చెందిన సూమారు నాలుగు వందల మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి మెడల్స్ బహూకరించారు. 25 విభాగాలలో ప్రతిభ కనబర్చిన వారికి ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీని అందజేవారు. త్వరలో జరుగబోయే జాతీయ డ్యూటీమీట్ పోటీలలో సత్తా చాటి ఎక్కువ పతకాలను సాధించి తెలంగాణ పేరును నిలబెట్టాలన్నారు.

రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా మాట్లాడుతూ పోలీసులు పోలీసులకు డ్యూటీమీట్, స్పోర్ట్స్ మీట్ రెండూ పండగలాంటివని అన్నారు. త్వరలోనే జైళ్ల శాఖ విభాగంలో కూడా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికను రూపొందిస్తామన్నారు. ఇటీవల రాంచీలో జరిగిన ఆల్‌ఇండియా 68వ పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు అత్యుత్తమ ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా ఓవరాల్ టీమ్ చాంపియన్‌గా నిలిచి వివిధ విభాగాల్లో మొత్తం 18 పతకాలను సాధించారని అన్నారు. సైంటిఫిక్, ఇన్వెస్టిగేషన్, యాంటీ-సాబోటెజ్ చెక్, డాగ్‌స్క్వాడ్ పోటీ వంటి ఈవెంట్లలో తెలంగాణ బృందం ఆరు బంగారు, నాలుగు రజత, ఎనిమిది కాంస్య పతకాలను గెలుచుకుందన్నారు. ఇదే తరహాలో త్వరలో జరుగబోయే ఆల్ ఇండియా 69వ డ్యూటీ మీట్‌లో ఫోటో, వీడియోగ్రఫీ బృందాలు, డాగ్‌స్క్వాడ్ బృందాలు సత్తాచాటి ఎక్కువ మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మహిళలు చేసిన నృత్యాలు, పోలీసు జాగిలాలు చేసిన విన్యాసాలు, బాణసంచా షో అతిథులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, స్నేహశబరీష్, మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, బెటాలియన్ ఎస్పీ రాంరెడ్డి, భూపాలపల్లి, మహబూబాబాద్ ఎస్పీలు కిరణ్ ఖర్గే, సుధీర్, వరంగల్ పోలీస్ కమిషరేట్ డీసీపీలు అంకిత్ కుమార్, షేక్ సలీమా, పీటీసీ ప్రిన్సిపాల్ పూజ, కమాండెంట్‌లు, మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, ఏసీపీలు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్



మాట్లాడుతున్న సీపీ సన్ ప్రీత్ సింగ్



డీజీపీకి సెల్యూట్ చేస్తున్న పోలీస్ జాగిలం



డీజీపీలను సత్కరించి జ్ఞాపికలను అందజేస్తున్న సీపీ సన్ ప్రీత్ సింగ్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీపీలు

వాహనదారులు మధ్యవర్తులను ఆశ్రయించొద్దు..

- వాహనాల్లో సంబంధిత పత్రాలను వెంట పెట్టుకొని ప్రయాణించాలి
- ఉమ్మడి వరంగల్ డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్టు కమిషనర్ (డీటీసీ) సురేశ్‌రెడ్డి



వరంగల్ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రవాణా శాఖ సేవల కోసం మధ్యవర్తులు ఆశ్రయించొద్దని, నేరుగా రవాణాశాఖ కార్యాలయాల్లో సంప్రదించి కావాల్సిన సేవలను పొందాలని వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్టు కమిషనర్ సురేశ్‌రెడ్డి సూచించారు. ఇటీవల డీటీసీగా బాధ్యతలు స్వీకరించిన సురేశ్‌రెడ్డి.. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. కార్యాలయాలకు రాకుండానే ఇంట్లో నుంచి ఆన్‌లైన్ ద్వారా 18 రకాల సేవలు పొందేందుకు ప్రభుత్వం ఆవకాశం కల్పించిందన్నారు. అలాంటి సేవలను వాహనదారులు సమయం వృథా కాకుండా ఇంట్లో నుంచి పొందొచ్చన్నారు. ఇటీవల జరిగిన నకిలీ ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సంఘటనలో వరంగల్, హనుమకొండ కార్యాలయాలకు సంబంధించిన సిబ్బంది హస్తం ఉన్నట్లు తెలితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వాహనదారులు ప్రయాణాలు చేసేటప్పుడు తప్పనిసరిగా సంబంధిత పత్రాలను వెంట తీసుకెళ్లి తనిఖీల సమయంలో బాధ్యతగా తనిఖీ అధికారికి చూపించాలని సురేష్ రెడ్డి కోరారు. ఫిట్‌నెస్, పర్మిట్, ట్యాక్స్, ఇతర సర్టిఫికెట్‌లను విధిగా పొందాలన్నారు. పనిచేయకుండా షెడ్‌లో ఉంచే వాహనాల వివరాలను ఆయా యాజమానులు, ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు అందజేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పాఠశాల బస్సుల యాజమాన్యాలు, ప్రైవేట్ ట్రావెల్ బస్సుల యాజమాన్యాలతో సమావేశాలు ఏర్పాటు చేసి నిబంధనలపై అవగాహన కల్పిస్తామన్నారు. రోడ్డు సేఫ్టీపై విద్యాలయాలల్లో దశల వారీగా అవగాహన కల్పించబోతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 18 రకాల సేవలను ఆన్‌లైన్‌లో అందిస్తుండగా మరిన్ని సేవలను ఆన్‌లైన్‌లో అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రవాణాశాఖ కార్యాలయానికి వాహనదారులు రావాల్సిన పనిలేకుండా రవాణా శాఖ సేవలు అందుబాటులోకి రాబోతున్నాయన్నారు. సేవలు పొందుటలో ఎలాంటి లోపాలు జరిగినా డీటీసీ కార్యాయలంలో తనను నేరుగా సంప్రదించి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- హనుమకొండ గురుకులాల తనిఖీ

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బాలికల కళాశాల వసతి గృహం (ఎ), హనుమకొండ గాంధీనగర్ టీవీ టవర్ సమీపంలోని బాలుర గురుకులం(బి)లను కలెక్టర్ తనిఖీ చేశారు. గురుకులాల్లోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, వారి హాజరు శాతం అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూములోని కూరగాయలు, నిత్యావసర వస్తువులు, మెనూ చార్ట్‌ను పరిశీలించారు. వసతి గృహాలకు సంబంధించిన వివరాలను సంబంధిత హాస్టల్ వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థుల కోసం తాజా కూరగాయలను వంటలో వినియోగించాలన్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఎస్సీ వెల్ఫేర్ డీడీ నిర్మల, వార్డెన్లు ఉన్నారు.



బాలసముద్రంలోని బాలికల కళాశాల వసతి గృహం (ఎ)లోని వంటశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

కాసర్ల శ్యామ్‌కు ఎర్రబెల్లి అభినందన

పాలకుర్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : బలగం సినిమాలో ... ఊరు పల్లెటూరు అనే పాటకు కేంద్రం 71వ జాతీయ ఫిల్మ్ అవార్డు ప్రకటించడం తోపాట రచయిత కాసర్ల శ్యామ్‌కు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. శ్యామ్ సమకూర్చిన ట్యూన్‌కు జాతీయ అవార్డు దక్కడంతో యావత్ తెలంగాణ ప్రజలు అభినందిస్తున్నారు. తెలంగాణ మట్టి వాసనను పాటలో రూపొందించిన శ్యామ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బార్‌షాప్‌నకు అనుమతి ఇవ్వొద్దు

వడ్డేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వడ్డేపల్లి చర్చి జంక్షన్‌లో బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతి ఇవ్వొద్దని జైభీమ్ జిల్లా కన్వీనర్ తాళ్లపల్లి విజయ్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ వడ్డేపల్లిలోని జైభీమ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డేపల్లిలో ఏర్పాటు చేయబోయే బార్‌కు అనుమతిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో ఐదు చర్చిలు, పాఠశాలలు, మహిళా కళాశాలలు ఉన్నాయన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. బార్ షాప్‌నకు అనుమతిస్తే మహిళా సంఘాలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జైభీమ్ జిల్లా ప్రతినిధులు ఇల్లందుల భాస్కర్, పీటర్, శాంత్, దుప్పటి కోటి, రాజ్‌కుమార్, పవన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాళ్లపల్లి విజయ్



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ అయ్యప్ప

తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ అయ్యప్ప

వరంగల్ మెడికల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల ప్రాముఖ్యం, పాలిచ్చే సరైన విధానంపై గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు అవగాహన కల్పించాలని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ. అప్పయ్య కోరారు. హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శనివారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. తల్లిపాల వల్ల బిడ్డకు, తల్లికి మధ్య అనుబంధం పెరుగుతుందని, తల్లిపాలు బిడ్డ తాగడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు గృహ సందర్శన లేదా చెకప్‌కు వచ్చినప్పుడు తగు సలహాలు, సూచనలు, పాలు తాగించే సరైన పద్ధతిని నేర్పించాలన్నారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ.. తల్లి, బిడ్డకు ప్రసవించిన మొదటి గంటలో ముర్రుపాలు తప్పకుండా పట్టించాలని, బిడ్డకు మొదటి సంవత్సరం వచ్చే వరకు తప్పనిసరిగా కేవలం తల్లిపాలే పట్టించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ, కేయూ పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డి, డాక్టర్ మహేందర్, డాక్టర్ సుభాష్, సీడీపీవో విశ్వజ, డాక్టర్ గీత, డెమో అశోక్‌రెడ్డి, పోషణ్ అభియాన్ బృందం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

హసన్‌పర్తి ఇన్‌చార్జి ఎంపీడీవోగా రవీందర్

హసన్‌పర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా నడికూడ మండలం ఎంపీవో రవీందర్‌ను నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం హసన్‌పర్తి ఎంపీవో కర్ణాకర్‌రెడ్డి నుంచి రవీందర్ ఉత్తర్వు అందుకున్నారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌కు సిబ్బంది అభినందనలు తెలిపారు.

అవయవ దానానికి ముందుకురావాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బాలసముద్రం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అవయవ దానానికి పౌరులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అవయవదాన దినోత్సవం (ఆదివారం) ఫ్లెక్సీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుకోని ఘటనలో మృతి చెందినవారి అవయవాలు సేకరించి 8 మందికి పైగా అభాగ్యులకు ప్రాణదానం కల్పించవచ్చన్నారు. అవయవదానంపై పౌరులు అవగాహన కలిగి బాధితులకు ఉపయోగపడాలన్నారు. అదేవిధంగా అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీలో నిర్వహించిన కార్యక్రమంలో అడ్వకేట్ గోపికారాణి, సూరప్ప సరిత, బొడ్డు కుమారస్వామి, పాలడుగుల సురేందర్, నిర్మల దంపతులు అవయవదాన, శరీరదాన అంగీకార పత్రం రాసి ఇచ్చారు. మరణానంతరం అవయవ దానం, శరీరదానం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, డాక్టర్ కె.అనితారెడ్డి, తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ ప్రతినిధులు ఉపేందర్‌రెడ్డి, పద్మ, మల్లారెడ్డి, నర్సింహరాములు, కరేటి శంకర్‌రావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలి

కాజీపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవీందర్‌రాజు డిమాండ్ చేశారు. కాజీపేటలోని పలు ప్రభుత్వ పాఠశాలలో శనివారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రవీందర్ రాజు మాట్లాడారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఏకశిల పార్కులో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు చుంచుకాల లింగారావు, కె. సదానందం, కాజీపేట మండల బాధ్యులు టి. దావు, సోమయ్య, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

హసన్‌పర్తి (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హసన్‌పర్తి ఇన్‌చార్జి ఎంపీడీవో రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ కల్యాణి ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. మహిళలకు పని ప్రదేశంలో స్వేచ్ఛగా పనిచేసే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కర్ణాకర్‌రెడ్డి, ఏపీఓ విజయలక్ష్మి, డీఎంసీ కల్యాణి, జీఎస్. స్వర్ణలత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెటింగ్ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

బాలసముద్రం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వివిధ ఎలక్ట్రికల్ కంపెనీల వస్తువులను మార్కెటింగ్ చేస్తున్న ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీ అన్నారు. శనివారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల అభివృద్ధికి సంక్షేమ నిధిని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. సంక్షేమ నిధి నుంచి ఆపదలో ఉన్న ఉద్యోగికి అసోసియేషన్ తరఫున సహాయం చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ సభ్యుడికి మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీ అందించనున్నట్లు వివరించారు. అసోసియేషన్ కోశాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల ప్రమాదవశాత్తు చేయి విరిగిన ఉద్యోగి రాజ్‌కుమార్‌కు అలాగే తండ్రిని కోల్పోయిన మరో ఉద్యోగి రంజిత్‌రెడ్డికి సంక్షేమ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున నగదు అందజేశారు. సమావేశంలో ఇంకా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి సంతోష్, సంయుక్త కార్యదర్శి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కేయూ క్యాంపస్ ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా వర్సిటీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు న్యూఢిల్లీలోని బీటీఆర్ భవన్ ఆల్ ఇండియా వర్సిటీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బీఎస్ హోటా అధ్యక్షత జరిగిన సమావేశంలో పుల్లా శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వర్సిటీ బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరం కావడం లేదన్నారు. 7వ వేతన సవరణ వర్సిటీ ఉద్యోగులకు ఇవ్వడం లేదన్నారు. డీఏలు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి పడిందన్నారు. వేతన స్కేల్‌లో అసమానతలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని అన్నారు. పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా వర్సిటీ ఉద్యోగులు, కేయూ టెక్నికల్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ నలబోలు రాము తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్ట వీరభద్రస్వామి విగ్రహం ఎక్కడ?

- విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలి
- విగ్రహం తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి
- దేవాదాయ కమిషనర్‌ను కోరుతున్న భక్తులు

మడికొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపై ఉన్న క్షేత్రపాలకుడు వీరభద్రస్వామి విగ్రహాన్ని తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని పునఃప్రతిష్ఠించాలని భక్తులు కోరుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రధాన ఆలయాల భూముల ఆక్రమణలు, అక్రమాలపై విచారణ చేపట్టడానికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు ఆదివారం జిల్లాకు రానున్నారు. ఇందులో భాగంగా మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని సందర్శిస్తారు. ఈ నేపథ్యంలో 11వ శతాబ్దంలో ప్రతిష్ఠించినట్లు చెప్పబడుతున్న రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన ఉపాలయంలోని మూల విరాట్ వీరభద్రస్వామి విగ్రహం భిన్నంగా ఉంటుంది. దీంతో ఆలయ ఈవో, అర్చకుల అభ్యర్థన మేరకు 2020లో స్థపతి దేవస్థానాన్ని సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు. అష్టభుజ వీరభద్రస్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయాలని, అలాగే మూల విరాట్ విగ్రహం చేయి భిన్నంగా ఉన్నందున దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆమోదం పొంది పాత విగ్రహం కొలతలతో కొత్త విగ్రహం చేయించి దేవాలయ పునర్నిర్మాణం, వీరభద్రస్వామి పాత విగ్రహం కొలతలతో కొత్త విగ్రహం చేయించి పునఃప్రతిష్ఠించాలని, పాతవిగ్రహాన్ని పురావస్తు శాఖ వారికి అప్పగించాలని సూచించారు.



విగ్రహం తొలగించి ఉన్న పీఠం



వీరభద్రస్వామి విగ్రహం (ఫైల్)

కాగా, దేవస్థాన ఈవో, అర్చకులు ఉన్నతాధికారుల ఆమోదం తీసుకున్నారా? లేకుండానే విగ్రహాన్ని ఎక్కడికైనా తరలించారా? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఎక్కడికి తరలించారో తెలపాలని ఈవోను పలుమార్లు భక్తులు కోరినా ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందంటున్నారు. భక్తుల విశ్వాసం, ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం కలిగిన వీరభద్రుడి విగ్రహం అదృశ్యానికి సంబంధించి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పాత విగ్రహాన్ని స్వాధీనం చేసుకొని గుట్టపైనే మరో చోట ఉంచాలని, కొత్తవిగ్రహం తయారు చేయించి పునఃప్రతిష్ఠ జరిగేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయ కమిషనర్‌ను భక్తులు కోరతున్నారు.

విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



మెట్టురామలింగేశ్వరస్వామి దేవస్థానం వీరభద్రస్వామి కనిపించకుండా పోవడం కుట్రపూరితచర్య. ఇది భక్తుల మనోభావాలను దెబ్బ తీసింది. తక్షణమే దేవాదాయ శాఖ మంత్రి, అధికారులు ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. వీరభద్రుడి విగ్రహాన్ని స్వాధీనం చేసుకొని పునఃప్రతిష్ఠించాలి.

\- పల్లపు అశోక్, దేవాలయ పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్

విశ్వవాలీ ప్లేస్కూల్‌లో ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే



విద్యార్థులకు ఫ్రెండ్‌షిప్ బాండ్ ధరింపచేస్తున్న ప్రిన్సిపాల్ తిరుమలారెడ్డి

హనుమకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జవహర్ కాలనీలోని విశ్వవ్యాలీ ప్లేస్కూల్‌లో శనివారం ఫ్రెండ్‌షిప్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ఫ్రెండ్‌షిప్ బాండ్లను ధరింపచేశారు. ఈ సందర్భంగా స్నేహం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు పరస్పరం స్నేహంగా ఉండాలని ఉద్బోధించారు. ఫ్రెండ్‌షిప్‌డేను పురస్కరించుకొని విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. స్వీట్లను పంచుకున్నారు. స్నేహానికి గుర్తుగా కరచాలనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవ్యాలీ ప్లేస్కూల్ ప్రిన్సిపాల్ తిరుమలారెడ్డి, డైరెక్టర్లు విజయ్, జగదీశ్వర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక హింసను అరికట్టాలి

కేయూ క్యాంపస్ ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకూ మహిళలు, చిన్నారులపై లైంగిక హింస పెరుగుతోందని, హింస నిర్మూలనకు పాటుపడాలని హనుమకొండ డీఐఈఓ గోపాల్ ఉద్బోధించారు. శనివారం హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో ఎన్ఎస్ఎస్, వరంగల్ భరోసా సెంటర్ సంయుక్తంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్, భరోసా సెంటర్ కౌన్సిలర్ ఐ.సమలతలు హాజరై మాట్లాడారు. మహిళ రక్షణకు పోలీస్‌శాఖతో ఆధ్వర్యంలో భరోసా సంస్థ పనిచేస్తోందన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుని రక్షణ పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, భరోసా సపోర్టు పర్సన్ కె.రజిత, కైలాస్‌షేర్ ఎన్జీవోస్ ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్.జమున, బి.జగన్, కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, డి.రవి, కె.రేణుక తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ దృష్టికి చేనేత సమస్యలు

బాలసముద్రం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని చేనేత కార్మికులు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఆయన స్వగృహంలో కలిసి వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు బోర్డు చైర్మన్ మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. ఆగస్టు 7న దేశవ్యాప్తంగా ప్రతీ ఏటా జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేత సహకార సంఘాలు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించకుండా కార్మికులను బజారున పడేశారని వన్నాల ఆరోపించారు. చేనేత కార్మికులకు చేతినిండా పనిలేకపోవడంవల్ల పోచంపల్లి, సిరిసిల్ల, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పుష్కర కాలం నుంచి సుమారు 800 మంది కార్మికులు ఆకలి చావులకు గురయ్యారని శ్రీరాములు ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత రంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని వారు దత్తాత్రేయకు విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికులు దిగుమతి చేసుకుంటున్న సిల్క్, నూలు, రవాణా, తదితర సుంకాల నుంచి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు గౌరవ సలహాదారుడు వేముల సదానందం, నేత, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాబురావు, బీజేపీ రాష్ట్ర పద్మశాలి నాయకుడు కర్నాటి ధనుంజయ ఉన్నారు.



మాజీ గవర్నర్ దత్తాత్రేయకు వినతిపత్రం ఇస్తున్న శ్రీరాములు తదితరులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా జడ్జి పట్టాభిరామ్

హసన్‌పర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి పట్టాభిరామ్ అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ హనుమకొండ ఆధ్వర్యంలో పోష్ (పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ)చట్టం-2013పై అవగాహన కల్పించారు. జడ్జి పట్టాభిరామ్, పోష్ కమిటీ చైర్మన్, కేయూ పాలక మండల సభ్యురాలు అనితారెడ్డి, జిల్లా లీగల్ సెల్ సెక్రటరీ క్షమాదేశ్‌పాండే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

ముందుగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. సమస్య వచ్చినప్పుడు మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు సమస్యలు వస్తే తమను తాము ఎలా రక్షించుకోవాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో పోష్ చట్టం ద్వారా అర్థం చేసుకొని ఎదుర్కోగలుగుతారన్నారు. పోష్ కమిటీ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి మాట్లాడుతూ.. ఇది మహిళలకు మంచిగా ఉపయోగపడే కార్యక్రమమన్నారు. మహిళలు తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచబడుతాయన్నారు. జిల్లా లీగల్ సెల్ సెక్రటరీ క్షమాదేశ్‌పాండే మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న మహిళల కోసం జిల్లా లీగల్ సెల్ సర్వీసు అండగా ఉంటుందన్నారు. ఈ సంస్థ ద్వారా మహిళలకు జరిగే అన్యాయాలపై ఉచిత న్యాయ సేవను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, రామలింగం, శ్రావణ స్వాతి, ఏవో వేణుగోపాలస్వామి, మహిళా ప్రొఫెసర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పట్టాభిరామ్

జనగామ కలెక్టర్ 'పుస్తకాంజలి'



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న కలెక్టర్

పుట్టిన రోజు సందర్భంగా వినూత్న కార్యక్రమం

జనగామ కల్చరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పుస్తకాలను, భావాలను పంచుకునే ఓ జ్ఞానపథంగా జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం తన జన్మదినాన్ని పురస్కరించుకుని 'పుస్తకాంజలి' పేరుతో ప్రభుత్వ పాఠశాలలు, గ్రంథాలయాలకు పుస్తకాలను అందించే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని యశ్వంతాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండు వేల రూపాయల విలువైన పుస్తకాలను అందించారు. అక్కడే జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కలెక్టర్ చొరవతో త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసే లైబ్రరీలు పిల్లలకు బోరుగా కాకుండా ఇక నుంచి ఆసక్తి రేకెత్తించే స్థలాలుగా మారనున్నాయి. ఈ దిశగా అక్కడ రంగుల చిత్రాలతో నిండిన కథల పుస్తకాలు, ఇంగ్లీష్ శబ్ద సంపద షీట్లు, నీతి కథలు, కామిక్స్ డిక్షనరీలు, అందరూ అంగీకరించే శాస్త్రీయ భావనలతో మూఢనమ్మకాలను తొలగించే విజ్ఞాన శాస్త్ర పుస్తకాలు ఈ లైబ్రరీలో ఏర్పాటు చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

నేడు కేయూ న్యాయ కళాశాలలో చర్చావేదిక

కేయూ క్యాంపస్ ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాలలో ఆదివారం తెలంగాణ పౌర స్పందన రాష్ట్ర కమిటీ నేతృత్వంలో విద్యలో అంతరాలు అనే అంశంపై చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు ఆగస్టు 3న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు కేయూ న్యాయ కళాశాలలో చర్చావేదిక జరుగుతోందని వెల్లడించారు.

యాదవ కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

వడ్డేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నిర్మించే ఇంటిగ్రేటెడ్ యాదవ కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్ కోరారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. హనుమకొండలో ఇంటిగ్రేటెడ్ యాదవ భవనంతో పాటు శ్రీకృష్ణ మందిరం, వసతి గృహానికి ప్రభుత్వ భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహా సభ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బంక సంపత్ యాదవ్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, మామిండ్ల రాజు యాదవ్, యాదవ మహాసభ సీనియర్ నాయకులు బొజ్జ సమ్మయ్య, కాశబోయిన దూడయ్య, బొజ్జ రవీందర్, బనుక సిద్ధిరాజు, దొంగల కుమార్, బోయిని భిక్షపతి, బొంగు రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న యాదవ సంఘం నేతలు

'రెడ్‌క్రాస్' సేవలు అభినందనీయం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- వయోవృద్ధుల డేకేర్ సెంటర్ ప్రారంభం

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ పాలకవర్గం సేవలు అభినందనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో వయోవృద్ధుల కోసం రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేసిన డేకేర్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 37 డేకేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోనే మొట్టమొదటగా హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. రెడ్‌క్రాస్ సేవలకు పాలకవర్గం మరింత తోడ్పాటునందించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని రెడ్‌క్రాస్ సొసైటీని సందర్శించేవిధంగా చూస్తానని అన్నారు. అనంతరం తలసేమియా వ్యాధి పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులను చేనేత కళాకారులు తయారు చేసిన టవల్స్‌తో సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో మేన శ్రీను, డీఎంహెచ్‌వో అప్పయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి డేకేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



• విన్నర్



వీఎఫ్ఎక్స్‌తో
దర్శకులకు స్వేచ్ఛ వచ్చింది

'హనుమాన్' గుర్తుందా? ఆ సినిమాలో హనుమంతుడి విగ్రహం... ఆ చుట్టుపక్కల కొండలు.. చిన్న గ్రామం గుర్తున్నాయా? అవన్నీ కంప్యూటర్ ద్వారా తయారుచేసి దృశ్యాలని అని చాలామందికి తెలియదు. వీఎఫ్ఎక్స్ అని అందరూ సాంకేతిక పరిభాషలో పిలుచుకొనే ఈ దృశ్యాలను తెరకు ఎక్కించింది... హైదరాబాద్‌కు చెందిన 'హేలోహ్యూస్' అనే కంపెనీ. 'హనుమాన్' చిత్రంలో స్పెషల్ ఎఫెక్ట్స్‌కు తాజాగా జాతీయ అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో 'హేలోహ్యూస్' చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ పవన్ వీరమనేని... 'నవ్య'తో మాట్లాడారు.

కంప్యూటర్ జనరేటెడ్ ఇమేజ్ (సీజీఐ)... విజువల్ ఎఫెక్ట్స్ ... గ్రాఫిక్స్ ఇలా రకరకాలుగా అంటారు కదా!

అన్నీ ఒకటే. కంప్యూటర్ ద్వారా తయారుచేసే దృశ్యాలే వీఎఫ్ఎక్స్. దర్శకుడి ఊహకు వాస్తవ రూపం కల్పించేది, ఇవి నిజమని భ్రమించేలా చేసేదీ వీఎఫ్ఎక్స్.

వీటిని మన తెలుగు సినిమాల్లో చాలా కాలంగా వాడుతున్నారు కదా..!

పూర్వకాలం అనేక సినిమాల్లో ఈ తరహా సన్నివేశాలు ఉండేవి. 'మాయాబజార్, కీలుగుర్రం'... విఠలాచార్యగారు తీసిన అనేక సినిమాల్లో వీటిని మనం చూడవచ్చు. మిగిలిన భాషలతో పోలిస్తే మన దగ్గరే ఇలాంటి సన్నివేశాలు ఎక్కువ. ఆ సమయంలో కంప్యూటర్లు లేవు కాబట్టి సెట్లు వేసి కెమెరా ట్రిక్స్‌తో మనకు ఆ భావన కలిగించేవారు. ఆ తర్వాతి కాలంలో సాంఘిక సినిమాలు రావటం మొదలుపెట్టాక వీటిని వాడటం మానేశారు. దర్శకుడు రాజమౌళి తీసిన 'మగధీర' నుంచి ఈ ట్రెండ్ మళ్లీ మొదలయింది. 'మగధీర'లో కనిపించే కోటలన్నీ వీఎఫ్ఎక్స్‌లో రూపొందించినవే! వాటిని 'మకుటా' అనే కంపెనీలో రూపొందించాం. నేను కూడా మొదట ఆ కంపెనీలోనే పనిచేసేవాడిని. ఆ తర్వాత కాలంలో 'బాహుబలి, బాహుబలి2'కు సంబంధించిన వీఎఫ్ఎక్స్‌లు కూడా అక్కడే చేశాం. ఆ తర్వాత నేను విదేశాలకు వెళ్లిపోయాను. హాలివుడ్‌లో పనిచేశాను. మళ్లీ హనుమాన్ సమయానికి తిరిగి వచ్చాను.

దేశంలోనే తొలి కంపెనీ...

డిజిటల్ డబుల్ టెక్నాలజీ... మా దగ్గర, షారూక్‌ఖాన్‌కు చెందిన 'రెడ్ చిల్లీస్' సంస్థ దగ్గర మాత్రమే ఉంది. మన దగ్గర ఫొటో జామెట్రీ అనే కొత్త టెక్నాలజీ కూడా ఉంది. దీనిలో వంద కెమెరాలు ఉంటాయి. ఒక వ్యక్తిని మధ్యలో కూర్చోబెడితే- అతని మొహంలోని అణువణువూ నమోదు అవుతుంది. ఈ విజువల్స్ ఆధారంగా ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌తో ఒక మెష్‌ను క్రియేట్ చేస్తాం. దీనిని ఆ తర్వాత మనకు ఎలా కావాల్సి వస్తే అలా వాడుకోవచ్చు. ఇదే విధంగా మన దగ్గర బాడీ మోషన్ కేప్చర్ టెక్నాలజీ కూడా అందుబాటులో ఉంది. చాలా కంపెనీల దగ్గర హార్డ్‌వేర్ ఉంటుంది. కానీ సాఫ్ట్‌వేర్ ప్రాసెసింగ్ కోసం ఇతర కంపెనీల మీద ఆధారపడాలి. మన దగ్గర సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రెండూ ఉన్నాయి. ఈ తరహా కంపెనీ దేశంలో మరొకటి లేదు.

'విశ్వంభర' అద్భుతం...

'విశ్వంభర' చిత్రంలో 80 శాతం వీఎఫ్ఎక్స్ ఉంటాయి. 'క్లాష్ ఆఫ్ టైటాన్స్' వంటి హాలీవుడ్ సినిమాల స్థాయిలో దృశ్యాలు ఉంటాయి. ఇప్పటిదాకా మన దేశంలో ఇలాంటి వీఎఫ్ఎక్స్ షాట్స్ ఏ సినిమాల్లోనూ రాలేదు. ఈ సినిమా టీజర్ అవుట్‌పుట్ సరిగ్గా రాలేదు. దానికి సమయాభావమే కారణం. ఆ తర్వాత అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నాం. ఈ సినిమా వీఎఫ్ఎక్స్ షాట్స్ 'కల్కి, బాహుబలి' స్థాయిలో ఉంటాయి. వాటిని మించిపోతాయి కూడా!

అంటే వీఎఫ్ఎక్స్ ఒరవడిని ప్రవేశపెట్టింది రాజమౌళే అనవచ్చా?

'మగధీర' నుంచి వీఎఫ్ఎక్స్ వాడటం మళ్లీ మొదలయింది. ఈ సినిమా తర్వాత అందరూ తమ సినిమాలో ఏదో ఒకచోట వాడటం మొదలుపెట్టారు. దీనికి కొన్ని కారణాలున్నాయి. ఉదాహరణకు మన పార్లమెంట్ నేపథ్యంలో ఒక సీను తీయాలనుకుందాం. అక్కడ షూటింగ్‌కు అనుమతి దొరకటం కష్టం. అందువల్ల దానిని గ్రీన్‌మ్యాట్ లేదా బ్లూమ్యాట్‌లో షూట్ చేస్తారు. ఆ తర్వాత ఈ సీన్లకు వీఎఫ్ఎక్స్ ద్వారా పార్లమెంట్ దృశ్యాలు కలుపుతాం. ఇంకో ఉదాహరణ చెబుతాను. 'థగ్‌లైఫ్' సినిమాలో చూపించిన మంచుకొండలు వీఎఫ్ఎక్స్ ద్వారా రూపొందించినవే!

హనుమాన్ సినిమాకు అవార్డు వచ్చింది కదా..! ఈ సినిమాలో వీఎఫ్ఎక్స్ ప్రత్యేకతలేమిటి?

ఆ సినిమా మా దగ్గరకు వచ్చే సమయానికి 70 శాతం షూటింగ్ పూర్తయిపోయింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ తనకు కావాల్సిన అవుట్‌పుట్ గురించి స్పష్టంగా చెప్పాడు. అప్పుడు ఒక టీజర్ తయారుచేశాం. దానికి చాలా మంచి స్పందన వచ్చింది. ప్రేక్షకుల్లో ప్రాజెక్టు పట్ల కొత్త క్రేజ్ వచ్చింది. దాంతో మిగిలిన 30 శాతం షూటింగ్ పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. వీఎఫ్ఎక్స్‌కు అదనపు బడ్జెట్ కేటాయించారు. ఈ సినిమాలో వీఎఫ్ఎక్స్ షాట్స్ అన్నీ చాలా కొత్తగా ఉంటాయి. లొకేషన్స్ ఎవరూ ఎప్పుడూ చూడనివే! రంగులు కూడా ఆహ్లాదకరంగా ఉంటాయి. మంచి వీఎఫ్ఎక్స్ షాట్స్‌కు.. బాగాలేని వీఎఫ్ఎక్స్ షాట్స్‌కు తేడా అదే! మేము రూపొందించే షాట్స్ అన్నీ కాంతివంతంగా కనిపిస్తూ ఉంటాయి. వీటినే ప్రేక్షకులు ఇష్టపడతారు. ఉదాహరణకు 'ఆదిపురుష్'లో వీఎఫ్ఎక్స్ షాట్స్ తీసుకుందాం. చీకటిలో కప్పేసినట్లు ఉంటాయి.

వీఎఫ్ఎక్స్‌కు విపరీతంగా ఖర్చు అవుతుందా?

చేయాల్సిన పని ఆధారంగా ఉంటుంది. కేవలం బ్యాక్‌గ్రౌండ్‌ను మార్చాలంటే పెద్ద ఖర్చు కాకపోవచ్చు. మొత్తం బ్యాక్‌గ్రౌండ్ రూపొందించాలంటే సమయం పడుతుంది. దీనివల్ల ఖర్చు పెరుగుతుంది. చేయాల్సిన పని ఎంత సంక్లిష్టంగా ఉంటే ఖర్చు అంత పెరుగుతూ వెళ్తుంది. విజువల్స్ చేసిన తర్వాత ఫైనల్ అవుట్‌పుట్ రావాలంటే, వాటిలో ఉన్న లేయర్స్‌ను కలపాలి. దానిని రెండరింగ్ అంటారు. ఇది ఒక సన్నివేశానికి అరగంట పట్టవచ్చు. సన్నివేశం సంక్లిష్టంగా ఉంటే ఐదు గంటలు కూడా పట్టవచ్చు. దీనివల్ల ఖర్చు పెరుగుతుంది.

ఈ మధ్యకాలంలో 'బాడీ డబుల్స్' అనే మాట ఎక్కువగా వినిపిస్తోంది..?

ప్రతి సినిమాలో స్టోరీ టెల్లింగ్.. హీరో తీసుకొనే రిస్క్.. చాలా కీలకమైన అంశాలు. ఒక కథలో డబుల్ రోల్ ఉందనుకుందాం. ఒకరు 100 కేజీలు ఉండాలి. మరొకరు 50 కేజీలు ఉండాలి. అది సాధ్యం కాదు కాబట్టి ఒకప్పుడు అలాంటి కథలను ఎంపిక చేసుకొనేవారు కాదు. ఇప్పుడు మన దగ్గర ఉన్న అత్యాధునిక టెక్నాలజీతో మనిషిలాంటి మనిషిని తయారుచేయవచ్చు. ఇక రెండో విషయం... హీరో తీసుకొనే రిస్క్.. ఒకప్పుడు హీరోలు తమ ఫైట్లు తామే చేసుకొనేవారు. డూపులు కూడా తక్కువే! కానీ సినిమా బడ్జెట్ పెరిగిపోయిన తర్వాత హీరోకి దెబ్బ తగిలితే చాలా నష్టం వస్తుంది. అందువల్ల ఎక్కువగా డూపుల చేతే ఫైట్లు చేయిస్తున్నారు. మనకు ప్రస్తుతం డిజిటల్ డబుల్ టెక్నాలజీ.. ఫొటో జామెట్రీ వంటివి అందుబాటులోకి వచ్చాయి కాబట్టి డూప్‌లు కూడా సహజంగా కనిపించేలా ఉండేలా మార్చేయవచ్చు. ఈ రెండింటివల్ల దర్శకులకు చాలా స్వేచ్ఛ వచ్చింది. సమయం, బడ్జెట్ ఉంటే వారి ఊహల్లో ఉన్న ఎలాంటి కథనైనా ఇప్పుడు సినిమాగా తీసేయవచ్చు.

వీఎఫ్ఎక్స్‌లలో ఏఐ వినియోగం ఎక్కడిదాకా వచ్చింది?

ఇంకా పూర్తి స్థాయిలో రాలేదు. కమర్షియల్ స్థాయిలో దీనిని వాడాలంటే మరో నాలుగైదేళ్లు పడుతుంది. అప్పటి దాకా చిన్న చిన్న అంశాలలో దీనిని వాడుకోవచ్చు.

అతి పెద్ద ప్రశంస...

మేము రూపొందించిన వీఎఫ్ఎక్స్ షాట్స్‌ను ఒకాయనకు మా ఎండీ చూపించారు. ఆయన ఆ షాట్స్ చూసి- "ఈ ప్లేస్‌కు నేను వెళ్లాను. చాలా బాగుంటుంది" అన్నారట. మాకు అంతకన్నా పెద్ద ప్రశంస ఏముంటుంది?

• సీవీఎల్ఎన్ ప్రసాద్

• సంప్రదాయం

అదనపు హంగులద్దే చంపస్వరాలు!





మహిళల అందాన్ని ఇనుమడింపజేయడానికి అనేక ఆభరణాలు ఉన్నాయి. వీటిలో చెంపస్వరాలు ప్రధానమైనవి. ఒకప్పుడు వీటిని సంప్రదాయ నాట్య కళాకారిణులు ధరించేవారు. ఇవి సాధారణంగా చెవి దుద్దుల నుంచి జడను అనుసంధానం చేస్తూ ఉంటాయి. పూర్వం వీటిని చంపక పుష్పం ఆకారంలోనే రూపొందించేవారు. వీటికి ఉండే గొలుసులు కూడా సన్నంగా ఉండేవి. నృత్యం చేసే సమయంలో ఈ గొలుసుల కదలికలు అదనపు ఆకర్షణగా నిలిచేవి. ఆ తరువాతి కాలంలో చెంపస్వరాలు ఒక తరం నుంచి మరొక తరానికి వచ్చే వారసత్వంగా మారాయి. ఆధునిక జీవనంలో చీరలు ధరించటం తగ్గిన తర్వాత వీటిని ఉపయోగించేవారి సంఖ్య తగ్గింది. కేవలం పండుగల సమయంలో ధరించడానికే పరిమితం అయ్యాయి. కానీ ఈ మధ్యకాలంలో వీటికి ఆదరణ బాగా పెరిగింది. ముఖ్యంగా పెళ్లి సమయంలో చెంపస్వరాలు ధరించని వధువులు ఉండటం లేదు. వధువు అలంకరణలో ఇవి ఒక ముఖ్యమైన భాగంగా మారిపోయాయి. ఒకప్పుడు కేవలం బంగారంతో మాత్రమే తయారు చేసేవారు. ప్రస్తుతం ముత్యాలు, వజ్రాలు, కెంపులు లాంటి వాటితో కూడా వీటిని రూపొందిస్తున్నారు.

• ఖ్యాతి,
ఖ్యాతి డిజైనర్ స్టూడియో హైదరాబాద్, 6300386749

కర్టెన్లను అలాగే వదిలేస్తున్నారా?



ఇంటి కిటికీలకు, ప్రధాన ద్వారానికి వేసే కర్టెన్ల మీద ఎక్కువగా దుమ్ము చేరుతూ ఉంటుంది. వీటిని తరచూ శుభ్రం చేయాలనీ లేనిచో శ్వాసకోశ సమస్యలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. కర్టెన్లను ఎలా శుభ్రం చేయాలో తెలుసుకుందాం...

- రోజూ కర్టెన్లను మెత్తని బ్రష్‌తో తుడుస్తూ దులపాలి. వ్యాక్యూమ్ చేస్తున్నట్లయితే క్లీనర్‌కు బ్రష్‌ను జత చేయాలి. నీళ్లలో ముంచి గట్టిగా పిండిన గుడ్డతో కర్టెన్లను తుడిచినా ప్రయోజనం ఉంటుంది.
- కర్టెన్లను ఎటువంటి ఫ్యాబ్రిక్‌తో తయారు చేశారో పరిశీలించాలి. ఫ్యాబ్రిక్ తీరును బట్టి వాషింగ్ మెషిన్‌లో వేయాలా? చేత్తో ఉతకాలా? అనేది నిర్ణయించుకోవాలి. వాషింగ్ మెషిన్‌లో వేసేటట్లయితే అందులోనే డ్రైయింగ్ చేయకూడదు. అలాచేస్తే కర్టెన్లు ముడతలు పడతాయి.
- వారానికి ఒకసారి కర్టెన్లను మామూలుగా ఉతికితే సరిపోతుంది. సర్ఫ్, షాంపూ, లిక్విడ్ డిటర్జెంట్‌లలో ఒక దాన్ని తీసుకుని తగుమాత్రం బకెట్ నీళ్లలో వేసి బాగా కలపాలి. అందులో కర్టెన్లను గంటసేపు నానబెట్టాలి. మురికి మరీ ఎక్కువగా ఉందనిపిస్తే నీళ్లలో కొద్దిగా బ్లీచింగ్ పౌడర్ కలపవచ్చు. తరవాత కర్టెన్లను మంచినీళ్లతో ఉతికి గాలి తగిలేలా నీడలో ఆరేయాలి.
- కర్టెన్ల మీద ఒక్కోసారి మరకలు ఏర్పడుతూ ఉంటాయి. అర కప్పు వేడి నీళ్లలో రెండు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మరకల మీద వేసి బ్రష్‌తో మెల్లగా రుద్దాలి. తరవాత అనువైన పద్ధతిలో ఉతికేస్తే మరకలు, మురికి వదిలి కర్టెన్లు శుభ్రంగా ఉంటాయి.
- కర్టెన్లను ఉతికేటప్పుడు ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్‌ను ఉపయోగిస్తే అవి పెళుసుబారకుండా ఉంటాయి. వాటి మెరుపుదనం పోకుండా ఉంటుంది.



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
స్టోలెన్: హీస్ట్ ఆఫ్ ది సెంచరీ	వెబ్‌సిరీస్	ఆగస్టు 08
అమెజాన్ ప్రైమ్		
అరేబియా కడలి	తెలుగు సిరీస్	ఆగస్టు 08
జియో హాట్‌స్టార్		
లవ్‌హర్ట్స్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 07
మిక్కీ 17	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 07
సలక్కార్	హిందీ సిరీస్	ఆగస్టు 08
జీ 5		
మోతెవరి లవ్‌స్టోరీ	తెలుగు సిరీస్	ఆగస్టు 08

• జూమ్

కుర్రకారు కలల్లో కొత్త రాణి



ఎలాంటి భావమైనా ముఖంలో ఇట్టే పలికేస్తుంది.
తెర మీద కనిపిస్తే హాలంతా ఆహ్లాదంగా మారిపోతుంది.
నటనలో వైవిధ్యం... ఆకర్షణీయమైన రూపం... భారమైన సన్నివేశమైనా పండించగల సామర్థ్యం...
అన్నీ కలిస్తే అనీత్ పడ్డా. రికార్డులు కొల్లగొట్టి... కనక వర్షం కురిపిస్తున్న 'సయారా' చిత్రంతో ఆమె ఒక్కసారిగా స్టార్ హీరోయిన్ అయిపోయింది.
బాలీవుడ్ సరికొత్త సంచలనం... కుర్రకారు హృదయ స్పందన... అనీత్ 'ఫ్లాష్‌బ్యాక్' ఇది.

అనీత్ పడ్డా ప్రస్తుతం 'సయారా' చిత్రం విజయోత్సవంలో మునిగితేలుతోంది. యాభై కోట్లకు పైబడని బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం బాక్సాఫీస్ ఇప్పటికే నాలుగు వందల కోట్లు దాటిందని అంచనా. ఇందులో తెరంగేట్రం చేసిన హీరో అహానా పాండేకు జతగా అనీత్ నటించింది. 2025లో ఇప్పటివరకు విడుదలైన హిందీ చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన రెండో చిత్రంగా నిలిచింది. మూడేళ్ల కిందట 'సలామ్ వెంకీ'లో చిన్న పాత్రతో వెండితెరకు పరిచయమైన అనీత్... గత ఏడాది వచ్చిన 'బిగ్ గర్ల్స్ డోంట్ క్రై' వెబ్‌సిరీస్‌లో లీడ్ రోల్ పోషించింది. నటనపరంగా అది ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. ఈ సిరీస్ కోసం 'మాసూమ్' అనే పాట రాసి, బాణీ కట్టి, తనే ఆలపించింది. ఈ ఏడాది ఆరంభంలో 'యువ సప్నోం కా సఫర్ సిరీస్'లో నటించిన ఆమెకు స్టార్ డైరెక్టర్ మోహిత్ సూరి 'సయారా'లో అవకాశం లభించింది. ప్రముఖ సంస్థ 'యష్‌రాజ్ ఫిలిమ్స్' దీన్ని నిర్మించింది. విడుదలైన రోజు నుంచి అద్భుతమైన టాక్‌తో దూసుకుపోతోంది 'సయారా'. ఇందులో అనీత్ అందానికే కాదు... ఆమె నటనకు, స్క్రీన్ ప్రెజెన్స్‌కు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో పుట్టిన అనీత్‌కు మొదటి నుంచీ నటనపై మక్కువ. అక్కడి 'స్ప్రింగ్ డేల్ సీనియర్ స్కూల్'లో చదివిన ఆమె... ఢిల్లీ 'జీసస్ అండ్ మేరీ కాలేజీ' నుంచి పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ పూర్తి చేసింది. ఒకవైపు చదువుతూనే గ్లామర్ ప్రపంచంలో అవకాశాల కోసం ప్రయత్నించింది. తరువాత ముంబయికి వెళ్లి మోడలింగ్ చేసింది. ప్రకటనల్లో నటించింది.

వీడియో చూసి భావోద్వేగం...



'సయారా'తో అనూహ్య విజయాన్ని అందుకున్న అనీత్ జర్నీనీ, చదువుకొనే రోజుల్లో జ్ఞాపకాలను కలిపి 'స్ప్రింగ్ డేల్ సీనియర్ స్కూల్' ఒక వీడియో విడుదల చేసింది. అందులో టీచర్లు, కలిసి చదువుకున్నవారు, ప్రస్తుత విద్యార్థులు, ప్రిన్సిపాల్, మార్గదర్శకులు... అనీత్‌తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకొంటూ, అభినందనలతో ముంచెత్తారు. ఆ వీడియో చూసిన ఆమె భావోద్వేగానికి లోనైంది.

"నా భావాలను వ్యక్తీకరించడానికి మాటలు రావడం లేదు. ఈ వీడియో చూస్తూ అలా కూర్చొండిపోయాను. ముఖమంతా చిరునవ్వు పరుచుకుంది. ఒక్కసారిగా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నేను పెరిగింది... పెద్దగా కలలు కనడం నేర్చుకున్నది అక్కడే. నా మీద నాకు నమ్మకం రావడానికి ముందే నాలో ప్రతిభ ఉందని చాలామంది నమ్మింది అక్కడే. నా టీచర్లు, మార్గదర్శులు, నాతో చదివినవారు... అందరూ కలిసి ఇచ్చిన ఈ అద్భుతమైన బహుమతిని చూస్తున్నంతసేపూ మధురానుభూతికి లోనయ్యాను. సెట్‌లోకి వెళ్లిన ప్రతిసారీ స్కూల్లో యూనిఫామ్ ధరించి, తరగతి గదిలో కూర్చొని కన్న పగటి కలలు గుర్తుకువస్తుంటాయి. ఆ కలలే ఇప్పుడు నిజమయ్యాయి. నా ప్రతి అడుగులో నన్ను ప్రోత్సహించి, ప్రేమించి, సరైన మార్గంలో నడిపించిన మీవల్లే నేను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నాను. ఒక మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన నేను ఎదిగిన క్రమం మీ అందరినీ గర్వపడేలా చేసిందని ఆశిస్తున్నాను. చదువు ఒక్కటే కాకుండా జీవిత పాఠాలు ఎన్నో నేర్పించిన 'స్ప్రింగ్‌డేల్'ను ఎప్పటికీ మరిచిపోను. త్వరలోనే అందరినీ కలుస్తాను. నన్ను గుర్తు చేసుకున్నందుకు, నా విజయాన్ని పంచుకున్నందుకు కృతజ్ఞతలు" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన ఆ వీడియోను ఉద్దేశించి వ్యాఖ్యానించింది అనీత్. సంగీతపరంగానూ సూపర్ హిట్ అయిన 'సయారా' తరువాత ఆమె చేపట్టబోయే ప్రాజెక్ట్ గురించి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

సెట్‌లోకి వెళ్లిన ప్రతిసారీ స్కూల్లో యూనిఫామ్ ధరించి, తరగతి గదిలో కూర్చొని కన్న పగటి కలలు గుర్తుకువస్తుంటాయి. ఆ కలలే ఇప్పుడు నిజమయ్యాయి. నా ప్రతి అడుగులో నన్ను ప్రోత్సహించి, ప్రేమించి, సరైన మార్గంలో నడిపించిన మీవల్లే నేను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నాను.

బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో ధర్నా చేయాలి

- ఇందిరాపార్క్ వద్ద వారి ఆందోళనలు అత్యంత బాధాకరం
- 5, 6 తేదీల్లో ఢిల్లీ ధర్నాకు అన్ని పార్టీల వారు రావాలి: పొన్నం



గోల్నాక/పంజాగుట్ట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కాకుండా ఇందిరాపార్క్ వద్ద బీజేపీ నేతలు ఆందోళనలు చేయడం అత్యంత బాధాకరం. చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో ధర్నా చేసి కేంద్రంలోని వారి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి' అని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీ ప్రధానియే ఉన్నారని బీజేపీ నేతలు చెప్పడం మాని బీసీ రిజర్వేషన్లకు వారి అధిష్ఠానాన్ని ఒప్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. శనివారం హైదరాబాద్ ఛే నెంబర్‌లోని మహారాణాప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో అంబర్‌పేట నియోజకవర్గానికి సంబంధించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని.. బీసీ రిజర్వేషన్ల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా పట్టుదలతో ఉన్నారని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఈ నెల 5, 6వ తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే ధర్నా కార్యక్రమానికి అన్ని పార్టీల వారు రావాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ నేతలు రాజకీయాలు మానుకోవాలని.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కాంగ్రెస్ నేతలు వి.హనుమంతరావు, రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు పోరాటమే మార్గం..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం సంఘటిత పోరాటమే ఏకైక మార్గమని పలు పార్టీలు, బీసీ సంఘాలు, కుల సంఘాల నేతలు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటు సమావేశాల్లో ఆమోదించి, 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టీజేఎస్ సమావేశం నిర్వహించింది. ఇందులో కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, టీజేఎస్ ఉపాధ్యక్షుడు పీఎల్ విశ్వేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలు బీసీ, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొని మాట్లాడారు.

గురుకులాల్లో నిత్యావసరాల సరఫరా, క్యాటరింగ్‌కు టెండర్లు

హైదరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1,023 గురుకుల పాఠశాలలు, కళాశాలలకు అవసరమైన నిత్యావసరాల సరఫరా, క్యాటరింగ్ కాంట్రాక్టులకు సంబంధించి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఇందుకు నోటిఫికేషన్ ఇటీవల జారీ అవ్వగా ఆగస్టు 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆగస్టు 23న టెండర్ల కేటాయింపు చేసి 28న వర్క్ ఆర్డర్లు ఇస్తారు. వర్క్ ఆర్డర్ పొందిన కాంట్రాక్టర్లు సెప్టెంబరు 1 నుంచి సేవలను అందించాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల ఎంపిక ప్రక్రియ జిల్లా కొనుగోలు కమిటీ(డీపీసీ)ల ఆధ్వర్యంలో జరగనుంది. కాగా, గతంలో మాదిరిగా కాకుండా ఈసారి జిల్లా, మండల స్థాయిల్లో మూడు విభాగాలుగా టెండర్లు నిర్వహించేలా విభజించారు. టెండర్లలో పాల్గొనే వారు ఆసక్తి ఉన్న ప్రతి విభాగానికి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాలి. అయితే, కాంట్రాక్టు ఏజెన్సీలు ఒకే టెండర్ ఫారమ్ ద్వారా వేర్వేరు విద్యా సంస్థలకు సేవలందించడానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. ఈ విధానం మండల మహిళా సమాఖ్యలు, యువజన సంఘాలు, స్థానిక వ్యాపారులకు విస్తృత అవకాశాలు కల్పిస్తుందని ప్రభుత్వం చెబుతోంది. కాగా, ఆహార పదార్థాల సేకరణ, నాణ్యతకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని గురుకుల సొసైటీల్లో ఒకే విధమైన వ్యవస్థ ఉండేలా చూసుకునేందుకు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి నేతృత్వంలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

బీజేపీని బద్నాం చేయడానికి కుట్ర

బీసీ రిజర్వేషన్లపైనా రేవంత్‌రెడ్డి రాజకీయం.. అమలు చేయడం చేతగాక కేంద్రంపై నిందలు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యలు
- రాహుల్ మెప్పు కోసమే స్థాయికి మించి మాటలు
- సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం
- బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలంటూ మహాధర్నా



ఇందిరా పార్కు వద్ద మహా ధర్నాలో అభివాదం చేస్తున్న రాంచందర్ రావు, కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ తదితరులు

కవాడిగూడ/హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీని బద్నాం చేయడానికే సీఎం రేవంత్ ఢిల్లీ వెళుతున్నారని, బీసీ రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. బీసీలకు మాత్రమే 42శాతం రిజర్వేషన్‌ను వర్తింపజేయాలని, అందులో ముస్లింలకు ప్రతిపాదించిన 10శాతాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడం చేతగాని రేవంత్.. కేంద్రంపై నిందలు మోపుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌కు ఢిల్లీ వెళ్లడం అలవాటేనని, కానీ.. ఆయనకు రాహుల్ అపాయింట్‌మెంట్ మాత్రం దక్కడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ కర్ణాటకలో మాదిరిగానే తెలంగాణలోనూ బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీసీల హక్కులను మజ్లిస్ హరిస్తుంటే, కాంగ్రెస్ కాలరాస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ నుంచి బీసీలను దూరం చేసేందుకే కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. "బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు తెచ్చింది మీరు.. అమలు చేయాల్సిన బాధ్యత కూడా మీదే.. మాపై రాళ్లేయడం ఏంటి? కేంద్రంలో 27 మంది ఓబీసీలు మంత్రులుగా ఉన్నారు. దేశవ్యాప్తంగా ఐదు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బీసీ ముఖ్యమంత్రులు ఉన్నారు.. మీ హయాంలో ఒక్క బీసీనైనా సీఎంను చేశారా?" అని కాంగ్రెస్‌ను నిలదీశారు. రాహుల్ మెప్పు కోసమే సీఎం రేవంత్‌రెడ్డి స్థాయికి మించి మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ... విశ్వబ్రాహ్మణులు కన్వర్టెడ్ బీసీలా? లంబాడాలు కన్వర్టెడ్ ఎస్టీలా?.... సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏది పడితే అది మాట్లాడితే ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు. దశాబ్దాల తరబడి అధికారంలో ఉండి.. బీసీ గణన చేయనందుకు పార్లమెంట్ ఎదుట రాహుల్‌గాంధీ ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. రాహుల్, కేసీఆర్ ఎప్పుడూ పరస్పరం విమర్శలు చేసుకోరని, బీఆర్ఎస్ వాళ్లు ఎప్పుడైనా తమ వద్దకే వస్తారన్నది రాహుల్ నమ్మకమని తెలిపారు. "రాష్ట్రంలో ఏం మార్పు వచ్చింది? అవినీతి లోనా? మోసం చేయడంలోనా?.. తెలంగాణ ఎందులో ఆదర్శం? మతపరమైన రిజర్వేషన్ల అమలులోనా? బీసీల గొంతుకోయడంలోనా?.. ఈ ప్రశ్నలకు రాహుల్, రేవంతే సమాధానం చెప్పాలి. బీసీలకు వ్యతిరేకంగా రాహుల్, రేవంత్ కుట్ర పన్నుతున్నారు" అని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో సాగిన దందాలు.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ముస్లింలకు ప్రతిపాదించిన 10శాతం తొలగించి బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించారు. రిజర్వేషన్ల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి బీసీలను నిలువునా మోసం చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. 20నెలలు దాటిపోయినా ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీసీల కళ్లల్లో మట్టికొట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు ఆ పార్టీకి లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని మోదీ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ముస్లింలకు పదిశాతం రిజర్వేషన్లు ఎత్తివేసి, బీసీలకు మాత్రమే 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ పదేళ్ల పాటు బీఆర్ఎస్ బీసీలను మోసం చేసిందని, ఇప్పుడు అదే దారిలో కాంగ్రెస్ నడుస్తుందన్నారు. ధర్నాలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, మాజీ ఎంపీలు బూరనర్సయ్యగౌడ్, బీబీ పాటిల్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు యెండల లక్ష్మీనారాయణ, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో వ్యక్తిగత నిర్ణయాలుండవు

- పార్టీ ఆదేశాలను శిరసావహిస్తాం
- పదవుల కోసం ఎప్పుడూ పాకులాడం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



చొప్పదండి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో వ్యక్తిగత నిర్ణయాలు ఉండవని, ఎవరికి ఏ బాధ్యత అప్పగించాలనేది పార్టీ నాయకత్వమే నిర్ణయిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాకు ఈ పదవి కావాలి, ఆ పదవి కావాలంటూ ఎన్నడూ పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తేబోమని తెలిపారు. బీజేపీ క్రమశిక్షణ ఉన్న పార్టీ అని, అధిష్ఠానం ఏది చెబితే అది శిరసావహించి పని చేస్తామన్నారు. తనను మంత్రి పదవి నుంచి విముక్తి చేయాలంటూ అడిగానని వచ్చిన వార్తలపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించి మాట్లాడుతూ.. బీజేపీలో వ్యక్తిగత నిర్ణయాలు ఉండవని, ఎవరికి ఏ బాధ్యత అప్పగించాలనేది పార్టీ నాయకత్వం ఆలోచిస్తుందన్నారు. పదవుల కోసం తాము ఎప్పుడూ పాకులాడబోమని అన్నారు. దయచేసి ఇలాంటి తప్పుడు వార్తలు రాయొద్దని మీడియాను కోరుతున్నానని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను చూసి బీజేపీ కూడా అలాగే ఉంటుందని భావిస్తున్నారేమో, బీజేపీలో సమష్టి నిర్ణయాలుంటాయని వాటిని అమలు చేసే బాధ్యత కార్యకర్తలుగా తమపై ఉంటుందని బండి సంజయ్ అన్నారు.

ఫర్టిలిటీ కేంద్రాలపై నియంత్రణ

ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు.. 10 రోజుల్లో నివేదికివ్వాలని ఆదేశం.. గ్రేటర్‌లో 70కిపైగా కేంద్రాల్లో తనిఖీలు

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పిల్లల కోసం తపిస్తున్న దంపతుల ఆశను ఆసరాగా చేసుకొని, ఐవీఎఫ్, సరోగసిని వ్యాపారంగా మార్చి దందాకు పాల్పడుతున్న సంతాన సాఫల్య కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆ శాఖా మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సృష్టి తరహా ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సంతాన సాఫల్య కేంద్రాలలో తనిఖీలు, నియంత్రణ కోసం ఉన్నతాధికారులతో కమిటీని నియమించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శికి మంత్రి సూచించారు. ఈ మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నేతృత్వంలో ఆరోగ్యశ్రీ సీఈవో, వైద్యవిద్య సంచాలకులు సభ్యులుగా కమిటీని నియమిస్తూ హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐవీఎఫ్ కేంద్రాలు చట్టాలను ఉల్లంఘించి అనైతిక చర్యలకు పాల్పడుతున్నట్లు సర్కారు దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఐవీఎఫ్, ఫర్టిలిటీ కేంద్రాల పనితీరును పరిశీలిస్తుంది. ఆయా సెంటర్లకు నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ఉందా, డాక్యుమెంటేషన్ అంతా పక్కాగా ఉందా అన్న విషయాలను నిర్ధారిస్తుంది. ఈ కేంద్రాలపై ఇది వరకు ఏమైనా కేసుల నమోదయ్యాయా, ఏమైనా చర్యలు తీసుకున్నారా, వీటి బారిన పడి ఎవరైనా మోసపోయారా అన్న వివరాలను సేకరించనుంది. అలాగే ఈ కేంద్రాలపై మెడికల్ కౌన్సిల్ ఏమైనా చర్యలు తీసుకుందా అన్న వివరాలను పరిశీలిస్తుంది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వాటిని నివారించేందుకు ఇప్పటికే ఉన్న నియమ నిబంధనలేమిటి, పర్యవేక్షణ పద్ధతులేంటి..? అన్న దానిపై సమీక్ష నిర్వహిస్తుంది. పై అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేసి, సమగ్ర నివేదిక అందించాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

తొలి రోజు 70కి పైగా కేంద్రాల్లో తనిఖీలు...

రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రేటర్ పరిధిలోని ఫర్టిలిటీ కేంద్రాలలో శనివారం తనిఖీలు ప్రారంభమయ్యాయి. సుమారు 70కి పైగా కేంద్రాలను తనిఖీ చేసినట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. గ్రేటర్ పరిధిలో 157 ఫర్టిలిటీ కేంద్రాలున్నాయి. మొత్తం 35 బృందాలను రంగంలోకి దించారు. ఒక్కో తనిఖీ బృందం రోజుకు సగటున 4-5 కేంద్రాలను తనిఖీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. కాగా, మొదటిరోజు ఒకటి రెండు కేంద్రాలు తనిఖీ బృందాలకు పూర్తిగా సహకరించలేదని సమాచారం. ఆది, సోమవారాల్లో మొత్తం కేంద్రాల్లో తనిఖీల పర్వం ముగుస్తుందని ఉన్నతాధికారులు వెల్లడించారు. మంగళవారం ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు వారు తెలిపారు. కాగా, ఒకవైపు ఈ తనిఖీలు కొనసాగుతుండగానే, మరోవైపు ప్రభుత్వం కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఒక కమిటీని వేసింది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

రణమున యముడు



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ'. డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఇందులో ఓజాస్ గంభీరా అనే శక్తిమంతమైన పాత్రను పవన్ కల్యాణ్ పోషిస్తున్నారు. ఇమ్రాన్ హష్మీ విలన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పతాకస్థాయికి తీసుకెళ్లింది. శనివారం ఈ చిత్రం నుంచి మొదటి పాట 'ఫైర్ స్టార్మ్'ను విడుదల చేశారు మేకర్స్. 'అలలిక కదలక భయపడెలే.. క్షణక్షణమొక తల తెగిపడెలే.. రణమున యముడిక కనపడెలే' అంటూ పవర్‌ఫుల్ పదాలతో సాగిందీ గీతం. అదిరిపోయే ఎలివేషన్స్‌తో ఉన్న ఈ పాట అందరినీ ఆకట్టుకుంటోంది. విశ్వ, శ్రీనివాస మౌళి లిరిక్స్ రాశారు. తమిళ నటుడు శింబు, దీపక్ బ్లూ తదితరులు ఈ గీతాన్ని ఆలపించగా, తమన్ సంగీతం అందించారు. ప్రియాంక మోహన్ హీరోయిన్. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న ప్రేక్షకుల ముందుకు వస్తోందీ చిత్రం.

రెండో భాగం మరింత అలరిస్తుంది



- విజయ్ దేవరకొండ

'తన అన్న శివ కోసం సూరి చేసిన ప్రయాణాన్ని 'కింగ్‌డమ్' తొలి భాగంలో చూశాం. రెండో భాగం కోసం దర్శకుడు గౌతమ్ దగ్గర గొప్ప ఆలోచనలున్నాయి. అది మరింత అద్భుతంగా ఉండబోతోంది' అని విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన చిత్రమిది. ఇటీవలే విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మీడియాతో ముచ్చటించారు.


- సినిమా విడుదలకు ముందు ప్రతి ఒక్క హీరో పైనా ఒత్తిడి ఉంటుంది. 'కింగ్‌డమ్' విడుదలకు ముందు నాపైనా అలాంటి ఒత్తిడి ఉంది. మొదటి షో పూర్తయి హిట్ టాక్ రాగానే చాలా సంతోషం కలిగింది. ఈ చిత్రానికి తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ మంచి ఆదరణ దక్కుతున్నందుకు ఆనందంగా ఉంది.
- అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ డ్రామా అనే లైన్ గౌతమ్ చెప్పినప్పుడు నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది. సినిమాలో బలమైన భావోద్వేగాలు ఉండేలా ఆయన కథను తీర్చిదిద్దారు.
- 'పెళ్లిచూపులు' చిత్రం హిట్టయినప్పుడు మరికొన్ని సినిమాల్లో అవకాశాలు వస్తాయని అనుకున్నాను. కానీ ఇప్పుడు ఒక సినిమా హిట్టయితే, ఆనందం కన్నా మంచి సినిమాలు చేయాలనే బాధ్యత ఎక్కువ ఉంది.
- ఈ సినిమాలో మరింత దృఢంగా కనిపించేందుకు కసరత్తులు చేశాను. నాటి కాలానికి తగ్గట్లు ఆహార్యం, అభినయంలో వైవిధ్యం చూపేందుకు ప్రయత్నించాను. రాహుల్ సాంకృత్యాన్, రవికిరణ్ కోలా దర్శకత్వంలో నా తదుపరి సినిమాలు చేస్తున్నాను.

ఒక తన్మయత్వంలో రచన చేశాను



'బేబీ' సినిమా స్క్రిప్ట్ రాసేటప్పుడు ఒక తన్మయత్వంలో ఉండిపోయేవాణ్ని. హీరో హీరోయిన్ల పాత్రల మానసిక స్థితిని, భావోద్వేగాలను నేను అనుభూతి చెందుతూ రాసేవాణ్ని. ప్రతి సన్నివేశానికి మెరుగులు దిద్దుతూ రెండేళ్ల పాటు కష్టపడి ఈ సినిమా స్క్రిప్ట్‌కు తుదిరూపు ఇచ్చాను. ఇప్పుడు ఈ చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా నాకూ, ఉత్తమ నేపథ్య గాయకుడిగా పీవీఎన్ఎస్ రోహిత్‌కు జాతీయ పురస్కారం దక్కినందుకు ఆనందంగా ఉంది' అని దర్శకుడు సాయిరాజేశ్ అన్నారు. జాతీయ పురస్కారాలకు ఎంపికైన సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం సాయిరాజేశ్‌ను, రోహిత్‌ను సత్కరించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ "బేబీ' సినిమాలో పాట పాడడానికి ముందు నా కెరీర్ చాలా డల్‌గా ఉంది. ఈ చిత్రంలో 'ప్రేమిస్తున్నా' పాటకు అవకాశం రాగానే, చావో రేవో అన్నట్లుగా సాధన చేశాను. ఇప్పుడు ఆ పాటకు జాతీయ పురస్కారం దక్కినందుకు ఎంతో ఆనందంగా ఉంది' అన్నారు.

దేవాతో ఆటలా..



రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన చిత్రం 'కూలీ'. నాగార్జున, ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతి హాసన్ కీలక పాత్రలు పోషించారు. కళానిధి మారన్ నిర్మించారు. ఈనెల 14న సినిమా విడుదలవుతోంది. తెలుగులో ఈ చిత్రాన్ని ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్స్ సంస్థ విడుదల చేస్తోంది. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రధాన పాత్రలను పరిచయం చేసిన విధానం, విజువల్స్ ఆకట్టుకున్నాయి. 'ఈ దేవా గురించి తెలిసి కూడా గేమ్స్ ఆడతావా రా' అంటూ రజనీ చెప్పిన సంభాషణతో ముగిసిన ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేసింది.

నవ్వుల బన్



రాజు జయమోహన్, ఆద్యప్రసాద్, భవ్య త్రిఖ ప్రధాన పాత్రధారులుగా రాఘవ్ మిర్దత్ తెరకెక్కించిన వినోదాత్మక చిత్రం 'బన్ బట్టర్ జామ్'. సురేశ్ సుబ్రమణియన్ నిర్మించారు. ఇప్పటికే తమిళ్‌లో విడుదలై విజయం సాధించిందీ చిత్రం. ఈనెల 8న సినిమాను సీహెచ్ సతీశ్‌కుమార్ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా టీజర్‌ను దర్శకుడు మెహర్ రమేశ్ విడుదల చేశారు. సినిమా ఘనవిజయం సాధించాలని కోరుతూ, చిత్రబృందానికి అభినందనలు తెలియజేశారు.

సైంటిఫిక్ థ్రిల్లర్



హీరో శ్రీరామ్ ముఖ్యపాత్రలో జాన్ జక్కి తెరకెక్కించిన సైంటిఫిక్ థ్రిల్లర్ మూవీ 'మాతృ'. సుగి విజయ్, రూపాలీ భూషణ్ జంటగా నటించారు. శ్రీ పద్మిని సినిమాస్ బేనర్‌పై బూర్లె శివప్రసాద్ నిర్మించారు. ఈనెల 8న థియేటర్లలో విడుదల అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మాట్లాడుతూ 'ఇప్పటికే రిలీజ్ చేసిన చిత్ర కంటెంట్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని నమ్ముతున్నాం' అని అన్నారు.

బిజినెస్ ప్లస్

వరంగల్ ● ఆదివారం 3 ఆగస్టు 2025

యూపీఐలో వచ్చిన మార్పులేమిటంటే..!

మీరు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి డిజిటల్ చెల్లింపుల యాప్‌లు వాడుతున్నారా..? ఈ యాప్‌ల ద్వారా యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను వినియోగించుకుంటున్నారా..? అయితే, ఈ వార్త మీ కోసమే. ఎందుకంటే ఈ నెల 1 నుంచే యూపీఐ సేవల్లో కొన్ని మార్పులు వచ్చాయి. అయితే, ఈ మార్పులతో రోజువారీ చెల్లింపులపై ఎలాంటి ప్రభావం ఉండనప్పటికీ, యూపీఐ సేవల వినియోగంపైన మాత్రం యూపీఐ అభివృద్ధి, నిర్వహణ సంస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొన్ని పరిమితులను విధించింది. ఆ వివరాలు..

బ్యాంక్ బ్యాలెన్స్

ఇప్పటివరకు వినియోగదారులకు యూపీఐ ద్వారా అనుసంధానిత బ్యాంకు ఖాతాలో ఎంత నగదు ఉందని ఎన్నిసార్లైనా పరిశీలించే వెసులుబాటు ఉంది. తాజాగా ఈ సేవలపై ఎన్‌పీసీఐ పరిమితి విధించింది. ఈ నెల 1 నుంచి ఒక్కో యూపీఐ యాప్ నుంచి రోజులో 50 సార్లు మాత్రమే బ్యాంకు అకౌంట్‌లోని బ్యాలెన్స్‌ను చెక్ చేసుకునే వీలుంటుంది. అత్యధిక లావాదేవీలు చోటు చేసుకునే సమయాల్లో వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించేందుకు ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, యూపీఐ యాప్ నుంచి జరిపే ప్రతి చెల్లింపు పూర్తయ్యాక మీ ఖాతాలో నిల్వ ఎంత మిగిలి ఉందనేది వెంటనే చూడగలుగుతారు.

ఆటో చెల్లింపులు

వర్తకులకు స్వయంచాలక (ఆటోమెటిక్) చెల్లింపులు లేదా నెలవారీ ఈఎంఐ, ఓటీటీల సబ్‌స్క్రిప్షన్ పునరుద్ధరణ, మ్యూచువల్ ఫండ్ పథకాల్లో క్రమానుగత పెట్టుబడులు (సిప్) వంటి పునరావృత చెల్లింపులను ఇకపై ఉదయం 10 గంటలకు ముందు లేదా రాత్రి 9.30 గంటల తర్వాతే ప్రాసెస్ చేయడం జరుగుతుందని ఎన్‌పీసీఐ తెలిపింది. వ్యవస్థపై లావాదేవీల ప్రాసెసింగ్ భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

బ్యాంక్ అకౌంట్ వివరాలు

యూపీఐ వినియోగదారులు ఇకపై తమ మొబైల్ నంబరుతో అనుసంధానితమైన బ్యాంకు ఖాతాల వివరాలను రోజులో గరిష్ఠంగా 25 సార్లు మాత్రమే పొందగలుగుతారు.

పేమెంట్ స్టేటస్

యూపీఐ వినియోగదారులు పెండింగ్‌లో ఉన్న లావాదేవీ స్టేటస్ (స్థితిని) కేవలం మూడు సార్లే చెక్ చేసుకునే వీలుంటుంది. అది కూడా, ఒకసారి పరిశీలించాక కనీసం 90 సెకన్ల తర్వాతే మళ్లీ చెక్ చేసుకోగలుగుతారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	475
వరంగల్	432	గోదావరి	465
చిత్తూరు	513	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	



ఆర్థిక పరిస్థితులు ఎప్పుడు ఒకేలా ఉండవు. ఉద్యోగం పోవడం, మెడికల్ ఎమర్జెన్సీ లేదా ఆకస్మికంగా ఆదాయం పడిపోవడం వంటి ఈతి బాధలు ఇప్పుడు సాధారణమై పోయాయి. అందరి విషయంలో కాకపోయినా కొందరి విషయంలో ఇవి జరుగుతుంటాయి. మరి అలాంటి పరిస్థితుల్లో బ్యాంకులు లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ల నుంచి తీసుకున్న రుణాల నెలవారీ వాయిదా (ఈఎంఐ)లను ఎలా చెల్లించాలి? చెల్లింపుల నుంచి తాత్కాలిక విరామం (మారటోరియం) కోరాలా? లేక రుణ పునర్ వ్యవస్థీకరణ కోరాలా? అయితే ఈ స్టోరీ చదవండి.

రుణ చెల్లింపులకు విరామం ప్రకటిస్తున్నారా..!

తాత్కాలిక ఉపశమనమే

ఈఎంఐల చెల్లింపుల నుంచి వాయిదా తాత్కాలిక ఉపశమనమే తప్ప.. దీర్ఘకాలిక పరిష్కారం కాదు. పైగా ఈ తాత్కాలిక ఉపశమనం వల్ల దీర్ఘకాలంలో రుణాలపై వడ్డీల మీద వడ్డీ పెరిగిపోయి తడిసి మోపెడవుతుంది. పైగా రుణ చెల్లింపుల వాయిదాలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇప్పుడు అనేక ఆంక్షలు విధించింది. ఉద్యోగాలు పోవడం, తీవ్ర అనారోగ్యం, ప్రకృతి విపత్తుల వంటి ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఈ వాయిదాలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. అయినా ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ వంటి బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఆయా వ్యక్తుల ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఏదో ఒక పేరుతో రుణ చెల్లింపుల వాయిదాలను అనుమతిస్తున్నాయి లేదా రుణాలను పునర్ వ్యవస్థీకరిస్తున్నాయి.

షరతులు వర్తిస్తాయ్

కొన్ని షరతులకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణ చెల్లింపుల నుంచి తాత్కాలిక ఉపశమనానికి అనుమతిస్తాయి. అప్పటి వరకు చెల్లించాల్సిన ఈఎంఐ క్రమం తప్పకుండా చెల్లించి ఉండాలి. ఒకవేళ బకాయి ఉన్నా 90 రోజులకు మించి ఉండకూడదు. ఉద్యోగం పోతే అప్పటి వరకు పని చేసిన కంపెనీ జారీ చేసిన టెర్మినేషన్ లెటర్, అనారోగ్య సమస్య అయితే అందుకు సంబంధించిన మెడికల్ బిల్స్ ప్రకృతి వైపరీత్యాలైతే అందుకు సంబంధించిన ప్రాంతీయ నివేదికలు సమర్పించాలి. ఈ రుజువులన్నీ సమర్పించినా అందరికీ చెల్లింపుల వాయిదా లభిస్తుందని చెప్పలేం. ఆయా వ్యక్తుల ఆర్థిక స్థితిగతులను జాగ్రత్తగా పరిశీలించి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు అందుకు ఆమోదం తెలుపుతాయి.

ఆర్థికంగా భారమే

ఈ వాయిదా ఊరికే రాదు. ఈఎంఐ చెల్లింపుల నుంచి తాత్కాలిక ఉపశమనం లభించినా, వాయిదా గడువు ముగిసే సరికి చెల్లించాల్సిన వడ్డీ 'అసలు'కు జమ అవుతుంది. దీంతో ఈఎంఐ లేదా రుణ చెల్లింపు కాల వ్యవధి పెరిగి పోతుంది.

ఉదాహరణ: ఒక వ్యక్తి ఐదేళ్లలో చెల్లించేలా 12 శాతం వడ్డీతో ఒక బ్యాంకు నుంచి రూ.5 లక్షలు రుణంగా తీసుకున్నాడు. ఏదో ఆర్థిక సమస్య వచ్చి ఆ వ్యక్తి ఈఎంఐ చెల్లింపుల నుంచి మూడు నెలలు విరామం పొందాడనుకుందాం. ఈ మూడు నెలలకు అతడు చెల్లించాల్సిన రూ.7,500 వడ్డీ అసలుకు జమ అవుతుంది. పైగా ఇది చక్రవడ్డీల రూపంలో ఉంటుంది. మూడు నెలల తర్వాత మళ్లీ చెల్లింపులు ప్రారంభించినప్పుడు ఈఎంఐల రూపంలో రూ.10,000 వరకు అదనపు భారం పడుతుంది.

క్రెడిట్ స్కోరు ఓకే

ఈఎంఐల చెల్లింపుల్లో తీసుకునే ఈ తాత్కాలిక విరామం వల్ల ఆయా వ్యక్తుల క్రెడిట్ స్కోరుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. బ్యాంకులు కూడా ఈ విరామాన్ని డిఫర్డ్ లేదా అండర్ మారటోరియం పద్దు కింద చూపిస్తాయి తప్ప, చెల్లింపులు ఆగిపోయాయని చూపించవు. దీనివల్ల ఆయా వ్యక్తుల పరపతి స్కోరుకు ఎలాంటి ఢోకా ఉండదు. కాకపోతే చెల్లింపుల భారం, ఈఎంఐల గడువు పెరిగిపోతాయి. దీంతో రుణ భారం పెరిగి భవిష్యత్‌లో తీసుకునే రుణాలపైనా ప్రభావం చూపుతుంది.

మార్గాలు ఏమిటి?

బ్యాంకుతో మాట్లాడడం

ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పుడు అప్పు ఇచ్చిన బ్యాంకుతో నేరుగా మాట్లాడి రుణ పునర్ వ్యవస్థీకరణ, ఈఎంఐ తగ్గింపు లేదా వడ్డీ చెల్లింపుల భారం తగ్గించుకోవడం మంచిది.

ఎమర్జెన్సీ ఫండ్

ఆర్థిక కష్టాలు తాత్కాలికమైతే అత్యవసర ఖర్చుల కోసం దాచుకున్న మొత్తం నుంచి ఈఎంఐలు చెల్లించడం మంచిది.

ఖర్చులు తగ్గించుకోవడం

ప్రతి వ్యక్తికి ఎంతో కొంత అనవసర ఖర్చులు ఉంటాయి. ఈ ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా చాలా వరకు వాయిదాల అవసరం లేకుండానే రుణ ఈఎంఐలు చెల్లించవచ్చు.

ఇతర మార్గాలు

టాప్ అప్ రుణాల ద్వారా కూడా రుణ చెల్లింపుల వాయిదాల నుంచి తప్పించుకోవచ్చు. ఒకవేళ అనేక రుణాలు ఉంటే అన్ని రుణాలను, ఒకే రుణంగా మార్చి తక్కువ వడ్డీ వసూలు చేసే బ్యాంకుకు మార్చి కూడా వాయిదాల భారం నుంచి బయటపడవచ్చు.

పై విషయాలను దృష్టిలో ఉంచుకుని రుణ చెల్లింపుల 'వాయిదా' అస్త్రాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. లేకపోతే అదే పెద్ద గుదిబండగా మారి ఆర్థిక స్థితిగతుల్ని తారుమారు చేసే ప్రమాదం ఉంది.

7 నుంచి జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఐపీఓ

రూ.3,600 కోట్లకు తగ్గిన నిధుల సమీకరణ లక్ష్యం

ప్రముఖ పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సంస్థ జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 7న ప్రారంభమై 11న ముగియనుంది. ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ లక్ష్యాన్ని మాత్రం కంపెనీలో గతంలో నిర్దేశించుకున్న రూ.4,000 కోట్ల నుంచి రూ.3,600 కోట్లకు తగ్గించుకుంది. ఐపీఓలో భాగంగా రూ.1,600 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయడంతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన రూ.2,000 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు సెబీకి సమర్పించిన రెడ్ హియరింగ్ ప్రాస్పెక్టస్(ఆర్‌హెచ్‌పీ)లో కంపెనీ వెల్లడించింది. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం అపోలో మేనేజ్‌మెంట్ రూ.931.80 కోట్లు, సినర్జీ మెటల్స్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ రూ.938.50, ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ రూ.129.70 కోట్ల విలువైన వాటాను ఉపసంహరించుకోనున్నాయని జేఎస్‌డబ్ల్యూ వెల్లడించింది.

ఆర్సిల్ ఐపీఓ కోసం దరఖాస్తు: అవెన్యూ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇండియా లిమిటెడ్ (ఆర్సిల్).. ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులు 10.54 ఈక్విటీ కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ పేర్కొంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	92
కర్నూలు	90	నెల్లూరు	97
విశాఖపట్నం	92	అనంతపురం	97
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,350 ▲	92,900 ▲	1,23,000 ▼
విజయవాడ	1,02,500 ▼	96,500 ▲	1,14,000 ▲
విశాఖపట్నం	1,01,350 ▼	92,900 ▲	1,23,000 ▼
రాజమండ్రి	1,01,350 ▲	92,900 ▲	1,14,400 ▲
ప్రొద్దుటూరు	1,00,350 ▲	92,320 ▲	1,14,200 ▲
ముంబై	98,253 ▼	90,000 ▼	1,09,646 ▼

క్యాప్‌జెమినీలో 45,000 నియామకాలు

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 12,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్న సమయంలో ఫ్రెంచ్ ఐటీ కంపెనీ క్యాప్‌జెమినీ కాస్త ఊరట కలిగించే వార్త చెప్పింది. ఈ ఏడాది 40,000-45,000 నియామకాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. అందులో 35-45 శాతం అనుభవజ్ఞులను ఉద్యోగంలో చేర్చుకోవాలనుకుంటున్నట్లు క్యాప్‌జెమినీ సీఈఓ అశ్విన్ యార్డీ వెల్లడించారు. ఫ్రాన్స్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ కంపెనీకి చెందిన భారత కార్యాలయాల్లో ప్రస్తుతం 1.75 లక్షల మంది పనిచేస్తున్నారు. భారత్‌లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకునేందుకు కంపెనీ 50కి పైగా కాలేజీలు, క్యాంపస్‌లతో జట్టు కట్టింది. ప్రస్తుత సీజన్ హైరింగ్ కొనసాగుతోందని, కొత్తగా రిక్రూట్ చేసుకున్నవారికి కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతలో శిక్షణ ఇవ్వడంపై దృష్టిసారించినట్లు కంపెనీ తెలిపింది.

- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్ సేవలందిస్తున్న టాలీ సొల్యూషన్స్.. ట్యాక్స్ అండ్ అకౌంటింగ్ టైటాన్స్ పేరుతో వరంగల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎంఎస్ఎంఈలకు అకౌంటింగ్ సేవలందిస్తున్న జీఎస్‌టీపీలు, అకౌంటెంట్లు, ట్యాక్స్ అడ్వకేట్స్ సహా ఇతర ప్రొఫెషనల్స్‌ను ఈ సందర్భంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ డీఎస్ రావత్, టాలీ సొల్యూషన్స్ సౌత్ జోన్ జీఎం అనిల్ భార్గవన్ పాల్గొన్నారు.
- హైదరాబాద్ కేంద్రంగా ఉన్న లైఫ్‌సైన్సెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్.. ప్రపంచ బ్యాంక్ గ్రూప్‌నకు చెందిన ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) నుంచి ప్రతిష్ఠాత్మకమైన ఎడ్జ్ అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్ అవార్డును గెలుచుకుంది. జినోమ్ వ్యాలీలో కంపెనీకి చెందిన 1జీవీ లైఫ్ సైన్సెస్ క్యాంపస్ ఈ అవార్డును దక్కించుకుంది.
- టొరెంట్ ఫార్మా.. తన షెల్ కాల్ బ్రాండ్‌ను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా పెద్దల కోసం షెల్‌కాల్ టోటల్ పేరుతో న్యూట్రిషన్ సప్లిమెంట్ పౌడర్‌ను తీసుకువచ్చింది. ప్రస్తుతం షెల్‌కాల్ టాబ్లెట్ల రూపంలో అందుబాటులో ఉంది.

కలిసే ఉంటాం!



కశ్యప్‌తో విడిపోవాలన్న నిర్ణయంపై సైనా యూటర్న్

ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన షట్లర్

హైదరాబాద్: మాజీ షట్లర్ పారుపల్లి కశ్యప్‌తో దాంపత్య జీవితానికి ముగింపు పలుకుతున్నట్టు ఇటీవలే ప్రకటించిన బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ యూటర్న్ తీసుకుంది. భర్త కశ్యప్ నుంచి విడిపోవాలన్న నిర్ణయంపై పునరాలోచన చేస్తున్నట్టు సైనా తన ఇన్‌స్టాగ్రామ్‌లో శనివారం పోస్ట్ చేసింది. 'కొన్నిసార్లు దూరం.. వర్తమానం విలువను తెలియజేస్తుంది. మళ్లీ కలిసిపోయేందుకు ప్రయత్నిస్తున్నాం' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్న సైనా.. కశ్యప్‌తో కలిసున్న ఫొటోను షేర్ చేసింది. కశ్యప్ నుంచి విడిపోతున్నట్టు గత నెల 13న సైనా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా వెల్లడించిన సంగతి తెలిసిందే. కొన్నాళ్లపాటు ప్రేమించుకున్న వీళ్లిద్దరూ 2018లో పెళ్లితో ఒక్కటయ్యారు.

ఫైనల్లో భారత జోడీలు

డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్

న్యూఢిల్లీ: బ్రెజిల్‌లో జరుగుతున్న ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ టోర్నీలో భారత జోడీలు మానుష్ షా-దియా చిటాలే, మానవ్ టక్కర్-మానుష్ షా ఫైనల్ చేరి చరిత్ర సృష్టించారు. మిక్స్‌డ్ డబుల్స్ సెమీస్‌లో మానుష్-దియా జోడీ 11-7, 11-2, 11-7తో చిలీకి చెందిన నికోలస్-పౌలినా జంటపై గెలిచింది. పురుషుల డబుల్స్ సెమీస్‌లో మానవ్-మానుష్ ద్వయం 5-11, 11-9, 11-6, 8-11, 11-5తో చైనీస్ తైపీ జోడీ హువాంగ్ - క్యు గువాన్ హోంగ్‌ను ఓడించింది. డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ మిక్స్‌డ్, డబుల్స్‌లో భారత ఆటగాళ్లు ఫైనల్ చేరడం ఇదే తొలిసారి.

ఒకే ఓవర్‌లో 45 పరుగులు

టీ10 లీగ్‌లో సంచలన రికార్డు



ఉస్మాన్

లండన్: తన పవర్ హిట్టింగ్‌తో ఒకే ఓవర్‌లో అత్యధికంగా 45 పరుగులు రాబట్టి అఫ్ఘానిస్థాన్ మాజీ బ్యాటర్ ఉస్మాన్ ఘనీ (43 బంతుల్లో 11 ఫోర్లు, 17 సిక్స్‌లతో 153 నాటౌట్) ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈసీఎస్ టీ10 లీగ్‌లో గిల్డ్‌ఫోర్డ్‌తో మ్యాచ్‌లో లండన్ కౌంటీ తరఫున ఉస్మాన్ సూపర్ ఫీట్ నమోదు చేశాడు. విల్ జర్నీ బౌలింగ్ చేసిన 9 బంతుల ఓవర్‌లో ఒక్క బంతిని మిస్ అయిన ఘనీ.. 5 సిక్స్‌లు, 3 ఫోర్లు బాదాడు. ఇందులో రెండు నోబాల్స్, వైడ్ ఉన్నాయి. కాగా, ఉస్మాన్ కేవలం 28 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. దీంతో లండన్ కౌంటీ 10 ఓవర్లలో 226 పరుగులు చేసింది. ఛేదనలో 115/4 స్కోరుకే పరిమితమైన గిల్డ్‌ఫోర్డ్.. 71 పరుగుల తేడాతో ఓడింది.

బాయ్‌ఫ్రెండ్‌పై దాడి

100 మీటర్ల వరల్డ్ చాంపియన్ షకేరి అరెస్ట్





సియాటెల్ (అమెరికా): మహిళల 100 మీటర్ల డిఫెండింగ్ వరల్డ్ చాంపియన్ షకేరి రిచర్డ్‌సన్ గృహహింస కేసులో అరెస్టయింది. గత ఆదివారం సియాటెల్ విమానాశ్రయంలో తన బాయ్‌ఫ్రెండ్, అమెరికాకే చెందిన మరో ప్రఖ్యాత స్ప్రింటర్, 100 మీటర్ల ప్రపంచ మాజీ చాంపియన్ క్రిస్టియన్ కోల్‌మన్‌పై దాడి చేసినందుకు పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. కోల్‌మన్‌తో వాదనకు దిగిన ఆమె అతడిని బలంగా నెట్టివేయడంతో విమానాశ్రయంలోని ఓ గోడకు అతడు గుద్దుకొన్నాడు. విమానాశ్రయ సీసీ కెమెరా ఫుటేజ్‌లో..కోల్‌మన్‌పై రిచర్డ్‌సన్ ఏదో వస్తువును విసరడం కూడా కనిపించింది. దాంతో రిచర్డ్‌సన్‌పై నాలుగో డిగ్రీ గృహహింస కేసు నమోదు చేసి ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేశారు. అనంతరం సోమవారం మధ్యాహ్నం ఆమెను విడుదల జేశారు. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన 25 ఏళ్ల షకేరి, 29 ఏళ్ల కోల్‌మన్ రెండేళ్లుగా డేటింగ్‌లో ఉన్నారు.

లక్ష్య, తరుణ్ అవుట్

మకావు: తెలుగు షట్లర్ తరుణ్ మన్నేపల్లి, స్టార్ ఆటగాడు లక్ష్య సేన్‌లకు మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నిరాశ ఎదురైంది. ఈ ఇద్దరు సెమీఫైనల్స్‌లో ప్రత్యర్థులకు తలొగ్గి ఇంటిబాట పట్టారు. లక్ష్య సేన్ 16-21, 9-21తో అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో, తరుణ్ 21-19, 16-21, 16-21తో జస్టిన్ హో (మలేసియా) చేతిలో ఓటమి పాలయ్యారు.

స్పోర్ట్స్

బౌలర్లూ.. చెలరేగాలి!

ఇంగ్లండ్ లక్ష్యం 374

ప్రస్తుతం 50/1

1 ఓ టెస్టు సిరీస్‌లో ఎక్కువ శతకాలు (12) బాదిన జట్టుగా ఆస్ట్రేలియా, పాకిస్థాన్, దక్షిణాఫ్రికాలతో కలిసి టాప్‌లో నిలిచిన భారత్.

ఇంగ్లండ్‌లో జరిగిన సిరీస్‌ల్లో 50+ స్కోర్లు ఎక్కువసార్లు (6) సాధించిన భారత బ్యాటర్‌గా జడేజా.

2 భారత్ తరఫున ఓ టెస్టు సిరీస్‌లో ఎక్కువ పరుగులు (754) చేసిన రెండో భారత బ్యాటర్‌గా గిల్. గవాస్కర్ (1971లో 774) టాప్‌లో ఉన్నాడు. అలాగే ఈ ఫీట్ సాధించిన రెండో కెప్టెన్ కూడా గిల్. డాన్ బ్రాడ్‌మన్ (1936లో 810) ముందున్నాడు.



జైస్వాల్ (118)

భారత్ రెండో ఇన్నింగ్స్ 396

జైస్వాల్ శతకం

ఆకాశ్, జడేజా, సుందర్ హాఫ్ సెంచరీలు

టంగ్‌కు 5 వికెట్లు



ఆకాశ్‌దీప్ (66)

లండన్: అత్యంత ఆసక్తిగా సాగుతున్న ఐదో టెస్టులో ఫలితం తేలడం ఖాయమైంది. ఈ ఆఖరి మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత్‌కు బ్యాటర్లు అండగా నిలిచారు. ఫలితంగా టీమిండియా.. ప్రత్యర్థి ఇంగ్లండ్ ముందు 374 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (118) సెంచరీ, ఆకాశ్‌దీప్ (66), వాషింగ్టన్ సుందర్ (53), జడేజా (53)ల అర్ధసెంచరీలతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 396 పరుగులు సాధించింది. పేసర్ టంగ్ ఐదు వికెట్లతో ఆకట్టుకున్నాడు. ధ్రువ్ జురెల్ (34) పర్వాలేదనిపించాడు. ఇక ఛేదనకు దిగిన ఇంగ్లండ్ శనివారం ఆట చివరి ఓవర్‌లో ఓపెనర్ క్రాలే (14) వికెట్‌ను కోల్పోయి 50/1 స్కోరుతో నిలిచింది. ఓపెనర్ డకెట్ (34) క్రీజులో ఉన్నాడు. ఆటకు ఇంకా రెండు రోజుల సమయం ఉండగా.. ఇంగ్లండ్ గెలుపునకు మరో 324 పరుగుల దూరంలో ఉంది. ఈ స్థితిలో ఇరు జట్ల విజయావకాశాలపై ఉత్కంఠ నెలకొంది. మిగిలిన వికెట్లను భారత బౌలర్లు ఎంత వేగంగా తీస్తారనేది కీలకంగా మారనుంది. తొలి టెస్టులో కూడా ఇంగ్లండ్ ఆఖరి రోజు 350 రన్స్ బాది విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. మరోవైపు ఓవల్‌లో అత్యధిక ఛేదన 263 పరుగులే కావడం గమనార్హం.

ఆకాశ్ అనూహ్యంగా..: ఓవర్‌నైట్ స్కోరు 75/2తో భారత్ మూడో రోజును మెరుగ్గా ఆరంభించింది. ముఖ్యంగా శుక్రవారం నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్ అంచనాలకు మించిన ఆటతో అదరగొట్టాడు. దాదాపు సెషన్ మొత్తం క్రీజులో నిలిచి బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడిని ఊరించేందుకు తొలి ఓవర్‌నే స్పిన్నర్ బెథెల్‌తో వేయించారు. కానీ మూడో బంతినే ఫోర్‌గా మలిచిన ఆకాశ్ దీటుగా బదులిచ్చాడు. పిచ్ ఫ్లాట్‌గా మారడంతో టంగ్, అట్కిన్సన్ ఓవర్లలోనూ అవలీలగా బౌండరీలు సాధిస్తూ అండగా నిలిచాడు. అటు జైస్వాల్ తన సహజశైలిలో ఆడి ఒత్తిడి పెంచాడు. ఇక ఆకాశ్ 21 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో క్రాలే వదిలేయగా.. ఈ చాన్స్‌ను వినియోగించుకుంటూ కెరీర్‌లో తొలి అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత ఎక్కువగా తనే స్ట్రయికింగ్ తీసుకోగా.. ఓవర్టన్, టంగ్ ఓవర్లలో వరుసగా రెండేసి ఫోర్లతో అదుర్స్ అనిపించాడు. చివరకు లంచ్‌కు ముందు ఓవర్టన్ షార్ట్ బాల్‌కు ఆకాశ్ షో ముగిసింది. అప్పటికే మూడో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యం చేరింది.

జైస్వాల్ అదుర్స్: రెండో సెషన్‌లో జైస్వాల్ శతకంతో పాటు భారత్‌కు భారీ ఆధిక్యం దక్కింది. అయితే అటు ఇంగ్లండ్ పేసర్లు కూడా ప్రభావం చూపి మూడు వికెట్లు తీయగలిగారు. ఫీల్డింగ్‌లో మాత్రం మళ్లీ నిరాశపరుస్తూ జైస్వాల్, కరుణ్ క్యాచ్‌లను వదిలేశారు. సెషన్ తొలి బంతికే కెప్టెన్ గిల్ (11)ను అట్కిన్సన్ ఎల్బీ చేశాడు. ఇక 127 బంతుల్లో జైస్వాల్ కెరీర్‌లో ఆరో శతకం పూర్తి చేసుకున్నాడు. మరోవైపు క్రీజులో ఇబ్బందిపడిన కరుణ్ (17)ను సైతం అట్కిన్సన్ పెవిలియన్‌కు చేర్చాడు. అయితే జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 44 పరుగులు జోడించిన జైస్వాల్.. టంగ్ షార్ట్ పిచ్ బాల్‌కు దొరికిపోయాడు. అనంతరం జురెల్ ఎదురుదాడికి దిగడంతో భారత్ స్కోరు ఈ సెషన్‌లోనే 300 దాటింది.

జడేజా-సుందర్ మరోసారి..: ఆఖరి సెషన్‌లో లోయర్ మిడిలార్డర్ నుంచి విలువైన పరుగులు జత చేరాయి. ఏడో వికెట్‌కు జడేజాతో కలిసి 50 పరుగులు జోడించాక జురెల్ వెనుదిరిగాడు. అనంతరం జడ్డూ ఈ సిరీస్‌లో ఐదో హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే జడేజా, సిరాజ్ (0)లను టంగ్ ఒకే ఓవర్‌లో దెబ్బతీశాడు. అయితే చివర్లో సుందర్ చెలరేగి అట్కిన్సన్ ఓవర్‌లో 4,4,6తో 39 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు. కానీ భారీ షాట్ ఆడే యత్నంలో టంగ్‌కు చిక్కడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 224; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 247;

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) ఓవర్టన్ (బి) టంగ్ 118, రాహుల్ (సి) రూట్ (బి) టంగ్ 7, సుదర్శన్ (ఎల్బీ) అట్కిన్సన్ 11, ఆకాశ్‌దీప్ (సి) అట్కిన్సన్ (బి) ఓవర్టన్ 66, గిల్ (ఎల్బీ) అట్కిన్సన్ 11, నాయర్ (సి) స్మిత్ (బి) అట్కిన్సన్ 17, జడేజా (సి) బ్రూక్ (బి) టంగ్ 53, జురెల్ (ఎల్బీ) ఓవర్టన్ 34, సుందర్ (సి) క్రాలే (బి) టంగ్ 53, సిరాజ్ (ఎల్బీ) టంగ్ 0, ప్రసిద్ధ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 26; మొత్తం: 88 ఓవర్లలో 396 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-46, 2-70, 3-177, 4-189, 5-229, 6-273, 7-323, 8-357, 9-357, 10-396; **బౌలింగ్:** అట్కిన్సన్ 27-3-127-3, టంగ్ 30-4-125-5, ఓవర్టన్ 22-2-98-2, బెథెల్ 4-0-13-0, రూట్ 5-1-15-0.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బి) సిరాజ్ 14, డకెట్ (బ్యాటింగ్) 34, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 13.5 ఓవర్లలో 50/1; వికెట్ పతనం:** 1-50; **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 5-1-15-0, ప్రసిద్ధ్ 5-1-23-0, సిరాజ్ 3.5-0-11-1.


ఆసియా కప్ వేదికలివే..

దుబాయ్: ఆసియా కప్ టీ20 టోర్నీ వేదికలను ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) శనివారం ప్రకటించింది. సెప్టెంబరు తొమ్మిది నుంచి 28 వరకు దుబాయ్, అబుదాబి వేదికలుగా టోర్నీ నిర్వహించనున్నట్టు తెలిపింది. సెప్టెంబరు 14న భారత్-పాకిస్థాన్ గ్రూపు దశ మ్యాచ్ దుబాయ్‌లో జరగనుంది. అఫ్ఘానిస్థాన్-హాంకాంగ్ జట్ల ప్రారంభ మ్యాచ్‌కు అబుదాబి ఆతిథ్యమివ్వనుంది. ఇక..ఫైనల్‌ను దుబాయ్‌లో నిర్వహిస్తారు. సెప్టెంబరు 10న తమ ప్రారంభ మ్యాచ్‌లో యూఏఈతో దుబాయ్‌లో టీమిండియా తలపడనుంది.

ప్రైవేటు క్రికెట్ లీగుల్లో 'పాకిస్థాన్' పేరు వాడొద్దు!

న్యూఢిల్లీ: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సంచలన నిర్ణయం తీసుకొంది. ప్రైవేటు క్రికెట్ లీగుల్లో 'పాకిస్థాన్' దేశం పేరును వాడటంపై నిషేధం విధించింది. వరల్డ్ చాంపియన్‌షిప్స్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్)లో పాక్‌తో మ్యాచ్‌లను భారత వెటరన్ జట్టు రెండుసార్లు బహిష్కరించింది. ఈ నేపథ్యంలో బోర్డు అనుమతి లేకుండా ప్రైవేటు లీగుల్లో 'పాకిస్థాన్' అని వాడితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించింది.

ఓవల్ గ్రౌండ్‌లో రోహిత్



లండన్: మూడో రోజు ఆటలో భారత జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ సందడి చేశాడు. ఆట ఆరంభమైన కాసేపటికే తను సాధారణ ప్రేక్షకుడి మాదిరి మొబైల్‌లో టిక్కెట్‌ను సెక్యూరిటీ గార్డ్‌కు చూపించి లోనికి ప్రవేశించాడు. నాలుగేళ్ల క్రితం ఇదే ఓవల్‌లో రోహిత్ సెంచరీతో జట్టును గెలిపించడం విశేషం. అలాగే గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ కూడా మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చాడు.

నగల్‌కు చుక్కెదురు

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ సింగిల్స్ టాప్ ఆటగాడు సుమిత్ నగల్‌కు జర్మనీలోని హాగెన్‌లో జరుగుతున్న ప్లాట్జ్‌మన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ ఈవెంట్‌లో చుక్కెదురైంది. ప్రీక్వార్టర్స్‌లో నగల్ 2-6, 6-4, 4-6తో జర్మనీకి చెందిన నీల్స్ మెక్‌డొనాల్డ్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

ఓటర్ల జాబితాలో నా పేరూ తీసేశారు: తేజస్వి

న్యూఢిల్లీ, ఆగస్టు 2: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల రీ సర్వేపై విపక్ష ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శలు గుప్పించారు. రీ సర్వే అనంతరం శుక్రవారం ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో తన పేరును తీసేశారని ఆరోపించారు. శనివారం ఆయన పట్నాలో మీడియాతో మాట్లాడారు. ఫొటో గుర్తింపు కార్డులో ఉన్న ఎపిక్ నెంబర్‌ను ఎన్నికల సంఘం అధికారిక యాప్‌లో నమోదు చేసిన తేజస్వి.. జాబితాలో తన ఓటుకు సంబంధించిన వివరాలు తీసేశారని పేర్కొన్నారు. 'ఎలాంటి రికార్డులు లేవు.' అని ఉన్న సందేశాన్ని చూపించారు. "జాబితాలో నా పేరు లేదు. ఎన్నికల్లో నేనెలా పోటీ చేయగలను?." అని ప్రశ్నించారు. తేజస్వి ఆరోపణలపై ఎన్నికల సంఘం వెంటనే స్పందించింది. ఎలక్టోరల్ జాబితాలోని ఓ కాపీని సోషల్ మీడియాలో పోస్టు చేసి.. పట్నాలోని వెటర్నరీ కాలేజీ పోలింగ్ బూత్ పరిధిలో తేజస్వికి ఓటు హక్కు ఉందని స్పష్టం చేసింది. ఆయన చేసిన ఆరోపణలు దుర్మార్గపూరితమైనవని, నిరాధారమని దుయ్యబట్టింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో సీరియల్ నెంబరు 416లో తేజస్వి పేరు, వివరాలు ఉన్నాయని వివరించింది.

రాజ్యసభలో 102కు పెరిగిన బీజేపీ బలం

న్యూఢిల్లీ, ఆగస్టు 2: వచ్చే నెల 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజ్యసభలో అధికార బీజేపీ బలం మరింత పెరిగింది. ఇటీవల రాజ్యసభకు నామినేట్ అయిన ముగ్గురు ఎంపీలు ఈ వారం ఆ పార్టీలో చేరారు. దీంతో పెద్దల సభలో బీజేపీ సభ్యుల సంఖ్య 102కి చేరింది. 2022 ఏప్రిల్ తర్వాత బీజేపీ సభ్యుల సంఖ్య రెండోసారి 100 మార్క్ దాటింది. రాజ్యసభ ఎంపీలుగా రాష్ట్రపతి నామినేట్ చేసిన ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ సింగ్ శ్రింగ్లా, కేరళకు చెందిన సామాజిక కార్యకర్త సీ సదానందన్ అధికారికంగా బీజేపీలో చేరారు. వీరి చేరికతో ప్రస్తుతం 240 మంది సభ్యులు ఉన్న పెద్దల సభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి బలం మెజార్టీ మార్క్ దాటి 134కి చేరింది. వీరిలో ఐదుగురు నామినేటెడ్ ఎంపీలు ఉన్నారు.

మీ ఎఫ్-35 ఫైటర్ జెట్లు మాకొద్దు..!

» సుంకాల నేపథ్యంలో అమెరికాతో డీల్‌పై భారత్ అనాసక్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 2: సుంకాలతో రెచ్చిపోతున్న ట్రంప్ దూకుడుకు దీటుగా బదులిచ్చేందుకు మన దేశం సిద్ధమైంది. భారత్ వస్తువులపై 25% సుంకాలు వేసిన అమెరికా నుంచి ఎఫ్-35 స్టెల్త్ ఫైటర్ జెట్లు కొనుగోలు చేయకూడదని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు 'మీ ఐదో తరం ఎఫ్-35 యుద్ధవిమానాల కొనుగోలుపై మాకు ఆసక్తిలేదు' అని అమెరికా అధికారులకు భారత్ స్పష్టం చేసినట్లు తాజాగా బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఇకపై అమెరికాతో ప్రధాన రక్షణ ఒప్పందాలకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చే అవకాశం లేదని ఆ నివేదిక స్పష్టం చేసింది. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఏదైనా భాగస్వామ్యంతో దేశీయంగా ఆయుధాల తయారీపై భారత్ పెద్దఎత్తున దృష్టి పెట్టిందని పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళ్లినపుడు ఎఫ్-35లను విక్రయించేందుకు అమెరికా అంగీకరించింది. ట్రంప్ కూడా ఆ విషయాన్ని వెల్లడించారు. ఆ యుద్ధ విమానాలు ఓ చెత్త అంటూ గతంలో ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యల్ని ఉటంకిస్తూ విపక్ష కాంగ్రెస్.. మోదీ సర్కార్‌పై అప్పట్లో విమర్శలు చేసింది.

మాలేగావ్ కేసులో మోదీ పేరు చెప్పాలన్నారు

» యోగి, భాగవత్ పేర్ల కోసం హింసించారు: ప్రజ్ఞాసింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 2: మాలేగావ్ పేలుళ్ల కేసులో ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, బీజేపీ నేత రామ్ మాధవ్ పేర్లు చెప్పాలని తనను ఏటీఎస్ అధికారులు హింసించారని బీజేపీ మాజీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ ఆరోపించారు. ఈ పేర్లు చెబితే తనను హింసించబోమని మాటిచ్చారని ఆమె చెప్పారు. తనపై తప్పుడు ఆరోపణలతో కేసు పెట్టారని, ఇదంతా కాంగ్రెస్ కుట్రగా ప్రస్తుతం బహిర్గతమైందన్నారు. ఈ కేసులో తనతో సహా ఆరోపణలు ఎదుర్కొన్నవారంతా నిర్దోషులుగా బయటపడటం కాషాయానికి, సనాతన ధర్మానికి లభించిన విజయమని ఆమె చెప్పారు. ఈ కేసులో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను అరెస్ట్ చేయాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ ఇటీవలే ఆరోపించారు.

ఈ ఏడాది అమెరికా నుంచి..
1,703 మంది భారతీయుల బహిష్కరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 2: డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాక.. అమెరికా నుంచి 1,703 మంది భారతీయులను బహిష్కరించారు. వీరంతా అక్రమంగా అమెరికాలో ఉంటున్నట్లు అక్కడి హోంల్యాండ్ సెక్యూరిటీ, ఇమిగ్రేషన్ అధికారులు తెలిపారు. ఈ గణాంకాలను భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ ఏడాది ప్రథమార్థంలో రోజుకు సగటున 8 మంది చొప్పున అమెరికా నుంచి డీపోర్ట్ అయినట్లు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2020-24 మధ్య– బైడెన్ పరిపాలనలో ఈ సంఖ్య రోజుకు సగటున 3గా ఉండేది. ఈ లెక్కన అమెరికా నుంచి భారతీయుల డీపోర్టింగ్ ఈ ఏడాది మూడింతలు పెరిగింది. గడిచిన ఐదేళ్లలో మొత్తం 7,244 మంది భారతీయులు అమెరికా నుంచి బహిష్కరణకు గురయ్యారు. వారిలో పాతిక శాతం మంది ఈ ఏడాది తొలి ఆర్నెల్లలోనే భారత్‌కు తిరిగి రావడం గమనార్హం..!

మసాజ్ థెరపిస్టుల ఉద్యోగాలకు ఏఐ ముప్పు

» ఏఐ మసాజ్ రోబోను పరిచయం చేసిన అమెరికా సంస్థ

న్యూయార్క్, ఆగస్టు 2: ఏఐ విస్తృత అభివృద్ధితో మానవ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ అమెరికా కంపెనీ మానవ మసాజ్‌కు ప్రత్యామ్నాయంగా మొట్టమొదటి ఏఐ ఆధారిత మసాజ్ రోబోను పరిచయం చేసింది. ఈ నూతన టెక్నాలజీ తమ ఉద్యోగాలకు ఎక్కడ ఎసరు పెడుతుందోనని థెరపిస్టులు భయపడుతున్నారు. అమెరికాలోని ఎస్కేప్ అనే సంస్థ అభివృద్ధి చేసిన ఈ ఏఐ మసాజ్ రోబో.. మనిషి శరీరాకృతి, కండరాల పనితీరు ఆధారంగా తగిన రీతిలో మర్దన చేస్తుంది. ఈ మసాజ్‌లో వినియోగదారుడికి ప్రత్యేక సూట్‌ను ధరింపజేస్తారు. ఇది మనిషి శరీరాన్ని 10 లక్షల 3డీ డేటా పాయింట్లతో మ్యాప్ చేస్తుంది. అనంతరం రోబోకు అమర్చిన భుజం మంచం మీద పడుకున్న మనిషి శరీరం అంతటా సంచరిస్తూ, శరీరానికి అవసరమైన ఒత్తిడిని కలిగిస్తూ మర్దన చేస్తుంది. ఈ ఏఐ రోబో ఏడు రకాల మసాజ్ పద్ధతులను కచ్చితమైన ఒత్తిడితో తగిన ఉష్ణోగ్రతను అందిస్తుందని ఎస్కేప్ సంస్థ వ్యవస్థాపకుడు ఎరిక్ లిట్‌మన్ తెలిపారు.



డాలస్‌లోని భారత కాన్సులర్ కేంద్రంలో అధికారులతో ప్రసాద్ తోటకూర

అమెరికాలో మరో 8 భారత కాన్సులర్ కేంద్రాలు

» డాలస్‌లో ఏర్పాటుపై ఐఏఎఫ్‌సీ అధ్యక్షుడు ప్రసాద్ హర్షం

న్యూయార్క్, ఆగస్టు 2: అమెరికా వ్యాప్తంగా కొత్తగా 8 ఇండియా కాన్సులర్ అప్లికేషన్ సెంటర్ల(ఐసీఏసీ)ను భారత్ తెరిచింది. డాలస్, బోస్టన్, కొలంబస్, డెట్రాయిట్, ఎడిసన్, ఒర్లాండో, రాలీ, శాన్‌జోస్‌లలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాత్రా శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే లాస్‌ఏంజెలిస్‌లో మరో కేంద్రాన్ని కూడా ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. 'అమెరికాలో ఉంటున్న 50 లక్షలకు పైగా ప్రవాస భారతీయుల కోసం మా సేవలను మరింత విస్తరిస్తున్నాం. పాస్‌పోర్టు, వీసా, జనన/వివాహ ధ్రువీకరణ పత్రం, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ), సరెండర్ సర్టిఫికెట్, పోలీసు క్లియరెన్స్ సహా అన్ని సేవలను ఈ కాన్సులర్ కేంద్రాల ద్వారా పొందవచ్చు' అని వెల్లడించారు. డాలస్‌లో కాన్సులర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్ (ఐఏఎఫ్‌సీ) అధ్యక్షుడు ప్రసాద్ తోటకూర హర్షం వ్యక్తం చేశారు. కాగా, కొత్త వాటితో కలిపి అమెరికాలోని భారత కాన్సులర్ కేంద్రాల సంఖ్య 17కు పెరిగింది.

లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్

70-100 స్థానాల్లో ఫలితాలు తారుమారు.. మా వద్ద వంద శాతం ఆధారాలున్నాయి

» వాటిని త్వరలోనే బయటపెడతాం
» ఇది అణుబాంబు వంటిది..
» కాంగ్రెస్ లీగల్ సదస్సులో రాహుల్
» 10-15 నియోజకవర్గాల్లో రిగ్గింగ్ జరిగి ఉండకపోతే మోదీ ప్రధాని అయ్యేవారు కాదని వ్యాఖ్య



శనివారం కాంగ్రెస్ లీగల్ సదస్సులో కర్ణాటక సీఎం సిద్దరామయ్యతో రాహుల్ గాంధీ కరచాలనం

న్యూఢిల్లీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): "గత (2024) లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది. కనీసం 70 నుంచి వంద స్థానాల్లో ఫలితాలను తారుమారు చేశారని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఎన్నికల ఫలితాలను ఎలా తారుమారు చేశారో చెప్పడానికి మా వద్ద నూటికి నూరు శాతం ఆధారాలున్నాయి. వాటిని త్వరలో బయటపెడతాం. ఇది ఓ ఆటం బాంబు వంటిది" అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఆరోపించారు. ఎన్నికల్లో రిగ్గింగ్‌పై తమకు ఎప్పటి నుంచో అనుమానాలు ఉన్నాయని, కానీ, ఇప్పుడు ఆధారాలు లభించాయని తెలిపారు. రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో కాంగ్రెస్ పార్టీ న్యాయ, మానవ హక్కులు, సమాచార హక్కు విభాగం శనివారం వార్షిక సదస్సును నిర్వహించింది. ఈ సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. మోదీ అతి తక్కువ మెజారిటీతో ప్రధాన మంత్రి అయ్యారని, 10-15 నియోజకవర్గాల్లో రిగ్గింగ్ జరిగి ఉండకపోతే ఆయన ప్రధాన మంత్రి అయి ఉండేవారు కాదని వ్యాఖ్యానించారు. "అసలు దేశంలో ఎన్నికల కమిషన్ అనేదే లేదన్నట్లుగా మా వద్ద ఆధారాలున్నాయి. వాటిని దేశం మొత్తానికి చూపిస్తాం. కాంగ్రెస్ పార్టీ దాదాపు ఆరు నెలలపాటు కష్టపడి ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఆధారాలు సంపాదించింది. ఉదాహరణకు, ఓ నియోజకవర్గంలో 6.5 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. కానీ, వారిలో లక్షన్నర మంది బోగస్ ఓటర్లే" అని రాహుల్ వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ ఎలా చేయవచ్చు.. ఎలా చేశారనే విషయాన్ని తాము నిరూపిస్తామని చెప్పారు. ఆ డేటాను తాము విడుదల చేసినప్పుడు ప్రకంపనలు తప్పవని చెప్పారు. "మేం ఈ ఆధారాలను కొంత మందికి చూపించినప్పుడు వాళ్లు కుర్చీ నుంచి కిందకు పడిపోయారు. ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. కానీ, ఇది సాధ్యం. ఇదే జరిగింది. ఇది నిజం" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

ఎన్నికల కమిషన్ పూర్తిగా నిర్వీర్యం

దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయిందని రాహుల్ ఆరోపించారు. "లోక్‌సభ ఎన్నికలు జరిగిన తర్వాత నాలుగు నెలల్లోనే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ నాలుగు నెలల్లో కోటి మంది కొత్త ఓటర్లను చేర్చారు. వారిలో అత్యధికులు బీజేపీకే ఓటు వేశారు" అని ఆరోపించారు. 2014 నుంచే ఎన్నికల ఫలితాలపై తమకు సందేహాలు ఉన్నాయని, మరీ ముఖ్యంగా, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో ఘన విజయాలు బీజేపీ మేనేజ్ చేసిందని, కానీ, టర్నింగ్ పాయింట్ మాత్రం ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలని వ్యాఖ్యానించారు. "లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మేం గెలిచాం. కానీ, కేవలం నాలుగు నెలల్లోనే అక్కడ మేం ఓడిపోవడమే కాదు.. పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాం. మూడు ప్రధాన పార్టీలు కనిపించకుండా పోయాయి. అప్పటి నుంచే ఎన్నికల అక్రమాలపై మేం సీరియస్‌గా దృష్టిసారించాం" అని వివరించారు. 'నువ్వు నిప్పుతో చెలగాటం ఆడుతున్నావ్' అని తన సోదరి ప్రియాంక గాంధీ తనను హెచ్చరించారని, పిరికివాళ్లను చూసి భయపడవద్దని తన కుటుంబం తనకు నేర్పిందని చెప్పారు. రఫేల్ ఒప్పందంలో ప్రధాన మంత్రి కార్యాలయం, జాతీయ భద్రతా సలహాదారు జోక్యం ఉందని డాక్యుమెంట్లు చెబుతున్నాయని, ఇలాంటి డాక్యుమెంట్ మరో దేశంలో బయటపడి ఉంటే.. ప్రభుత్వం కుప్పకూలిపోయేదని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కానీ, మన దేశంలో ఏమీ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రాహుల్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. అధికారులను బెదిరించడానికి విపక్ష నేత ఆరోపణలు చేస్తున్నారని విమర్శించింది. అలాంటి ఆరోపణలు ఎన్నికల యంత్రాంగాన్ని తీవ్ర ఒత్తిడి గురిచేయిస్తాయని వ్యాఖ్యానించింది.

అరుణ్ జైట్లీపై వ్యాఖ్యలు.. విమర్శలు

"ఇప్పుడు ఆయన మన మధ్య లేరు. అందుకని, ఈ విషయం ఇప్పుడు చెప్పకూడదు. కానీ, చెప్పక తప్పడం లేదు. సాగు చట్టాలపై మేం పోరాడుతున్నప్పుడు అరుణ్ జైట్లీ నా వద్దకు వచ్చారు. మీరు ఇలాగే వ్యతిరేకిస్తూ ఉంటే మీపై చర్యలు తీసుకోకతప్పదని హెచ్చరించారు" అని రాహుల్ వెల్లడించారు. అయితే, మీరు తప్పుడు వ్యక్తి వద్దకు వచ్చారని, కాంగ్రెస్‌వాదిని ఎవరూ బెదిరించడం కానీ, లొంగదీసుకోవడం కానీ చేయలేరని, తాము కాంగ్రెస్ వాళ్లమే కానీ పిరికివాళ్లం కాదని, బ్రిటిష్ వాళ్లే తమను లొంగదీసుకోలేక పోయారని ఆయనకు జవాబు ఇచ్చానని రాహుల్ చెప్పారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలను అరుణ్ జైట్లీ తనయుడు రోహన్ జైట్లీ ఖండించారు. తన తండ్రి 2019లోనే చనిపోయారని, కానీ, సాగు చట్టాలను మాత్రం 2020లో ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.

కావాలనే తొలగించారు: ఖర్గే

బిహార్ అసెంబ్లీ ఎన్నికల జాబితాల నుంచి నిరుపేదలు, అణచివేతకు గురైన, మైనారిటీల ఓట్లను కావాలనే ఎన్నికల సంఘం తొలగించిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పదవిలో ఉన్నా.. పదవీ విరమణ చేసినా నిబంధనలను ఉల్లంఘించిన ఎన్నికల సంఘం అధికారులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను వెరిఫికేషన్ ప్రక్రియలో అనుమతించాలని సుప్రీం కోర్టు చెప్పినా.. ఎన్నికల సంఘం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. రాజ్యాంగం కబ్జాలో ఉందని, రాజ్యాంగ నిర్మాణాన్ని ధ్వంసం చేయడానికి బీజేపీ తన అధికారాన్ని ఉపయోగిస్తోందని సోనియా గాంధీ దుయ్యబట్టారు. ఆమె ప్రత్యేక సందేశాన్ని సదస్సులో వినిపించారు.

లోకం తీరు



ఆలూ తల్లి టమాట!

శీతల వాతావరణాన్ని తట్టుకునే క్రమంలో దుంపలా ఆవిర్భావం

బీజింగ్, ఆగస్టు 2: టమాట నుంచి ఆలుగడ్డ పుట్టిందా? ఆ రెండింటికీ మధ్య కొన్ని లక్షల ఏళ్ల అనుబంధం ఉందా?.. చైనా శాస్త్రవేత్తల పరిశోధన ఈ అంశంపై కొత్త కోణాలను వెల్లడించింది. ప్రస్తుత దక్షిణ అమెరికా ఖండంలోని అండీస్ పర్వతప్రాంతంలో అడవి టమాట మొక్కకు, ఆలుగడ్డ వంటి ఎటుబిరోసమ్ అనే మొక్కతో 90 లక్షల ఏళ్ల క్రితం సంపర్కం జరిగి ఆలుగడ్డ అనే కొత్త మొక్క పుట్టిందని వీరు గుర్తించారు. టమాట, ఎటుబిరోసమ్ రెండూ కూడా 1.4 కోట్ల ఏళ్ల క్రితం ఒకే వృక్షజాతికి చెందినవని, తర్వాత కాలంలో అవి రెండూ విడివిడిగా అభివృద్ధి చెందాయని తెలుసుకున్నారు. చైనా అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన నిర్వహించారు. దీంట్లోభాగంగా.. రైతులు పండించే ఆలుగడ్డ రకాలు, అడవిలో పెరిగిన ఆలుగడ్డ రకాలకు చెందిన 450 జన్యుక్రమాలను విశ్లేషించారు. ఫలితాలపై ముఖ్య శాస్త్రవేత్త ఝియాంగ్ ఝూంగ్ మాట్లాడుతూ, ఆలుగడ్డ పుట్టుకకు కారణమైన టమాట, ఎటుబిరోసమ్.. రెండింటిలోనూ దుంపలకు ఉండేటువంటి వేళ్లు, కాండం వంటివి లేవని.. ఆ లక్షణం ఆలూలోనే ఆవిర్భవించిందని తెలిపారు. అండీస్ ప్రాంతంలో వాతావరణం అత్యంత శీతలంగా మారిపోతున్నందున దానిని తట్టుకొనేందుకే.. ఈ కొత్త లక్షణం అంకురించిందన్నారు. దీని వల్ల మొక్కకు అవసరమైన పోషకాలను నేల లోపల దుంప రూపంలో భద్రపర్చుకునే వీలు కలిగిందని ఝియాంగ్ పేర్కొన్నారు. ఈ పరిశోధనలో పాలుపంచుకున్న ప్రొఫెసర్ జియాన్‌క్వన్ లీ మాట్లాడుతూ, మనుషుల్లో వంశక్రమాలను తెలుసుకోవటానికి ఉపయోగించే 'ఫైలోజెనెటిక్ ఎనాలిసిస్' పద్ధతినే ఇక్కడ కూడా తాము వాడామని తెలిపారు. ఈ పరిశోధన వివరాలు సెల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

రష్యా చమురు కొనుగోళ్లను..
భారత్ ఆపేస్తోంది!

» ఇదో మంచి ముందడుగు: ట్రంప్
» అది అవాస్తవం: విదేశాంగ అధికారులు

వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఆగస్టు 2: భారత్, రష్యాలవి పతన ఆర్థిక వ్యవస్థలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఏకపక్ష వ్యాఖ్యలు చేశారు. 'రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపేస్తోంద'ంటూ చిత్రమైన వ్యాఖ్యలు చేశారు. శనివారం అమెరికాలోని వాషింగ్టన్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. "రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేస్తున్నట్టు నాకు సమాచారం వచ్చింది. అది సరైనదేనా, కాదా అనేది తెలియదు. కానీ ఒక మంచి ముందడుగు. ఏం జరుగుతుందో చూద్దాం.." అని పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దంటూ తీవ్రంగా ఒత్తిడి తెచ్చిన అమెరికా.. అందుకు అంగీకరించకపోవడంతో భారత్‌పై 25శాతం అదనపు సుంకాలు, జరిమానాలు విధిస్తున్నట్టుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు ట్రంప్ వ్యాఖ్యలను విదేశాంగ శాఖ అధికార వర్గాలు ఖండించాయి. "భారత ప్రయోజనాలు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుంది. రష్యా నుంచి చమురు, ఇతర ఉత్పత్తుల దిగుమతులను నిలిపివేసే దిశగా ఎలాంటి నిర్ణయం తీసుకున్న దాఖలాలు లేవు.." అని తెలిపాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు.

రాయితీలు తగ్గడంతో కొనుగోళ్లపై ప్రభావం?

వాస్తవానికి అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా తన చమురును అమ్ముకోవడానికి రాయితీ (డిస్కౌంట్)లు ఇస్తోంది. దీనితో రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు గత మూడు, నాలుగేళ్లలో భారీగా పెరిగాయి. కానీ ఇటీవల రష్యా తన రాయితీలను తగ్గించడం, రవాణా సమస్యలతో.. భారత రిఫైనరీలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తున్నాయని పలు గణాంకాలను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం వంటివి దాదాపుగా రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేశాయని పేర్కొంది.

మూడో అతిపెద్ద ఎకానమీగా అవతరిస్తున్నాం

ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలకు మోదీ కౌంటర్



వారాణసీలో నిర్వహించిన కార్యక్రమంలో ఓ దివ్యాంగుడికి సాయం చేస్తున్న మోదీ

» అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది
» ప్రపంచ పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి
» మనం స్వదేశీ ఉత్పత్తులపై దృష్టి సారించాలి
» విపక్షాలూ కలిసి రావాలని ప్రధాని పిలుపు

వారాణసీ, ఆగస్టు 2: 'భారత్, రష్యాలది డెడ్ ఎకానమీ' అంటూ పరుష వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, ఆయనను సమర్థించిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ప్రధాని మోదీ పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని స్పష్టంచేశారు. ఈ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ విధానాలపై దృష్టి సారించాల్సి ఉన్నదని ఆయన అన్నారు. విపక్షాలు సైతం రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, స్వదేశీ ఉత్పత్తులకు ఉమ్మడి ప్రచారం కల్పించాలని ప్రధాని కోరారు. భారత్‌పై దాడికి తెగిస్తే ఏఒక్కరినీ వదిలిపెట్టబోమని, ఒకవేళ పాతాళంలో దాక్కున్నా వెతికి పట్టుకుంటామంటూ..దాయాదిదేశం పాకిస్థాన్‌పై తీవ్ర స్వరం వినిపించారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని జీర్ణించుకోవడం కొంతమందికి కష్టంగా ఉన్నదంటూ విపక్షాలపై విరుచుకుపడ్డారు. మోదీ తన సొంత నియోజకవర్గం యూపీలోని వారాణసీలో శనివారం రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే పీఎం కిసాన్ యోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తూ ట్రంప్ చేసిన 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలతో పాటు ఆపరేషన్ సిందూర్, మహాదేవ్‌లపై విపక్షాల విమర్శలను కూడా ఈ సందర్భంగా మోదీ తిప్పికొట్టారు. "ప్రపంచ పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. ప్రతి దేశం తన సొంత ప్రయోజనాలనే చూసుకుంటోంది. మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తున్న వేళ మన ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. దేశంకోసం ఏది ఉత్తమమో దాన్నంతా ప్రభుత్వం చేస్తోంది." అని మోదీ అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలను ఆయన కోరారు.

ముహూర్తం చూస్తామా?

కాంగ్రెస్, ఇతర విపక్షాలు పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను కూల్చడంపై కలత చెందుతున్నాయని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. "పహల్గాం దాడి హంతకులను పార్లమెంటు సమావేశాలప్పుడే ఎన్‌కౌంటర్ ఎలా చేస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఉగ్రవాదులను చంపడానికి ముహూర్తం చూస్తామా? దొరికినప్పుడు చంపకుండా వదిలేస్తామా.?" అంటూ ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. "తన ఎదుట అన్యాయం, ఉన్మాదం జరుగుతుంటే మహాదేవుడు రౌద్రరూపం దాల్చుతారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం ఇదే రూపాన్ని చూసింది. భారత్‌తో పెట్టుకుంటే ఎవరినీ వదిలిపెట్టం. ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాక్‌లోని వైమానిక స్థావరాలు ఇప్పటికీ ఐసీయూలోనే ఉన్నాయి. మన బ్రహ్మోస్ క్షిపణులు దాయాదికి నిద్రను దూరంచేశాయి. ఈ క్షిపణులను ఇకపై యూపీలోనే తయారుచేయబోతున్నాం. లఖనవూలో ఉత్పత్తిని ప్రారంభించనున్నాం. అయితే, కొంతమందికి ఆపరేషన్ సిందూర్ విజయం రుచించకపోవడం దురదృష్టకరం. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు మాత్రం పాక్ దుస్థితిని చూసి తట్టుకోలేకపోతున్నాయి. ఉగ్రవాదుల పరిస్థితి చూసి అక్కడ పాక్, ఇక్కడ ఈ రెండు పార్టీలూ రోదిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌ను 'తమాషా'గా తూలనాడుతూ, మన బలగాల శౌర్యప్రతాపాలను కాంగ్రెస్, ఎస్పీ నేతలు పదేపదే కించపరుస్తున్నారు" అని మోదీ మండిపడ్డారు.

రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు

వారాణసీ, ఆగస్టు 2 : పీఎం కిసాన్ యోజన కింద దేశవ్యాప్తంగా ఉన్న 9.70 కోట్లమంది రైతుల ఖాతాల్లో రూ.20,500 కోట్ల నిధులను ప్రధాని మోదీ జమ చేశారు. ఇది 20వ విడత సాయం. శనివారం తన సొంత నియోజకవర్గం వారాణసీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ నిధులను ఆయన విడుదల చేశారు. పీఎం కిసాన్ పథకాన్ని ఫిబ్రవరి 2019లో మోదీ ప్రారంభించారు. ఇప్పటివరకు అన్నదాతల ఖాతాల్లో 3.90 లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వం జమ చేసింది. కాగా, వారాణసీ నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా రూ.రెండు వేల కోట్లకుపైగా విలువైన పలు ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. 2014లో ఇక్కడి నుంచి మోదీ పార్లమెంటుకు తొలిసారి ఎన్నికయ్యారు. ఇప్పటివరకు 51 సార్లు తన నియోజకవర్గాన్ని ఆయన సందర్శించారని బీజేపీ రైతు విభాగం అధ్యక్షుడు దిలీప్ పటేల్ వివరించారు.

ప్రజ్వల్ రేవణ్ణకు యావజ్జీవం

పనిమనిషిపై అత్యాచారం కేసులో శిక్ష

» 10 లక్షల జరిమానా..అందులో 7 లక్షలు బాధితురాలికి..
» తీర్పు వెల్లడించిన ప్రజాప్రతినిధుల కోర్టు



ప్రజ్వల్ రేవణ్ణ

బెంగళూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు(34) బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. పనిమనిషిపై అత్యాచారం కేసులో నేరం రుజువైనట్లు కోర్టు శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. న్యాయాధికారి సంతోశ్ గజానన భట్ శనివారం శిక్షను ఖరారు చేశారు. వివిధ సెక్షన్‌ల కింద శిక్ష వేయడంతోపాటు రూ.10 లక్షల జరిమానా కూడా విధించారు. జరిమానాలో రూ.7 లక్షలను బాధితురాలికి(పని మనిషి) ఇవ్వాలని ఆదేశించారు. కర్ణాటక రాజకీయాల్లో దేవెగౌడ కుటుంబానికి ఎంతో పేరుంది. ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, ప్రధాన మంత్రిగా సేవలు అందించిన దేవెగౌడ, ప్రస్తుతం 92 ఏళ్ల వయసులోనూ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. దేవెగౌడ మరో కుమారుడు కుమారస్వామి కేంద్రమంత్రిగా ఉన్నారు. రెండో కుమారుడు రేవణ్ణ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ప్రజ్వల్ తమ్ముడు సూరజ్ ఎమ్మెల్సీగా ఉన్నారు.

ఎన్నికల సమయంలో..

2024 లోక్‌సభ ఎన్నికలలో ప్రజ్వల్ రేవణ్ణ రెండోసారి జేడీఎస్ తరఫున హసన్ స్థానం నుంచి పోటీ చేశారు. ప్రజ్వల్ లైంగిక దౌర్జన్యానికి పాల్పడుతుండగా తీసిన వీడియోలు, ఫొటోలు ఉన్న పెన్‌డ్రైవ్‌లు సరిగ్గా పోలింగ్‌కు (ఆ ఏడాది ఏప్రిల్) రెండు రోజుల ముందు బయటకు వచ్చాయి. ఆ వీడియోల్లో 48 ఏళ్ల వయసున్న ప్రజ్వల్ పనిమనిషికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు కూడా ఉన్నాయి. ప్రజ్వల్ లైంగిక దాడి చేస్తూ స్వయంగా వీడియోలు చిత్రీకరించుకున్నారు. ఇవి వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా కలకలం రేగింది. బాధితురాలు (పనిమనిషి) పోలీసులను ఆశ్రయించారు. ఈ వివాదం నేపథ్యంలో పోలింగ్ జరిగిన రోజు రాత్రే ప్రజ్వల్ యూరప్ దేశాలకు వెళ్లారు. మే 31న ఆయన బెంగళూరుకు తిరిగి రాగా, ఎయిర్‌పోర్టులోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేసిన సిట్ అధికారులు ప్రజాప్రతినిధుల కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ నెల ఒకటో తేదీ, శుక్రవారం, అత్యాచారం కేసులో ప్రజ్వల్ నేరం రుజువైందని న్యాయస్థానం ప్రకటించింది.

కోర్టులోనే గట్టిగా ఏడ్చేసిన ప్రజ్వల్

కోర్టు కార్యకలాపాలు శనివారం ఉదయం ప్రారంభం కాగానే, 'చివరిగా చెప్పుకొనేది ఏమైనా ఉందా..?' అని ప్రజ్వల్‌ను న్యాయాధికారి ప్రశ్నించారు. దీంతో ప్రజ్వల్ కన్నీరు పెట్టుకున్నారు. ఒక దశలో గట్టిగా ఏడ్చారు. రాజకీయాల్లో వేగంగా ఎదగడమే తాను చేసిన తప్పు అని రోదించారు. న్యాయాధికారి సంతోశ్ గజానన భట్ సాయంత్రం 4 గంటల తర్వాత తీర్పు ప్రకటించారు. కాగా, పనిమనిషి(బాధితురాలు) కిడ్నాప్ కేసులో ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ కూడా అరెస్టు అయి, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు.

అన్నీ తానే..
అంతా తందానే!





(మొదటిపేజీ తరువాయి)


చేసుకున్నారని, విధివిధానాలను తుంగలో తొక్కారని, ఫలితంగా భారీగా ప్రజాధనంతోపాటు బ్యారేజీలూ కుంగుబాటుకు గురయ్యాయని పేర్కొన్నారు.

కేసీఆర్, హరీశ్‌లదే నిర్ణయం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలు నిర్మించాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, సాగునీటి శాఖ మంత్రి హరీశ్ రావు సొంతంగా తీసుకున్నారని, అది వారి వ్యక్తిగత నిర్ణయమని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి లాంఛనంగా ఎటువంటి నిర్ణయం లేదని స్పష్టం చేసింది. బ్యారేజీల నిర్మాణానికి 2016 జూలై/ఆగస్టులో నిర్మాణ సంస్థతో ఒప్పందం జరిగిందని, కానీ, వ్యాప్కోస్‌తో సంప్రదింపులు జరపకుండా 2016 అక్టోబరు 22న హైపవర్ కమిటీ నిర్ణయం పేరుతో బ్యారేజీల నిర్మాణ ప్రదేశాలను మార్చారని తెలిపింది. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదనను నిపుణుల కమిటీ నిర్ద్వంద్వంగా తిరస్కరించిందని, ప్రత్యామ్నాయంగా వేమనపల్లిని సూచించిందని, కేసీఆర్, హరీశ్ రావులు ఉద్దేశపూర్వకంగానే దానిని పట్టించుకోలేదని, పూర్తిగా పక్కనపడేశారని తప్పుబట్టింది. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదనేది సాకుగా చూపారని, కానీ, ఆ వాదనలో నిజాయితీ, చిత్తశుద్ధి కనిపించడం లేదని పేర్కొంది. మూడు బ్యారేజీల నిర్మాణానికి ప్రాథమికంగా పాలనపరమైన అనుమతులు తీసుకున్నారని, ఇందుకు జీవోలు 231, 232, 233 జారీ చేశారని, కానీ, వాటిని క్యాబినెట్ ముందు ఉంచలేదని, మంత్రివర్గ ఆమోదం తీసుకోలేదని, ఇది ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు రూ.71,436 కోట్లని ప్రధాన మంత్రికి 21.2.2016న అప్పటి సీఎం రాసిన లేఖలో పేర్కొన్నారని, విచిత్రం ఏమిటంటే, అప్పటికి వ్యాప్కోస్ తుది డీపీఆర్‌ను ప్రభుత్వానికి సమర్పించలేదని తప్పుబట్టింది. అలాగే, తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టు ప్రదేశాన్ని తరలించవద్దన్న నిపుణుల కమిటీ సూచనను అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోలేదని, ఎటువంటి జవాబుదారీతనం లేకుండా అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారని, పాలన ప్రక్రియను తుంగలో తొక్కారని తప్పుబట్టింది. ఇక, కొత్తగా ఏర్పడిన రాష్ట్రాన్ని ఆర్థికంగా సంరక్షించడంలో అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ చిత్తశుద్ధి ప్రదర్శించలేదని నివేదిక తప్పుబట్టింది. ఆర్థిక జవాబుదారీతనం తన బాధ్యత కాదనుకున్నారని, ఆర్థిక శాఖ కూడా కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు లిమిటెడ్ (కేఐపీసీఎల్)లో భాగమైనా, దానిని పూర్తిగా ఆ సంస్థ మీదకే తోసేశారని స్పష్టం చేసింది.

రెండుసార్లు అంచనాల సవరణ

బ్యారేజీల నిర్మాణం, నిర్వహణ టర్న్‌కీ పద్ధతిలో జరగాలని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) సూచించగా.. గంపగుత్త (లంప్సమ్) పద్ధతిలో నిర్మాణ సంస్థలకు పనులు కట్టబెట్టారని నివేదిక తప్పుబట్టింది. ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచేశారని పేర్కొంది. తొలుత ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.38,500 కోట్లు కాగా.. ఆ తర్వాత దానిని రూ.71,436 కోట్లకు; చివరికి రూ.1,10,248.48 కోట్లకు పెంచేశారని పేర్కొంది. నిర్మాణ సంస్థలకు అనుచితంగా లబ్ధి చేకూర్చడానికి రెండు దఫాలుగా అంచనాలను సవరించారని తప్పుపట్టింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీ స్థలాలను మార్చారని, ఆ పేరిట బ్యారేజీల పొడవు, ఫ్లడ్ బ్యాంకులు, డిజైన్లలో మార్పులు చేశారని నివేదిక పేర్కొంది. వాటిని అడ్డం పెట్టుకుని ప్రాజెక్టు వ్యయాలను ఇబ్బడిముబ్బడిగా పెంచేశారని తప్పుబట్టింది. నిర్మాణ సంస్థలకు అనుచితంగా లబ్ధి చేకూర్చడానికి దురుద్దేశంతోనే ఈ నిర్ణయాలన్నీ తీసుకున్నారని, ప్రభుత్వ ఖజానా నుంచి నిధులను తప్పుదారి పట్టించారని తప్పుబట్టింది. మేడిగడ్డ నిర్మాణం పూర్తి కాకుండానే పూర్తయినట్లు నిర్మాణ సంస్థకు ధ్రువీకరణ పత్రం ఇచ్చారని, బ్యారేజీల్లో లోపాలు బయటపడినా.. లీకేజీలు కనిపించినా పట్టించుకోకుండా వీటిని జారీ చేయడాన్ని నివేదిక తప్పుబట్టింది. నిజానికి, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రానికి జీవనాడి అని, కానీ, పాలనలో, ప్లానింగ్‌లో, సాంకేతిక, ఆర్థిక క్రమశిక్షణలో సుస్పష్ట నిర్లక్ష్యంతో భారీ ఎత్తున ప్రజా ధనం వృథా కావడానికి కారణమయ్యారని తప్పుబట్టింది. ఎవరికి వారు వ్యక్తిగత నిర్ణయాలకు తోడు రాజకీయ నాయకత్వం అనవసర జోక్యం ఇందుకు ప్రధాన కారణమని తప్పుబట్టింది.




మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్ (ఫైల్)

బ్యారేజీల్లో నీటి నిల్వ నిర్ణయం కేసీఆర్‌దే

బ్యారేజీలను నీటిని మళ్లించడానికే కట్టాలని, నిల్వ చేయడానికి కాదని, కానీ, బ్యారేజీల్లో నిత్యం నీటిని పూర్తి సామర్థ్యంతో నిల్వ చేయాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారని, బ్యారేజీలు విఫలం కావడానికి ఇది ప్రధాన కారణమని నివేదిక తేల్చి చెప్పింది. బ్యారేజీలను 2019లో ప్రారంభించారని, మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు 2023 అక్టోబరు 21న కుంగిందని, ప్రారంభం నుంచి అప్పటి వరకూ వాటి నిర్వహణ (ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) పనులు చేయలేదని నివేదిక తప్పుబట్టింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సీపేజీలు బయటపడేదాకా ఈ పనులు చేయలేదని, వానాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయనే నివేదికలు కూడా సిద్ధం చేయలేదని తెలిపింది. బ్యారేజీల డిజైన్‌ను తేలియాడే విధంగా (పర్మియబుల్ ఫౌండేషన్)తో చేసి, వాటిని రిజర్వాయర్లుగా వినియోగించారని, నియమావళికి ఇది విరుద్ధమని తేల్చి చెప్పింది. ఇక, బ్యాక్ వాటర్ అధ్యయనాలు, టెయిల్ వాటర్ రేటింగ్ కర్వ్‌లు, జీ-డీ కర్వ్‌లు, జియో ఫిజికల్ పరీక్షలేవీ చేయకుండా అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం చేపట్టారని తప్పుబట్టింది. బ్యారేజీల డిజైన్లు తయారు చేసే ముందు నమూనా అధ్యయనాలు జరగాల్సి ఉందని, కానీ, అవేవీ చేయకుండానే డిజైన్లు చేశారని పేర్కొంది. నిర్మాణంలో నాణ్యత లోపించిందని, థర్డ్ పార్టీతో పరిశీలన చేయించలేదని పేర్కొంది. ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాత 2019లో తొలిసారి వరదలు వచ్చాయని, అదే ఏడాది నవంబరులో గేట్లు మూశారని, అప్పుడు దిగువ భాగం (డౌన్ స్ట్రీమ్)లో రక్షణ వ్యవస్థలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయని, అప్రాన్లు దెబ్బతినడం, సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు చెల్లాచెదురయ్యాయని, నాలుగేళ్లపాటు ఓ అండ్ ఎం పనులు చేయకపోవడమే ఇందుకు కారణమని స్పష్టం చేసింది. జాతీయ ఆనకట్టల భద్రత చట్టం-2021 ప్రకారం వరదకు ముందు, తర్వాత బ్యారేజీల పరిస్థితిపై నివేదికలు సమర్పించాల్సి ఉంటుందని, వాటిని తెప్పించుకునే బాధ్యత ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం- డ్యామ్ సేఫ్టీ)దేనని, ఆయన ఈ బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించలేదని తప్పుబట్టింది. మేడిగడ్డ నిర్మాణ సంస్థతో అధికారులు కుమ్మక్కై భారీ మొత్తంలో ప్రజాధనం దోచుకోవడానికి దురుద్దేశపూర్వకంగా వ్యవహరించారని కమిషన్ తప్పుపట్టింది. బ్యారేజీలపై వ్యాప్కోస్ నివేదికను పక్కనపెట్టినందున.. ఆ సంస్థకు చెల్లించిన రూ.6.77 కోట్లను బాధ్యులైన అధికారుల నుంచి రికవరీ చేయాలని కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ లోపాలు సరిచేయడం, మరమ్మతులు చేయాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలదేనని తేల్చిచెప్పింది.

కమిషన్ ముందు తప్పుడు సాక్ష్యాలు

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలు కట్టాలని తొలుత నిర్ణయం తీసుకున్నాకే.. ఆయా చోట్ల బ్యారేజీలు కట్టడానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సిద్ధం చేసే బాధ్యతను వ్యాప్కోస్‌కు అప్పగించారని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నిర్ధారించింది. వ్యాప్కోస్ నివేదిక ఆధారంగా బ్యారేజీలు కట్టామని కేసీఆర్, హరీశ్ రావు కమిషన్ ముందు తప్పుడు సాక్ష్యాలు ఇచ్చారని పేర్కొంది.

త్రిసభ్య కమిటీతో నేడు మంత్రి సమీక్ష

కాళేశ్వరం బ్యారేజీలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికపై అధ్యయనం చేసి, నివేదిక సారాంశం (జిస్ట్)ను సిద్ధం చేయడానికి వీలుగా వేసిన త్రిసభ్య కమిటీతో ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశం కానున్నారు. నీటి పారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్, న్యాయ శాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి సభ్యులుగా ఈ కమిటీని ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ కమిటీ నివేదికను అసాంతం పరిశీలించి.. సారాంశం (జిస్ట్) సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించగా శనివారం కమిటీ సమావేశమై ముసాయిదాను తయారు చేసింది.

నివేదికపై రేపే క్యాబినెట్ భేటీ

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 4న జరగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలోని ఆరో అంతస్తులో గల క్యాబినెట్ మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. అందువల్ల అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రూపొందించిన నివేదికను రెండు రోజుల క్రితం జస్టిస్ పీసీ ఘోష్ ప్రభుత్వానికి అందజేసిన విషయం తెలిసిందే. ఈ నివేదికలోని అంశాలను రాష్ట్ర మంత్రిమండలి కూలంకుషంగా చర్చించనుంది. తదుపరి దీన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశముంది. నివేదికపై ఎలా ముందుకు వెళ్లాలన్నదానిపై అసెంబ్లీలో చర్చించి, ఆమోదం పొందవచ్చని తెలుస్తోంది. ఈ నివేదికతో పాటు ఇతర అంశాలూ క్యాబినెట్ భేటీలో చర్చకు రానున్నాయని సమాచారం.



బీసీ రిజర్వేషన్ల సాధనకు..
జాగృతి 72 గంటల నిరాహార దీక్ష

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 4 నుంచి 7 వరకు నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తెలిపారు. బీసీ కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారికి 42 శాతం రిజర్వేషన్ల కోసం ఆందోళనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ చెబితే.. విద్య, ఉద్యోగాల్లోనూ 42 శాతం ఇవ్వాల్సిందేనని జాగృతి డిమాండ్ చేసిందని తెలిపారు. జాగృతి, బీసీ సమాజం ఒత్తిడితోనే ప్రభుత్వం దిగి వచ్చి పంచాయతీరాజ్ చట్టం-2018కి సవరణలు చేస్తూ ఇటీవల క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేసి గవర్నర్ ఆమోదం కోసం పంపిందని చెప్పారు. దీనికి గవర్నర్ ఆమోదం తెలిపి గెజిట్ జారీ చేయాల్సి ఉండగా, మళ్లీ దానిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ఆలస్యమవుతున్నందున 72 గంటల నిరాహార దీక్ష చేయాలని సంకల్పించామని కవిత తెలిపారు.

హెచ్ఎంఎస్‌తో సింగరేణి జాగృతి దోస్తీ

గోదావరిఖని, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బొగ్గు గని కార్మికుల పక్షాన పోరాడతామంటూ సింగరేణి జాగృతిని ఏర్పాటు చేసిన కవిత.. కోల్ బెల్ట్‌లో హెచ్ఎంఎస్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి గత నెల 30న హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌తో హైదరాబాద్‌లో కవిత చర్చించినట్టు తెలిసింది. ఈ నెల 10న సింగరేణిలోని 11 డివిజన్ల నుంచి సింగరేణి జాగృతి ప్రతినిధులు, హెచ్ఎంఎస్ అన్ని డివిజన్ల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి పొత్తును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

రేపు కాంగ్రెస్ ఢిల్లీ యాత్ర

- హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైలులో పయనం
- బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడికి సన్నద్ధం

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు కాంగ్రెస్ ఢిల్లీ పర్యటనకు సిద్ధమైంది. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైలులో పార్టీ నేతలతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు ఢిల్లీకి బయలుదేరుతున్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌తో పాటు బీసీ మంత్రులు, బీసీ సంఘాల ప్రతినిధులు ఢిల్లీలో సమావేశమై రిజర్వేషన్ల బిల్లుపై పార్లమెంటులో చర్చ కోసం కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలతో వాయిదా తీర్మానాలు ఇప్పించనున్నారు. బుధవారం జంతర్‌మంతర్ వద్ద రేవంత్, మహేశ్ గౌడ్ నేతృత్వంలో జరిగే ధర్నాలో రాష్ట్రానికి చెందిన బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొంటారు. అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో పాటు కాంగ్రెస్ మిత్ర పక్ష పార్టీల నాయకులు దీనికి సంఘీభావం తెలుపుతారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని రాష్ట్రపతి ముర్ముకు గురువారం వినతిపత్రం సమర్పించనున్నారు.

అడిషనల్, స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ల బదిలీ

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇద్దరు అడిషనల్ కలెక్టర్లు, ఇద్దరు స్పెషల్ గ్రేడ్ కలెక్టర్లతో పాటు 8 మంది డిప్యూటీ కలెక్టర్లను సర్కారు బదిలీ చేసింది. ఈమేరకు రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ఓఎస్డీగా పనిచేస్తున్న అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డిని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం వేచి ఉన్న మరో అదనపు కలెక్టర్ కిమ్యానాయక్‌ను వనపర్తి అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా నియమించారు. మిగతా అధికారుల బదిలీల గురించి వివరాలు తెలియాల్సి ఉంది.

కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ దోషి!

రూ. 40 వేల కోట్ల ప్రాజెక్టును లక్ష కోట్లకు తీసుకెళ్లారు.. అన్నీ తానై అక్రమాలకు పాల్పడ్డారు

- లక్షా 20 వేల కోట్ల ప్రజాధనాన్ని గోదావరిలో పోశారు
- కేసీఆర్‌కు శిక్ష పడాల్నా.. వద్దా?
- టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్
- 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కదం తొక్కుదాం: మీనాక్షి నటరాజన్



జోగిపేట రూరల్/అల్లాదుర్గం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కమీషన్ల కోసం కక్కుర్తిపడి అధికారులను కాదని, అన్నీ తానై అక్రమాలకు పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు దోషి అని కాళేశ్వరం కమిషన్ తేల్చిందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. జనహిత పాదయాత్రలో భాగంగా రెండో రోజైన శనివారం సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ పరిధి సంగుపేట శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. అలాగే జోగిపేటలోని నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి దామోదర రాజనర్సింహ, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి, దామోదర రాజనర్సింహ కుమార్తె త్రిషతో కలిసి శ్రమదానం చేశారు. కళాశాల ఆవరణలో మొక్క నాటారు. కార్యకర్తల సమావేశంలో మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం నిర్మాణంపై గొప్పలు చెప్పుకొన్న పెద్దాయన ఇంజనీర్లు, అధికారులు చెప్పినా వినకుండా అన్నీ తానై వ్యవహరించి రూ.లక్షల కోట్లు వృథా చేశారన్నారు. కమీషన్ల కక్కుర్తితో ఆ ప్రాజెక్టును నాసిరకంగా నిర్మించడంతో బీటలు వారిందన్నారు. ఒక్క పిల్లరు కూలితే ఏమవుతుందని మాజీమంత్రి తారాక రామారావు అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంట్లో ఒక్క పిల్లరు కూలితే.. ఆ ఇంట్లో ఉండగలమా? అంటూ కేటీఆర్‌ను ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించాల్సిన ప్రదేశంలో కాకుండా కమీషన్ల కోసం మరో చోట కట్టి.. ప్రాజెక్టు వ్యయం రూ. 40 వేల కోట్ల నుంచి లక్షా 20 వేల కోట్లకు పెంచి ప్రజాధనాన్ని గోదావరి పాలు చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోపిడీ చేస్తుందన్న ఉద్దేశంతోనే గత ఎన్నికల్లో ప్రజలు వారిని కాదని, కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై నియమించిన కమిషన్ అక్రమాల నిగ్గు తేల్చి కేసీఆర్‌ను బోనులో నిలబెట్టిందని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడిన మాజీ సీఎం కేసీఆర్‌కు శిక్ష పడకూడదా? అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ దేశం కోసం అహర్నిశలు పాటుపడుతూ, గాంధీ సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతుందని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించిందని ఆరోపించారు.

యువత రాజకీయాల్లోకి రావాలి: మీనాక్షి

విద్యార్థులు చదువులు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసమే చూడకుండా రాజకీయాల్లోకి కూడా రావాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పిలుపునిచ్చారు. జనహిత పాదయాత్రలో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో కలిసి శ్రమదానం చేసిన అనంతరం కళాశాల విద్యార్థినులతో ఆమె ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని, యువతులు రాజకీయాలపై ఆసక్తి చూపాలని ఉద్బోధించారు. మాతృభాషపైనే కాకుండా హిందీ, ఇంగ్లిష్ భాషలపై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమాల్లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, మాజీమంత్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు షాక్

- 21లోపు ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయండి.. నోటిసులు ఇవ్వండి
- కేటీఆర్ పరువు నష్టం దావా కేసులో పోలీసులకు నాంపల్లి కోర్టు ఆదేశం
- రాజకీయాల్లో విషం చిమ్మేవారికి ఇది గుణపాఠం: కేటీఆర్
- కేసులు, కొట్లాటలు కొత్త కాదు.. న్యాయవ్యవస్థపై గౌరవం ఉంది: సురేఖ

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): టాలీవుడ్ నటులు నాగచైతన్య, సమంత విడాకులకు మాజీ మంత్రి కేటీఆరే కారణం అంటూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశించింది. సురేఖ చేసిన వ్యాఖ్యల వల్ల తన పరువుకు భంగం కలిగిందని నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో గత అక్టోబరులో కేటీఆర్ క్రిమినల్ పరువు నష్టం దావా వేశారు. దీనిపై సుదీర్ఘంగా విచారణ జరిపిన న్యాయస్థానం ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించి, సురేఖపై ఈనెల 21లోపు క్రిమినల్ కేసు నమోదు చేసి, ఆమెకు నోటీసులు జారీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కేటీఆర్‌పై సురేఖ నిరాధారమైన ఆరోపణలు చేశారన్న తమ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించిందని కేటీఆర్ తరఫు న్యాయవాది సిద్ధార్థ్ తెలిపారు. సాక్షుల వాంగ్మూలాలను, కోర్టులో తాము సమర్పించిన వీడియోలు, వార్తలను న్యాయస్థానం పరిశీలించి బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద ఈ ఉత్తర్వులు ఇచ్చిందని ఆయన చెప్పారు. కాగా.. గతంలో మీడియాలో, ఇతరత్రా మాధ్యమాల్లో వచ్చిన వార్తల ఆధారంగానే సురేఖ ఆ వ్యాఖ్యలు చేశారని ఆమె తరఫు న్యాయవాది చేసిన వాదనలను న్యాయస్థానం తోసిపుచ్చింది.

అర్థంలేని విమర్శల చేస్తే అధికారం రక్షించదు: కేటీఆర్

"నిజం ఎప్పటికైనా గెలిచి తీరుతుంది" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పరువు నష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై కేసు నమోదు చేయాలంటూ నాంపల్లి కోర్టు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో కేటీఆర్ ఈ వ్యాఖ్య చేశారు. "నువ్వు అర్థం లేని విమర్శలు చేస్తే అధికారం నిన్ను రక్షించదు. ప్రజల జీవితాలను బురదలోకి లాగే హక్కు అధికారం నీకు ఇవ్వదు. అధికారమనేది ప్రజలకు సేవ చేసేందుకు ఓ అవకాశం తప్ప.. ప్రత్యర్థులపై వదంతులు ప్రచారం చేయడానికో.. వ్యక్తిత్వ హననం చేయడానికో.. బురద చల్లడానికో కాదు. రాజకీయాల పేరుతో విషం చిమ్మే ప్రతి ఒక్కరికీ ఇది ఒక గుణపాఠం అవుతుందని ఆశిస్తున్నాను. గెలిచే వరకు పోరాడుతూనే ఉంటాం.. ఈపోరాటంలో మనం ఇంకా సగం వరకే వచ్చాం" అని ఎక్స్‌లో ఖాతాలో కేటీఆర్ పేర్కొన్నారు.

..సాధారణ విషయం: సురేఖ

కేసులు, కొట్లాటలు కొత్త కాదని, తన జీవితమే ఒక పోరాటం అని మంత్రి కొండా సురేఖ అన్నారు. న్యాయ వ్యవస్థపై గౌరవం, నమ్మకం తనకు ఉన్నాయని చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై తాను చేసిన ఆరోపణల కేసుకు సంబంధించి నాంపల్లి కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో సురేఖ స్పందించారు. తన కేసును విచారణకు తీసుకొని ముందుకెళ్లాలని కోర్టు స్పష్టం చేసిందని.. కోర్టులు విచారణకు తీసుకోవాలని చెప్పడం ఏ కేసులోనైనా సర్వసాధారణమైన విషయం అని అన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చట్టం తనపని తాను చేసుకుపోతుందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బోధనాస్పత్రుల్లో నకిలీ రోగుల వివరాలిస్తే కఠిన చర్యలు

- 'అభా' ఐడీ నమోదు చేయాల్సిందే
- లేకుంటే సీట్ల పెంపు ఉండబోదు : ఎన్ఎంసీ

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బోధనాస్పత్రులు నమోదు చేసే రోగుల వివరాలు నకిలీవని తేలితే కఠిన చర్యలు తప్పవని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వైద్య కళాశాలల అనుబంధ ఆస్పత్రులలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా) ఐడీని నమోదు చేయాలని గతంలోనే ఆదేశించింది. అయితే అభా ఐడీ నమోదును అన్ని వైద్య కళాశాలలు చేయడం లేదని ఎన్ఎంసీ దృష్టికి వచ్చింది. దీంతో ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి అన్ని రాష్ట్రాల హెల్త్ సెక్రటరీలకు తాజాగా లేఖలు రాసింది. అలాగే అన్ని ప్రైవేటు హెల్త్ యూనివర్సిటీలు, ప్రైవేటు వైద్య కళాశాలలకు ఆ లేఖను పంపింది. తక్షణమే తమ ఆదేశాలను పాటించాలని కోరింది. దాని ప్రకారం.. అన్ని వైద్య కళాశాలల అనుబంధ ఆస్పత్రులు రోగుల రికార్డులను నిర్వహించాలి. ఇన్‌పేషెంట్ రోగుల వివరాలను యూనిట్ ఫ్యాకల్టీ వద్ద నమోదు చేయాలి. ఆ బాధ్యత సీనియర్ రెసిడెంట్ వైద్యుడు తన పేరుతో సంతకం చేసి మరీ ఇన్‌పేషెంట్ రోగుల వివరాలను రికార్డు చేయాలి. ఇక రోగులకు చేసిన రక్త, మూత్ర ఇతర పరీక్షల నివేదికలపై సంబంధిత విభాగాపు వైద్యుడు విధిగా సంతకం చేయాలి. బోధనాస్పత్రులన్నీ ఓపీ, ఐపీ రోగుల రిజిస్ట్రేషన్‌తో పాటు అభా ఐడీని రిజిష్టర్ చేయించుకోవాలని పేర్కొంది. అభా ఐడీ ఉన్న కళాశాలలకే భవిష్యత్‌లో సీట్లు పెంపు, కొత్త పీజీ కోర్సుల ఏర్పాటుకు అనుమతినిస్తామని స్పష్టం చేసింది. అలాగే అభా ఐడీ లేదని ఏ రోగికి చికిత్స నిరాకరించవద్దని సూచించింది.

తెలంగాణలో అమెరికన్ వ్యాపారాల విస్తరణకు కృషి చేస్తా

- హైదరాబాద్‌కు కొత్తగా రాబోతున్న యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భారత్, అమెరికా మధ్య దౌత్య సంబంధాలను మెరుగుపర్చడానికి తాను ప్రాధాన్యమిస్తానని హైదరాబాద్‌కు కొత్తగా రాబోతున్న యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ చెప్పారు. విశ్వాసం, సాంకేతికత, మేధో సంపత్తి పరస్పర బదిలీ వంటి అంశాల ఆధారంగా దౌత్య బంధాన్ని దృఢపర్చడానికి ప్రయత్నిస్తానని ఆమె అన్నారు. తెలంగాణలో అమెరికన్ వ్యాపారాలు విస్తరించడానికి కృషి చేస్తానని చెప్పారు. హైదరాబాద్‌కు రాబోయే ముందు యూఎస్-ఇండియా సాలిడారిటీ మిషన్ వ్యవస్థాపకుడు, ఇన్‌ఫ్లుయెన్షియల్ ఇండియన్ అమెరికన్ బిజినెస్ ఇంప్యాక్ట్ గ్రూప్ (ఐఏఎంబీఐజీ) సహ వ్యవస్థాపకుడు రవి పులి ఆధ్వర్యంలో వర్జీనియాలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో లారా విలియమ్స్ మాట్లాడారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ స్థానంలో లారా విలియమ్స్ రాబోతున్నారు. దౌత్యానికి సాంకేతికత, విశ్వసనీయత ప్రధానమని, దాన్ని ఆధారంగా చేసుకొని ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను మెరుగుపరుస్తానని ఆమె చెప్పారు. యూఎస్ వీసాల జారీలో జాప్యంపై మాట్లాడుతూ.. హైదరాబాద్ కార్యాలయంలోని 54 వీసా విండోస్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందిని నియమించుకుని మరింత చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు.

సృష్టి ఫెర్టిలిటీ కేసులో ముగ్గురి విచారణ

- డాక్టర్ నమ్రత, కళ్యాణి, సంతోషిలను ప్రశ్నించిన పోలీసులు

అడ్డగుట్ట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ మోసం కేసులో ముగ్గురు నిందితులను గోపాలపురం పోలీసులు ఇంటరాగేట్ చేశారు. తమ కస్టడీలో ఉన్న డాక్టర్ నమ్రతను, చంచల్‌గూడ జైలు నుంచి తీసుకొచ్చిన విశాఖ సృష్టి కేంద్రం మేనేజర్ కళ్యాణిని, మరో నిందితురాలు సంతోషిని నార్త్‌జోన్ కార్యాలయంలో ఒకే చోట ఉంచి ప్రశ్నించారు. ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం, అండాలు, స్పెర్మ్ సేకరణ, చిన్నారుల విక్రయంపై ప్రశ్నించినా డాక్టర్ నమ్రత సహకరించలేదని సమాచారం. డాక్టర్ నమ్రత గతంలో జైలుకు వెళ్లి వచ్చి ఉండటంతో తప్పించుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఏజెంట్ సంతోషి ద్వారా ఇప్పటి వరకు ఎంత మంది దంపతులు వచ్చారు, ఎంత మంది పిల్లలను విక్రయించారనే విషయాలపై పోలీసులు ఆరా తీశారు. ఆస్పత్రి నుంచి సీజ్ చేసిన రికార్డుల్లో ఉన్న వారి వివరాలు, కేసుల గురించి అడగ్గా గుర్తు లేదంటూ డాక్టర్ నమ్రత తప్పించుకునే యత్నం చేసినట్లు తెలిసింది.

భారీగా ఇళ్లు, ఫామ్ హౌస్‌ల కొనుగోలు

దంపతులను మోసం చేసి సంపాదించిన డబ్బుతో నమ్రత మియాపూర్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, యూసఫ్‌గూడతోపాటు ఏపీలో ఫామ్‌హౌస్‌లు, ఇళ్లు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నమ్రత గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి ఏజెంట్ల సహకారంతో పేద మహిళలను ఉచ్చులోకి దింపినట్లు గుర్తించారు. పేద మహిళలను విశాఖపట్నం, విజయవాడకు తరలించి వారికి పుట్టిన చిన్నారులను సరోగసీ పేరుతో దంపతులకు విక్రయాలు చేస్తున్నట్లు పోలీసులు తేల్చారు. ఈ కేసుకు సంబంధించి త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీసీపీ రేష్మి తెలిపారు.

వయసు పెరగొద్దు మెరుపు తరగొద్దు!



ఎంత డోసు అయినా.. ఎంత ఖర్చయినా.. వయసు కనిపించకుండా తంటాలు

- విచ్చలవిడిగా యాంటీ ఏజింగ్ మందుల వినియోగం.. అవయవాలపై తీవ్ర ప్రభావం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వయసు కనిపించొద్దు.. చర్మం ముడతలు పడొద్దు.. లావుగా అనిపించొద్దు.. నిత్యం యవ్వనంగా మెరుస్తూ, మురిసిపోవాలి.. ఇటీవల ఎంతో మందిలో కనిపిస్తున్న ఆశ ఇది. మధ్య వయసుకు వస్తుండగానే చర్మం వదులై, మెరుపు కోల్పోవడం, పొట్ట వద్ద ఉబ్బెత్తుగా మారుతుండటాన్ని చూసి.. ఎక్కడ వయసు మీదపడినట్టు కనిపిస్తామేమోనని చాలా మంది మదనపడిపోతున్నారు. సినీ, టీవీ, మోడలింగ్ రంగాలవారు మొదలు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, ఉద్యోగులు, సాధారణ గృహిణుల దాకా ఈ ఆందోళన కనిపిస్తోంది. దీనితో వయసు తక్కువగా కనిపిస్తుందని చెప్పే 'యాంటీ ఏజింగ్' మందులవైపు చూస్తున్నారు. కొందరు వైద్యుల సలహాతో సాధారణ మోతాదుతో మొదలుపెట్టి, అధిక డోసులకు మారుతుంటే.. మరికొందరు సోషల్ మీడియాలో, ఇంటర్నెట్‌లో చూసి నేరుగా కొనితెచ్చుకుంటున్నారు. విచ్చలవిడిగా, అధిక మోతాదుల్లో యాంటీ ఏజింగ్ మందుల వాడకంతో శరీరంలో అవయవాలు దెబ్బతిని దీర్ఘకాలిక అనారోగ్యాల పాలవుతున్నారు.

ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు..

ఇటీవల ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందిన 'కాంటాలగా' మ్యూజిక్ ఆల్బమ్ ఫేమ్ షెఫాలీ.. పరిమితికి మించి యాంటీ ఏజింగ్ మందులు వినియోగించే వారని గుర్తించారు. ఇక కొన్నాళ్లక్రితం ఓ టీవీ యాంకర్ ఓ వైద్యుడి వద్దకు వెళ్లి యాంటీ ఏజింగ్ మందులు రాయించుకున్నారు. ఆయన తక్కువ మోతాదులో మందులు రాశారు. కానీ ఆమె మెల్లమెల్లగా అధిక డోసులు తెచ్చుకుని వాడటం మొదలుపెట్టారు. ఇది వికటించి పాంక్రియాస్ గ్రంధిపై తీవ్ర ప్రభావం పడి.. ప్రాణాల మీదకు వచ్చింది. వీరేకాదు.. చాలా మంది వయసు కనబడకుండా ఉండాలనే ఉద్దేశంతో యాంటీ ఏజింగ్ మందులవైపు చూస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఆ మందుల దుష్పరిణామాలను తెలుసుకోకుండా ఇబ్బందిపడుతున్నారని, పరిమితికి మించి వాడితే సమస్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.



వయసు.. ఎంత తగ్గినా రెండేళ్లే!

యాంటీ ఏజింగ్ మందుల వల్ల ప్రయోజనం తాత్కాలికం, స్వల్పమేనని వైద్యులు చెబుతున్నారు. ఆహారం, వ్యాయామం, ఇతర అలవాట్లను మార్చుకోకుండా కేవలం యాంటీ ఏజింగ్ మందులు వాడితే.. మహా అయితే ఏడాది, రెండేళ్ల మేర వయసు తక్కువగా కనిపించే అవకాశం మాత్రమే ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. చాలా మంది ఐదు, పదేళ్ల వయసు తక్కువగా ఉండేలా కనిపించాలని కోరుతున్నారని చెబుతున్నారు. ఇక యాంటీ ఏజింగ్ మందులు వినియోగించడం మొదలుపెట్టిన ఏడాది, రెండేళ్లపాటు మాత్రమే సమర్థంగా పనిచేస్తాయని.. ఆ తర్వాత వాటితో ఉపయోగం ఉండదని వివరిస్తున్నారు. ఆ తర్వాత ఒక్కసారిగా వయసు పెరిగినట్టు కనిపిస్తారని పేర్కొంటున్నారు.

అవయవాలపై తీవ్ర ప్రభావం..

యాంటీ ఏజింగ్ మందుల దీర్ఘకాలిక వినియోగం, అధిక మోతాదుల కారణంగా శరీరంలోని కీలక అవయవాలపై ప్రభావం పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. యాంగ్జైటీ, నిద్రలేమి, కుంగుబాటు, రక్తపోటులో తీవ్ర హెచ్చుతగ్గులు, కీళ్ల నొప్పులు, చర్మం సన్నబడటం, కిడ్నీ, కాలేయం, పాంక్రియాస్, జీర్ణవ్యవస్థలో సమస్యలు తలెత్తే ప్రమాదముంటుందని.. కొన్నిమందులతో క్యాన్సర్ బారినపడే ముప్పు పెరుగుతుందని స్పష్టం చేస్తున్నారు.

మంచి జీవన శైలితోనే అందంగా..



ఆరోగ్యకరమైన ఆహారం, నిత్యం వ్యాయామం, పండ్లు, కూరగాయలు తీసుకుంటూ మంచి జీవన శైలిని పాటిస్తే అందంగా కనిపించవచ్చు. అనవసరంగా యాంటీ ఏజింగ్ మందులు వినియోగించి లేనిపోని ఇబ్బందులు తెచ్చుకోవద్దు. కృత్రిమ మందులతో ప్రకృతికి విరుద్ధంగా వ్యవహరించడం సరికాదు.

- డాక్టర్ రాజశేఖర్ మాదాల, కాస్మోటిక్ సర్జన్

గుండె జబ్బులు వచ్చే ముప్పు



వయసును ఎవరూ ఆపలేరు. శరీరంలో సహజంగా జరిగే మార్పులను బలవంతంగా మందులతో నిలువరించడం సాధ్యం కాదు. కొందరు బలమైన కండరాలు, దేహ దారుఢ్యం కోసం స్టెరాయిడ్స్ వాడుతున్నారు. ఇవి గుండె సమస్యలకు దారితీస్తాయి. అవయవాలు విఫలమై ప్రాణాల మీదకు వస్తుంది.

- డాక్టర్ రాహుల్ అగర్వాల్, కేర్ క్లినికల్ డైరెక్టర్

నారాయణ-గూగుల్ క్లౌడ్ భాగస్వామ్యం

- కృత్రిమ మేధ సాయంతో బోధన

హైదరాబాద్, ఆగసు 2 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో నూతన సంస్కరణలు తీసుకురావడానికి నారాయణ విద్యాసంస్థలు, గూగుల్ క్లౌడ్ ఇండియా ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ భాగస్వామ్యంతో విద్యార్థులకు కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో బోధన అందించనున్నారు. ఈ ఒప్పందం ద్వారా నారాయణ గ్రూపు డిజిటల్ వ్యవస్థను గూగుల్ క్లౌడ్‌తో అనుసంధానం చేస్తారు. దీని వల్ల ప్రతి విద్యార్థి సామర్థ్యం, నేర్చుకునే వేగం ఆధారంగా ప్రత్యేక విద్యా ప్రమాణాలు రూపొందిస్తారు. ముఖ్యంగా జేఈఈ, నీట్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ప్రత్యేక సలహాలు, సూచనలు లభిస్తాయి. అంతే కాకుండా దేశంలోని వివిధ భాషల విద్యార్థుల కోసం బహుళ భాషా మద్దతు కూడా అందుబాటులో ఉంటుంది. భవిష్యత్తులో నారాయణ విద్యా సంస్థలు అందించే అన్ని ఏఐ టూల్స్ గూగుల్ క్లౌడ్ టెక్నాలజీపై ఆధారపడి ఉంటాయని ఆ సంస్థల ప్రెసిడెంట్ పునీత్ తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థుల కలలను సాకారం చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

పోచారం ఫ్లాట్లకు 8వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ పరిధిలో పోచారంలో ఉన్న 600 ఫ్లాట్లకు నిర్వహించిన లాటరీలో పోగా మిగిలిన వాటికి ఆగస్టు 8వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తెలిపారు. ఆ ఫ్లాట్లను ఫస్ట్ కమ్ ఫస్ట్ (ముందు దరఖాస్తు చేసుకుంటే వారికే) విధానంలో కేటాయించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఇది సింగిల్, డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లకే వర్తిస్తుందన్నారు. పోచారంలో 1, 2, 3బీహెచ్‌కే కలిపి 600 ఫ్లాట్లున్నాయి. వీటికి ఆగస్టు 1, 2 తేదీల్లో లాటరీ నిర్వహించగా.. 401 ఫ్లాట్లను విక్రయించారు. వీటి విక్రయంతో రూ.78 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా, కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నామని కూడా ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 200 గజాలు అంతకుమించి ఉన్న ప్లాట్లను ఆగస్టు 4 నుంచి మూడు రోజుల పాటు వేలం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని కుర్మలగూడలో 20 ప్లాట్లకు 4న, ఇదే జిల్లాలోని తొర్రూర్‌లో 100 ప్లాట్లకు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని బహదూర్‌పల్లిలో 63 ప్లాట్లకు వేలం నిర్వహించనున్నట్టు ప్రకటనలో తెలిపారు.

ఢిల్లీ యాత్రల్లో రేవంత్ అర్ధ శతకం: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ యాత్రల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్ధ శతకం కొట్టారు తప్ప రాష్ట్రానికి నయా పైసా లాభం చేయలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 50సార్లు ఢిల్లీకి వెళ్లి ఏం సాధించారో చెప్పే దమ్ముందా..? అని ప్రశ్నించారు. ఢిల్లీ యాత్రలతో రాష్ట్రానికి సాధించింది ఏమిటో రేవంత్‌రెడ్డి శ్వేత పత్రం విడుదల చేయాలని కేటీఆర్ శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఢిల్లీ బాసుల కాళ్ల దగ్గర తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. బనకచర్లతో మన వ్యవసాయ రంగం పెను సంక్షోభంలోకి కూరుకుపోతుందని తెలంగాణ తల్లడిల్లుతుంటే.. రేవంత్ మాత్రం గురువు చంద్రబాబుకు వ్యతిరేకంగా పల్లెత్తు మాట కూడా మాట్లాడటం లేదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకపోవడంతో నీళ్లు రాక రైతన్నలు ఇబ్బందులు పడుతుంటే.. సీఎంకు కనీస పట్టింపు లేదన్నారు. కాగా, కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఒక్కొక్కరూ పరకాయ ప్రవేశం చేసి వార్తలు రాస్తున్నారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. కేసీఆర్, బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసే విధంగా ఆధారాలు లేకుండా వార్తలు రాయొద్దని అన్నారు.

దొంగచాటుగా కేటీఆర్ ఢిల్లీ టూర్లు: అద్దంకి

హైదరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఐదు వందల సార్లయినా ఢిల్లీ వెళ్లి వస్తారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. కేటీఆర్, బీఆర్‌ఎస్ నేతలు దొంగ చాటుగా ఢిల్లీ వెళ్లి మోదీ, అమిత్‌షా, సీఎం రమేశ్‌లను కలిసినట్లు రేవంత్‌రెడ్డి కలవట్లేదని స్పష్టం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలను మళ్లించుకున్న కేసీఆర్ కుటుంబానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కోల్పోతున్నారని దయాకర్ అన్నారు. తెలంగాణ నీటి వాటాను తాకట్టు పెట్టిన బీఆర్‌ఎస్ నాయకులు బనకచర్లపై మాట్లాడటం విడ్డూరమని కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలూనాయక్ అన్నారు.

పాలమూరులో కేసీఆర్‌ను గెలిపించలేదా: బక్కని

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో టీడీపీ కార్యకర్తలు ఓట్లు వేసి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించడం మరిచారా? అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు బీఆర్‌ఎస్ నేతలను ప్రశ్నించారు.;ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. సెంటిమెంటు డ్రామాలు ఇక సాగబోవని స్పష్టం చేశారు.

సీఎం ఢిల్లీ పర్యటన తర్వాతే బనకచర్ల ఆగింది: భట్టి



కొల్లాపూర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీ పర్యటన తరువాత బనకచర్ల ప్రాజెక్ట్ ప్రతిపాదన ఆగిపోయిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాక ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. త్వరలోనే పోలవరం, బనకచర్ల వెనుక ఉన్న నిజాన్ని బయట పెడతామన్నారు. తెలంగాణ వృథా చేసే నీటితో బనకచర్ల నిర్మిస్తామని ఏపీ మంత్రి లోకేష్ చేసిన ప్రకటనలు తప్పుదారి పట్టించేలా ఉన్నాయన్నారు. బనకచర్ల, పోలవరం ప్రాజెక్టు పేరుతో తెలంగాణపై కుట్రలు పన్నుతున్నారని భట్టి ఆరోపించారు. తెలంగాణలోని ఎగువ ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలిపోవడం వల్లే దిగువకు నీరు ప్రవహిస్తోందని, తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయ్యాకే బనకచర్లపై తదుపరి చర్య ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ తెలంగాణకు ద్రోహం చేసిందని కృష్ణా, గోదావరి నదులపై ఏ ఒక్క పెద్ద ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయిందని చెప్పారు. ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో బీఆర్‌ఎస్ దోపిడికి పాల్పడిందని భట్టి ఆరోపించారు.

గోదావరిలో మిగులు జలాల్లేవు

- ఉంటే అన్ని రాష్ట్రాలకు సమాన వాటా
- సముద్రంలోకి వెళ్లే నీళ్లన్నీ తమవే అనుకుంటే ఎలా?: ఉత్తమ్

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో మిగులు/వరద జలాలు లేవని.. ఒకవేళ ఉంటే గనక ఆ నీటిపై నదిని పంచుకునే అన్ని రాష్ట్రాలకు సమానవాటా ఉంటుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే వరద జలాలనే తాము బనకచర్ల కోసం వాడుకుంటామని, అందులో తప్పేముంది? అంటూ ఏపీ మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలను ఉత్తమ్ తప్పుబట్టారు. సముద్రంలోకి వెళ్లే నీళ్లన్నీ తమవే అనుకోవడం సరికాదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు 1980లో గోదావరి ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేసిందని, ఆ ప్రాజెక్టుకు ఇచ్చిన అనుమతులకు విరుద్ధంగా పోలవరం విస్తరణను ఏపీ ప్రతిపాదిస్తోందని ఆక్షేపించారు. పోలవరం-బనకచర్ల లింక్‌కు వ్యతిరేకంగా నిర్మాణాత్మక పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. పోలవరం-బనకచర్లపై చట్టపరంగానే ముందుకెళతామని కేంద్ర జల శక్తి శాఖ సమాచారం ఇచ్చిందన్నారు. ఇప్పటికే కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ), గోదావరి/కృష్ణా నది యాజమాన్య బోర్డులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)లు తిరస్కరించాయని తెలిపారు. శనివారం సచివాలయంలోని తన చాంబర్‌లో మీడియాతో ఉత్తమ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయని, అయితే నికర జలాలపై కట్టుకునే ప్రాజెక్టులపైనే ఏపీ అభ్యంతరాలు చెబుతూ.. వరద జలాలపై ప్రాజెక్టులు కట్టుకుంటామని అంటోందని.. ఇదేం తీరు? అని ఆయన ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా తొలి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో గోదావరిలో 3 వేల టీఎంసీల నీళ్లు ఏటా సముద్రంలో కలుస్తున్నాయని ప్రస్తావించిందని.. ఆ నీటిని వినియోగించుకోవడానికి ప్రణాళికలు చేసుకోవాలని తెరమీదికి తెచ్చిందే ఆ పార్టీ అని ఆక్షేపించారు. రాయలసీమకు నీళ్లిచ్చి.. రతనాల సీమను చేస్తామని ప్రకటించింది ఎవరు? అని నిలదీశారు. గోదావరి నదిపై తుమ్మిడిహెట్టి, ఇచ్చంపల్లి, సమ్మక్క సాగర్ అనుమతులు ఇవ్వడమే కాకుండా ఆయా ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కేంద్రం తెలంగాణకు సహకారం అందించాలన్నారు. గోదావరి-కావేరి అనుసంధానం ప్రాజెక్టును ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలని, ఆ ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటితో పనులు చేసుకునేలా కేంద్రం సహాయం అందించాలని కోరారు. కాగా నీటిపారుదల శాఖలో 30 ఏళ్లలో తొలిసారి శాశ్వత ప్రాతిపదికన ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. ఏఈఈ నుంచి ఈఎన్‌సీ దాకా తానే చొరవ తీసుకొని ప్రమోషన్లు ఇచ్చామన్నారు.



ఎన్‌వోసీ కోసం ఛత్తీగఢ్‌కు..

సమ్మక్కసాగర్ బ్యారేజీకి ఎన్‌వోసీ ఇవ్వాలంటూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని మంత్రి ఉత్తమ్ కోరారు. శనివారం ప్రాజెక్టుపై చర్చ జరుగుతున్న క్రమంలో ఆ రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి కేదార్ నాథ్ కశ్యప్‌తో ఆయన ఫోన్లో మాట్లాడారు. సమ్మక్కసాగర్ వల్ల నీటి ముంపుపై ఐఐటీ-ఖరగ్‌పూర్ నివేదిక వచ్చినందున తక్షణ మే ముంపు ప్రాంతాల పరిహారంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

దోచుకున్న సొమ్ముతో దొరికిపోయారు!

- 'సిట్' చేతికి చిక్కిన వీడియో
- రాజ్ కసిరెడ్డి పంపే సొమ్ములు భద్రపరిచి చెవిరెడ్డి చెప్పిన వాళ్లకు అప్పగించిన వెంకటేశ్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

లిక్కర్ స్కామ్ 'దొంగలు' నోట్ల కట్టల సాక్షిగా అడ్డంగా దొరికిపోయారు. మద్యం ముడుపులను... ఎన్నికల సమయంలో ఓట్ల కొనుగోలుకు ఉపయోగించారనే ఆరోపణలకు తిరుగులేని సాక్ష్యం లభించింది. ఇంకెవరో కాదు... లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే అరెస్టయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్య అనుచరుడు వెంకటేశ్ నాయుడు నోట్ల కట్టలను సర్దుతూ... లెక్కలు చెబుతున్న వీడియో బయటపడింది. ఈ కేసులో వెంకటేశ్ నాయుడు (ఏ34)ను సిట్ అధికారులు జూన్ 18వ తేదీన బెంగళూరు ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారు. వెంకటేశ్ నాయుడు ఫోన్‌ను స్వాధీనం చేసుకుని... అందులో వాట్సాప్ నుంచి తొలగించిన చాట్, వీడియోలను సాంకేతిక సహాయంతో రిట్రీవ్ చేశారు. అందులో... 35 సెకన్ల వీడియో ఒకటి ఇప్పుడు బయటపడింది. అందులో... వెంకటేశ్ నాయుడు నోట్ల కట్టలు చక్కగా లెక్కబెడుతున్నాడు. టేబుల్‌పైన ఉన్నవి... కింద అప్పటికే అట్టపెట్టెల్లో సర్దినవి... మొత్తం కలిసి 'ఐదు' (కోట్లు) ఉన్నట్లు ధ్రువీకరిస్తూ ఆ మొత్తాన్ని బట్వాడాకు సిద్ధం చేసిన దృశ్యాలు ఆ వీడియోలో స్పష్టంగా రికార్డు అయ్యాయి. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వైసీపీ అభ్యర్థులకు డబ్బులు పంపుతున్న దృశ్యాలని తెలుస్తోంది.



వీడియోలో నోట్ల కట్టలతో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుచరుడు వెంకటేశ్‌నాయుడు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.